
మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

బిహార్‌లో ఓటర్ల తొలగింపు కుట్ర
గులాబీ, కమలం.. సతమతం..
300కు పైగా డ్రోన్లతో ఉక్రేన్‌పై రష్యా దాడి
లోపలి పేజీల్లో

సంపుటి 28, సంచిక: 31 | ఆదివారం | 20-07-2025 | హైదరాబాద్
Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12 | వెల రూ. 5.00

## శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' బోనాల శుభాకాంక్షలు

### సెలవు

బోనాల సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి ఆదివారం సెలవు. సోమవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.

\- ఎడిటర్



### రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వే

# శాస్త్రీయం, ప్రామాణికం విశ్వసనీయం

- దేశానికే రోల్‌మోడల్‌గా మారుతుంది
- ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ వెల్లడి
- రాష్ట్ర సర్కార్‌కు 300 పేజీల నివేదిక సమర్పణ
- మంత్రివర్గంలో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- బలహీనవర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయానికి నివేదిక దోహదమని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వే శాస్త్రీయమైనది, ప్రామాణికమైనది, విశ్వసనీయమైనదని ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. తెలంగాణ నిర్వహించిన సర్వే చరిత్రాత్మకమని, ఇది దేశానికి రోల్ మోడల్‌గా మారుతుందని నిపుణుల కమిటీ పేర్కొన్నది. నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలను, సూచనలను మంత్రివర్గంలో చర్చించి ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ 300 పేజీలతో కూడిన తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఎంసిహెచ్‌ఆర్‌డిలో శనివారం జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ వర్కింగ్ గ్రూప్ చైర్మన్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అధ్వర్యంలోని నిపుణులు

తరువాయి 2లో



### హైకోర్టు సిజెగా

# ఎ.కె.సింగ్ ప్రమాణస్వీకారం

రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ : హాజరైన సిఎం రేవంత్, మంత్రులు

ప్రజాపక్షం /హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ (ఎకె సింగ్) శనివారం ప్రమాణస్వీకారం చేశారు. జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణస్వీకారం చేయించారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాదరావు, పలువురు మంత్రులు హాజరయ్యారు. ఇప్పటి వరకు తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌లుగా ఆరుగురు పనిచేయగా, ఏడవ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎకె సింగ్ బాధ్యతలు చేపట్టారు.



# ప్రభుత్వానికి భూ వితరణ

రూ.4 కోట్ల విలువ చేసే భూమిని రాసిచ్చిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. తన చిన్నాయన మల్లారెడ్డి ఇచ్చిన యాచారం మండల కేంద్రంలోని 2 వేల గజాల భూమి, అందులో

తరువాయి 2లో

### వానాకాలం పంటలకు

# సమృద్ధిగా సాగునీరు



- రూట్‌మ్యాప్ రూపొందించుకొని తక్షణమే అమలుచేయాలి
- ఏ ఒక్కరైతూ ఇబ్బందిపడొద్దు
- అధికారులకు నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

వానాకాలం పంటలకు సమృద్ధిగా నీరు అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ పంటకు నీటి విడుదలతో పాటు ఆధునిక పరిజ్ఞానంతో ఎస్ఎల్‌బిసి పునరుద్ధరణ, నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఇఎన్‌సిలు అంజద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్ బాబు తదితరులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల సిఇలు, ఎస్‌ఇలు ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వానాకాలం పంటలకు నీటి విడుదలపై రూట్ మ్యాప్

తరువాయి 2లో



### సిపిఐ నేత చందు హత్య కేసులో

# ఐదుగురి అరెస్ట్

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేతావత్ చందు రాథోడ్ హత్య కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ హత్యలో దొంతి రాజేశ్ అలియాస్ రాజన్న, కుంభ ఏడుకొండలు, శ్రీను, అర్జున్ జ్ఞాన ప్రకాశ్, లింగిబేడి రాంబాబు, కందుకూరి ప్రశాంత్‌లను నిందితులుగా గుర్తించినట్లు డిసిపి చైతన్య కుమార్ తెలిపారు. అరెస్టయిన నిందితులను సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి చైతన్య కుమార్ కేసు, అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ నెల 15న మలక్‌పేట్ ప్రాంతంలోని శాలివాహననగర్ పార్క్‌లో ఉదయం వాకింగ్ చేసి వస్తున్న చందును హత్య చేశారని, స్విఫ్ట్ కారులో వచ్చిన దుండగులు కాల్పులు జరిపి పారిపోయారని తెలిపారు. సిసి కెమెరాలు, ప్రత్యక్ష సాక్షులు, గతంలో కొన్ని కేసుల

తరువాయి 2లో



# ఓఆర్ఆర్ వెలుపలికి కాలుష్యకారక పరిశ్రమలు

- తరలింపును వేగవంతం చేయాలి
- ప్రక్రియకు సంబంధించి తుదిగడువును ఖరారు చేయాలి
- కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో అధికారులకు డిప్యూటీ సిఎం భట్టి ఆదేశం

ప్రజాపక్షం / హైదరాబాద్

ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలన్నింటినీ ఓఆర్ఆర్ వెలుపలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో శనివారం ఆదాయ వనరుల సమీకరణ సమావేశంలో మంత్రులు, కమిటీ సభ్యులైన ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు. పరిశ్రమల తరలింపునకు సంబంధించి విధివిధానాలు, తరలింపు క్యాలండర్‌ను రూపొందించాలని, తరలింపు ప్రక్రియకు తుది గడువును ఖరారు చేయాలని సబ్ కమిటీ సభ్యులు అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఉన్న రాజీవ్ స్వగృహ పథకం కింద వివిధ దశల్లో ఉన్న ఇల్లు, హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఉన్న ఖాళీ స్థలాల విక్రయాలకు

తరువాయి 2లో

### మావోయిస్టు విప్లవకారుల మృతదేహాలకు

# భయపడుతున్న బిజెపి


- మరణం తరువాత కూడా ప్రజలను చైతన్యవంతులను చేస్తారని జంకుతున్నారు
- మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రశ్నించేవారిని లేకుండా చేసే కుట్ర
- హామీలు నెరవేర్చకుంటే పోరుబాటే
- ఖమ్మం జిల్లా 23వ మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



ప్రజాపక్షం/ఖమ్మం

మావోయిస్టు విప్లవకారుల మృతదేహాలకు బిజెపి నేతలు భయపడుతున్నారని, హతమార్చిన తర్వాత మృతదేహాలను కుటుంబీకులకు ఇచ్చేందుకు జంకుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. మరణించిన తర్వాత కూడా విప్లకారులు ప్రజలను చైతన్యవంతులను చేస్తారనే భయంతో బిజెపి నేతలు జంకుతున్నారని, విప్లకారులను లేకుండా చేయడం ఎవరితరం కాదన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా 23వ మహాసభలు శనివారం మధిర నియోజకవర్గ కేంద్రంలోని కామ్రేడ్ పోటు ప్రసాద్ నగర్ (రెడ్డి గార్డెన్స్) లో ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాసభలకు ముందు పార్టీ పతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు ఎగురవేశారు. మృతవీరుల స్మారక స్థూపాన్ని రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ బిజెపి నేతలు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రశ్నించే వారిని లేకుండా చేయాలని చూస్తున్నారని, ఈ క్రమంలోనే మావోయిస్టులను తుదముట్టిస్తామని అమిత్‌షా లాంటివారు ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. ప్రజలపక్షాన పనిచేసే కమ్యూనిస్టులను లేకుండా చేయడం ఎవరి తరం కాదని, కమ్యూనిస్టు సిద్ధాంతం విశ్వవ్యాపితమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన కారల్ మార్క్స్ ఆయనకు సహకరించిన ఎంగిల్స్, అమలు చేసిన లెనిన్ ప్రపంచ మానవాళికి కొత్త వెలుగులునిచ్చారన్నారు. సమాజహితం కోరే కమ్యునిస్టుల అవసరం పెరుగుతోందని ఆయన తెలిపారు. ప్రపంచంలో సగం జనాభా కమ్యూనిస్టుల పాలనలోనే ఉన్నారని, దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తే భారత దేశంలో కూడా గణనీయమైన స్థానాలు దక్కుతాయని ఆయన తెలిపారు. బూర్జువా పార్టీల అంతిమ లక్ష్యం అధికారమేనని, కమ్యూనిస్టులకు మాత్రం ప్రజాభ్యుదయం సమాజమార్పు, ఆర్థిక అసమానతలులేని సమాజ నిర్మాణమే లక్ష్యం అన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా పురుడుపోసుకున్న కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే అనేక చట్టాలు రూపొందాయని, సంక్షేమం అమలవుతోందని, ఇప్పుడు బిజేపి ఆ చట్టాలను రద్దు చేసేందుకు ప్రయత్నిస్తుందని కూనంనేని తెలిపారు. ప్రజలపక్షాన కమ్యూనిస్టులు

తరువాయి 12లో



### సభలో లేవనెత్తే ప్రతీ అంశానికీ

# మోదీ సమాధానమివ్వాలి

24 ప్రతిపక్ష పార్టీల నాయకుల ఆన్‌లైన్ సమావేశం డిమాండ్
పహల్గామ్ దాడి, ట్రంప్ వాదనలే, పార్లమెంట్ సమావేశంలో విపక్షాల అస్త్రాలు

06

### అంతర్గత శక్తులతో నేరుగా పోరాడుతా

హుజురాబాద్ అనుచరులతో బిజెపి ఎంపి ఈటల

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి




పార్టీ అంతర్గత శత్రువులతో ఇక నేరుగా పోరాడుతానే తప్ప చాటుగా ఉండదని, తాను ఏ పార్టీలో ఉన్నా అంకిత భావంతో పని చేస్తానని మల్కాజిగిరి నియోజకవర్గ బిజెపి ఎంపి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గం నుండి బిజెపిలోని ఆయన అనుచరులు శనివారం శామీర్‌పేటలోని ఈటల నివాసానికి వచ్చి కలిశారు. తమ రాజకీయ ఎదుగుదలకు జిల్లా పార్టీ అగ్ర నేతలు అడ్డు పడుతున్నారని వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఈటల వారికి అండగా ఉంటానని హామీనిచ్చారు. రాజకీయ కోవర్టుల గురించి బాధపడేది లేదని, వారి సంగతి చూసుకుంటానన్నారు. ఇక పది రోజులకు ఒకసారి హుజురాబాద్‌కు వచ్చి పరిస్థితులను స్వయంగా చక్కబెడుతానని నచ్చజెప్పారు. నియోజకవర్గంలో ప్రతి మండలంలో కార్యాలయం ఏర్పాటు చేసుకుందామని, కార్యకర్తలు కుంగి పోవద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎంత వరకు ఓపిక పట్టాలో తనకు తెలుసన్నారు.

### భారత్ పాక్ ఉద్రిక్తతల్లో ఐదు యుద్ధ విమానాలు

# కూల్చేశారు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు



**వాషింగ్టన్/న్యూఢిల్లీ:** భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల్లో ఐదు యుద్ధ విమానాలను కూల్చివేశారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధ దేశాలు యుద్ధానికి కాలుదువ్వుతుంటే మేము కలగజేసుకుని.. వాణిజ్యం ద్వారా పరిష్కరించాం. దాడులు ఆపకపోతే వాణిజ్య ఒప్పందం చేసుకోమన్నాం. అధికారంలోకి

తరువాయి 12లో

### ట్రంప్ వ్యాఖ్యలపై పార్లమెంట్‌లో

# మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలి



కాంగ్రెస్ డిమాండ్

**న్యూఢిల్లీ :** భారత్ – పాక్ మధ్య వివాదం తన జోక్యం వల్లే సద్దుమణిగిందని, ఇరు దేశాల మధ్య జరిగిన సైనిక ఘర్షణలో ఐదు యుద్ధ విమానాలు కూలిపోయాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందిస్తూ దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పార్లమెంట్‌లో స్పష్టమైన ప్రకటన చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే రెండు దేశాల్లో కలిపి ఐదు యుద్ధవిమానాలు కూలిపోయాయా లేక ఒక దేశానికి చెందినవే కూలిపోయాయా అనేది ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు. కాగా, 'మోదీజీ, ఐదు జెట్‌ల గురించి నిజం ఏమిటి? తమ తెలుసుకునే హక్కు ఉంది' అని ఎక్స్ వేదికగా రాహుల్ పోస్టు చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగడానికి రెండు రోజుల ముందు రెండు సందేశాలతో 24వ సారి ట్రంప్ క్షిపణి ప్రయోగించారని కాంగ్రెస్

తరువాయి 12లో

### ఖాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ పనులు

# ఈ ఏడాది చివరినాటికి పూర్తి

- మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో 2026 నుంచి రైల్వే ఇంజన్లు, బోగీలు, వ్యాగన్లు ఉత్పత్తి
- ఈ ప్రాజెక్టుతో 3వేల మందికి శాశ్వత ఉద్యోగాలు, 2వేల మందికి పరోక్ష ఉపాధి
- కేంద్ర రైల్వేశాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన
- ఖాజీపేటలో ఆర్ఎంయు సందర్శన



ప్రజాపక్షం/హైదరాబాద్/హన్మకొండ

ఖాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో 2026 నుంచి రైల్వే ఇంజన్లు, బోగీలు, వ్యాగన్ల ఉత్పత్తి ప్రారంభం అవుతుందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి శనివారం ఖాజీపేటలోని రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయు )ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్ఎంయు ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ ఆర్ఎంయు ప్రాజెక్టుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన 160,04 ఎకరాల భూమిలో రూ.521.36 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పనలో కాజీపేటలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్

తరువాయి 12లో

### ఒడిశాలో మరో దారుణం

# బాలికకు నిప్పంటించిన దుండగులు



05



# ప్రపంచం
WORLD NEWS

## గాజాలో ఇజ్రాయెల్ ఘాతుకం..



**డెర్ అల్ బలా:** గాజాలో ఇజ్రాయెల్ మరోసారి ఘాతుకానికి పాల్పడింది. అమెరికా బృందం ఒకటి మానవతా సాయం అందిస్తుండగా, అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ప్రజలపై ఇజ్రాయెల్ సైనికులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో కనీసం 32 మంది మృతి చెందారు. స్థానిక వర్గాలు, ఆసుపత్రి వర్గాలను ఉటంకిస్తూ పిటిఐ సమాచారం మేరకు, ఇలాంటి ఘటనలు రెండు చోటు చేసుకున్నాయి. గత ఏడాది మే మాసం నుంచి గాజాలో మానవతా సాయాన్ని గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్ఎఫ్) అందిస్తున్నది. ఐక్యరాజ్య సమితి సహాయక బృందాలు నిర్వహిస్తున్న శిబిరాల వద్ద కూడా ఇజ్రాయెల్ సైనికులు దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. తాజా ఘటన కూడా ఆ కోవకే చెందుతుంది. కాగా, ఇజ్రాయెల్ సైనికాధికారులు ఇప్పటి వరకూ ఈ దాడిపై స్పందించలేదు.

# 300కుపైగా డ్రోన్లతో ఉక్రేన్‌పై రష్యా దాడి



**కీవ్:** కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు కొనసాగుతున్నప్పటికీ ఉక్రేన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తోంది. తాజాగా 300కి పైగా డ్రోన్లు, 30 క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసమైనట్లు ఉక్రేన్ అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారని.. వారిని కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఒడెసా నగరంపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులను రష్యా ప్రయోగించిందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఒకరు చనిపోయారని, చాలా మంది గాయాలపాలైనట్లు తెలిపారు. భారీగా ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఈశాన్య సుమీ ప్రాంతంలో కీలకమైన మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని జెలెన్‌స్కీ తెలిపారు. యుద్ధ సమయంలో తమకు అండగా ఉంటూ.. ఆయుధాలను సరఫరా చేస్తున్న మిత్ర దేశాలకు ఆయన కతజ్ఞతలు తెలిపారు.

**కీవ్‌కు ఆస్ట్రేలియా ఆయుధ సాయం**

ఉక్రేన్‌కు ఆస్ట్రేలియా ఆయుధ సాయం చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం కీవ్‌కు ఎంఐఏ1 అబ్రమ్స్ ట్యాంకులను అందజేసింది. ఇతర సామగ్రిని రాబోయే నెలల్లో పంపనున్నట్లు ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ వెల్లడించారు. ఉక్రేన్‌పై రష్యా చట్టవిరుద్ధమైన, అనైతిక దండయాత్రకు వ్యతిరేకంగా ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

# గూగుల్, మెటాకు ఇడి నోటీసులు

### బెట్టింగ్ యాప్ కేసులో 21న విచారణకు రావాలని ఆదేశాలు




**న్యూఢిల్లీ:** టెక్ దిగ్గజాలు గూగుల్, మెటాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ డి) శనివారం నోటీసులు జారీ చేసింది. ఈనెల 21న విచారణకు హాజరవ్వాలని ఆదేశించింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసుల దర్యాప్తును ముమ్మరం చేసిన క్రమంలో ఈ మేరకు నోటీసులు ఇచ్చింది. ఈ యాప్‌లతో మనీలాండరింగ్, హవాలా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గూగుల్, మెటా సంస్థలు తమ మాధ్యమాల్లో ఇలాంటి యాప్‌లకు విస్తత ప్రచారం కల్పిస్తున్నట్లు ఇడి ఆరోపించింది. బెట్టింగ్ యాప్‌ల ప్రకటనలకు స్లాట్లు కేటాయించడం, వెబ్ లింక్‌లు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొంది. మహదేవ్ బెట్టింగ్ యాప్ స్కామ్ సహా అనేక కుంభకోణాల కేసులపై ఇడి దర్యాప్తు చేస్తోంది. మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో బాలీవుడ్ సెలబ్రిటీలను విచారించింది. చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్ సహా ప్రముఖులపై అభియోగాలు ఉన్నాయి. బెట్టింగ్ యాప్ ప్రమోషన్లలో 29 మంది టాలీవుడ్ సినీనటులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఇసిఐఆర్) నమోదు చేసింది.

# రూ.263 కోట్లు పలికిన డైనోసార్ శిలాజం

**న్యూయార్క్:** ఓ పురాతన డైనోసార్ శిలాజాన్ని వేలం వేయగా దాని ధర 30.5 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.263 కోట్లు పలికింది. న్యూయార్క్‌లోని సోథిబే సంస్థ ఇటీవల అరుదైన వస్తువుల వేలాన్ని ఏర్పాటు చేసింది. అందులో డైనోసార్ శిలాజం ఉంది. ప్రపంచంలో అత్యంత విలువైన మూడో డైనోసార్ అస్థిపంజరంగా ఇది నిలిచింది. శిలాజాన్ని ఎవరు కొన్నారన్న విషయాన్ని భద్రతా కారణాల రీత్యా సోథిబే బయటపెట్టలేదు. ఇది 150 మిలియన్ సంవత్సరాల క్రితం నాటిదని నిర్వాహకులు చెబుతున్నారు. అంగారక గ్రహం నుంచి తెచ్చిన పెద్ద రాయిని కూడా వేలం వేయగా ధర 5.3 మిలియన్ డాలర్లు (రూ.45 కోట్లు) పలికిందని వెల్లడించారు. కాగా, గతేడాది జులైలో అపెక్స్ అనే మరో డైనోసార్ శిలాజం 44.6 మిలియన్ డాలర్లు (రూ.380 కోట్లు) పలికింది.



# జైర్‌పై ఆంక్షలు... ఆ జడ్జి అమెరికా వీసా రద్దు



**సావో పౌలో:** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోస్నారో కదలికల్ని గమనించడం కోసం ఆయన కాలికి ఎలక్ట్రానిక్ పరికరాన్ని అమర్చాలని ఆ దేశ సుప్రీంకోర్టు ఆదేశించడాన్ని అమెరికా తీవ్రంగా పరిగణించింది. ఇందుకోసం ఆదేశించిన జడ్జి అమెరికా వీసాను రద్దు చేసింది. బోస్నారోపై ఆంక్షలు విధించిన జడ్జికి మద్దతు తెలిపిన న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులకూ వీసా ఆంక్షలు వర్తిస్తాయని అమెరికా స్పష్టం చేసింది. తన మిత్రుడైన బోస్నారోపై బ్రెజిల్ న్యాయవ్యవస్థ అన్యాయంగా వ్యవహరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంతకుముందు వ్యాఖ్యానించారు. బోల్సనారోపై బ్రెజిల్ సుప్రీం ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆరోపించారు. న్యాయస్థానం చర్యలు బ్రెజిలియన్ల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే కాకుండా అమెరికన్లను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నంగా పేర్కొన్నారు. 2022 ఎన్నికల్లో ఓటమిని అంగీకరించని బోస్నారో తిరుగుబాటుకు కుట్రపన్నారనే ఆరోపణలున్నాయి. రాత్రిపూట ఇల్లు విడిచి వెళ్లరాదని, విదేశీ రాయబారులతో మాట్లాడరాదని సర్వోన్నత న్యాయస్థానం ఆయనను ఆదేశించింది. సామాజిక మాధ్యమాలు వినియోగించరాదని, తన కుమారుడు ఎడ్వర్డో బోస్నారోతో పాటు ఇతర నిందితులతో మాట్లాడకూడదని తేల్చి చెప్పింది. ఆయన నివాసం, పార్టీ కార్యాలయాల్లో సోదాలకు అనుమతించింది. యాంకిల్ మానిటర్ ధరించాలని ఆదేశించింది.

# హైజాకర్ల రక్షణకు పాకిస్థాన్ చట్ట సవరణ!



**ఇస్లామాబాద్:** ఉగ్రవాదులకు, హైజాకర్లకు ఆశ్రయం కల్పించిన వారికి మరణశిక్షను రద్దు చేసేందుకుగాను పాకిస్థాన్ చట్టాన్ని సవరించింది. సంబంధిత బిల్లుకు పాక్ సెనెట్ ఆమోదం లభించింది. పాక్ పీనల్ కోడ్ చట్టాల ప్రకారం హైజాకర్లకు ఆశ్రయం కల్పిస్తే గరిష్ఠంగా మరణశిక్ష విధించాలి. మహిళలను వేధించడం, వివస్త్రను చేస్తే గతంలో ఉన్న ఏడేళ్ల శిక్షను 1983లో జియా ఉల్‌హక్ హయాంలో మరణశిక్షగా మార్చారు. ఈ తరహా నేరాల్లో శిక్ష తగ్గించాలని డిమాండ్ల క్రమంలోనే క్రిమినల్ చట్ట సవరణ బిల్లు 2025ను తెచ్చారు. అందులో హైజాకర్లకు ఆశ్రయం కల్పించడం, మహిళలను బహిరంగంగా వివస్త్రను చేయడం వంటి నేరాకు శిక్ష తగ్గించే ప్రతిపాదనలకు పాక్ సెనెట్ ఆమోదం తెలిపింది. మరణశిక్షను రద్దు చేసి యావజ్జీవ శిక్ష విధించేలా చట్టాన్ని సవరించింది. అత్యంత తీవ్రమైన నేరాలకు మాత్రమే మరణశిక్ష విధించేలా మార్పు జరిగింది. ఈ బిల్లు త్వరలో చట్టరూపం దాల్చనుంది. విపక్షాలు అభ్యతరాలు వ్యక్తం చేసినాగానీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏకపక్షంగా బిల్లును తీసుకొచ్చింది.

### వలసదారుల జీవనోపాధి అవకాశాలు పెంపుకు

# మొబైల్ వలస సహాయ కేంద్రం

### ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రాష్ట్రంలోని వలసదారులతో పాటు బడుగు, బలహీన వర్గాల సంక్షేమాభివృద్ధికి గాను వారి జీవనోపాధి అవకాశాలను పెంచేందుకు మద్దతుగా 'మొబైల్ వలస సహాయ కేంద్రాన్ని' హైదరాబాద్‌లో శనివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ మొబైల్ వలస కేంద్రం ద్వారా నిజామాబాద్, నారాయణపేట జిల్లాలో వలస వెళ్లుతున్న గ్రామీణ కుటుంబాలకు వలసకు ముందు, ఆ తర్వాత వారి జీవన ప్రమాణాల పెంచేందుకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత, సేవలను అందించనున్నట్లు తెలిపారు. వలస వెళ్లిన కుటుంబాలలో ఒంటరిగా ఉంటున్న మహిళలకు గ్రామాల్లోనే సేవలను అందించేందుకు ఈ మొబైల్ వాహనాలు ఉపయోగపడనుందన్నారు. వారిని శక్తిమంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి వెల్లడించారు. వలస సహాయ కేంద్రం వాహనాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఎంపిక చేసిన ప్రాంతాల్లో రైతులకు మట్టి పరీక్షలు, సేంద్రీయ వ్యవసాయ విధానాలు, పశుపాలనపై వర్చువల్‌గా శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ వాహనం ద్వారా మొబైల్ మట్టి నమూనా పరీక్షలు, పశు తదితర సేవలను కూడా రైతులకు అందించవచ్చాని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యుఎన్ భాగస్వామ్య సంస్థల కృషిని మంత్రి ప్రశంసించారు. ఐక్యరాజ్య సమితికి చెందిన అంతర్జాతీయ వలస సంస్థ (ఐఒఎం), ఎఫ్ఎఒ సంయుక్త అధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, ఎఫ్ఎఓ అగ్రి బిజినెస్ నిపుణులు జగన్‌మోహన్‌రెడ్డి, ఐఒఎం రాష్ట్ర సమన్వయ కర్త జలజ, ఎన్‌డబ్ల్యూడబ్ల్యూటి అధ్యక్షురాలు సిస్టర్ లిస్సీ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్రోరైల్‌పై ఎంపిలకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులకు మెట్రోరైల్‌పై అవగాహన సదస్సును ప్రభుత్వం శనివారం హైదరాబాద్ పార్క్ హయాత్ హోటల్‌లో నిర్వహించింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపిలు మల్లు రవి, కిరణ్ కుమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, అనిల్ కుమార్ యాదవ్, బిజెపి ఎంపిలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావులు హాజరయ్యారు. ఈ సదస్సులో మెట్రోరైల్ రెండవ దశపై పవర్ పాయింట్ ప్రజెంటేసన్ ద్వారా మెట్రోరైల్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి పార్లమెంట్ సభ్యులకు వివరించారు.

## ఆప్ ఎమ్మెల్యే అన్మోల్ రాజీనామా

**చండీగఢ్:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఖరార్ నియోజకవర్గం ఎమ్మెల్యే అన్మోల్ గగన్ మాన్ తన పదవికి రాజీనామా చేశారు. రాజకీయా నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సాంధ్వాన్‌కు తన రాజీనామా లేఖ సమర్పించినట్టు చెప్పారు. బరువెక్కిన హదయంతో రాజకీయాలు విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మాన్ తెలిపారు. తన రాజీనామాను స్పీకర్ ఆమోదించాలని కోరారు. పార్టీకి బెస్ట్ విషెస్ తెలిపారు. పంజాబ్ ప్రజల అంచనాలకు తగినట్టుగా పాలన అందిస్తుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. మాన్ 2022లో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఖరార్ నియోజకవర్గం నుంచి గెలిచారు. భగవంత్ మాన్ మంత్రివర్గంలో కీలక శాఖలు నిర్వహించారు. పర్యాటకం, సాంస్కతిక శాఖ, పెట్టుబడుల ప్రోత్సాహకం, లేబర్ అండ్ హాస్పిటాలిటీ శాఖలు నిర్వహించారు. గత ఏడాది మంత్రివర్గ విస్తరణలో ఆమెకు మంత్రి వర్గంలో చోటుదక్కలేదు. రాజకీయాల్లోకి రాక ముందు పంజాబీ సింగర్‌గా ఆమె మంచి పేరు తెచ్చుకున్నారు.

## ఐదుగురు అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఆధారంగా నెల్లూరుకు చెందిన ఒక ముఠా హత్యలో పాల్గొన్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ప్రధాన నిందితుడు రాజేశ్, చందూ రాథోడ్‌లు ఇద్దరూ కలిసి గుడిసెలు వేయించిన క్రమంలో తేడాలొచ్చాయన్నారు. అలాగే ఆర్థిక వ్యవహారాలలో కూడా విబేధాలు వచ్చినట్లు చెప్పారు. వారి మధ్య వివాదం ముదరడంతో చర్చలు జరిపి రాజీ కుదిర్చినా, రాజేశ్ తన కోపాన్ని వీడలేదన్నారు. ఈ క్రమంలోనే చందు రాథోడ్ హత్యకు ప్లాన్ చేశాడని డిసిపి తెలిపారు. చందు రాథోడ్‌ను హతమార్చేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన గ్యాంగ్‌తో రాజేశ్ సంప్రదింపులు జరిపి, సుపారీ ఇచ్చేందుకు అంగీకరించారని చెప్పారు. హత్యకు ఒక పిస్టోల్‌తో పాటు రివాల్వర్‌ను వినియోగించారని తెలిపారు. అంతేకాకుండా కొబ్బరిబోండాలు కొట్టే కత్తి, కారం పొడి ఉపయోగించారన్నారు. ఈనెల 15వ తేదీన ఉదయం 6 గంటలకు నిందితులందరూ చందు రాథోడ్ ఇంటికి వచ్చి, అక్కడ వేచి ఉన్నార న్నారు. అక్కడ నుంచి నిందితులందరూ బూడిద రంగు స్విఫ్ట్ కారులో శాలివాహన నగర్‌లోని జిహెచ్‌ఎంసి పార్కుకు ఉదయం 7.20 గంటలకు వెళ్లారని, కళ్ళల్లో కారం చల్లి కాల్పులు జరపడంతో చందు రాథోడ్ అక్కడికక్కడే మరణించాడని వివరించారు. అద్దెకు తీసుకున్న స్విఫ్ట్ కారును ఉప్పల్‌లో ఇచ్చేసి అక్కడి నుండి నిందితులు పరారయ్యారని తెలిపారు. కారుపైన వేలి ముద్రలను గుర్తించామని, నెల్లూరుకు చెందిన జ్ఞాన ప్రకాశ్ నెరస్థుడుగా గుర్తించడం, సాంకేతికతతో సిడిఆర్ అనాలసిస్, సిసిటివి ఫుటేజ్, కుటుంబ సభ్యుల వాగ్మూలం తీసుకొని విచారణ జరిపామని తెలిపారు. కావలి చెక్ పోస్ట్ వద్ద అర్జున్ జ్ఞాన్‌ప్రకాశ్, రాంబాబులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వాళ్ళు ఇచ్చిన సమాచారం మేరకు రాజేశ్, ఏడుకొండలును జనగామ జిల్లాలో అదుపులోకి తీసుకున్నామన్నారు. రాజేశ్ దగ్గర 2018 నుంచి ఆయుధాలు ఉన్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి కమిషనర్ సి.వి.ఆనంద్ రూ.2లక్షల రివార్డు ప్రకటించినట్లు డిసిపి వెల్లడించారు. రివార్డును సిబ్బందికి పంపిణీ చేశారు.

**ఎపిలో దొంగతనం..**

ఈ నెల 13న అర్జున్ జ్ఞాన ప్రకాశ్, రాంబాబు అనే వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దొంగతనం చేసిన నగలు, బంగారాన్ని చోరి చేశారని డిసిపి చైతన్య కుమార్ తెలిపారు. కాకినాడలోని శీలా నగర్‌లో బంగారం నగలను దొంగతనం చేశారని చెప్పారు. దీనిపై ఎపి పోలీసులకు సమాచారం ఇచ్చామ న్నారు.

**సైదాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత..**

చందు రాథోడ్ హంతకులను కఠినంగా శిక్షించాలని పలు గిరిజన సంఘాల కార్యకర్తలు డిమాండ్ చేశారు. మీడియా సమావేశం అనంతరం నిందితులను కోర్టుకు తరలిస్తున్న నేపథ్యంలో వాహనాలను చందు రాథోడ్ సానుభూతిపరులు, కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. పోలీసులు వారిని పక్కకు తప్పించి, నిందితులను అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా అక్కడ కొద్ది సేపు ఉద్రిక్తత నెలకొంది.

## సమృద్ధిగా సాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించుకుని తక్షణమే అమలులో పెట్టాలన్నారు. సాగునీటి అంశంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. నీటి విడుదల విషయమై నీటిపారుదల శాఖా మొత్తం దృష్టి కేంద్రీకరించి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చూడాలన్నారు. ఈ వర్షాకాలంలో భారీ నుండి అతి భారీ వర్షాలు సంభవిస్తే ఎదురయ్యే పరిణామాల పట్ల ముందస్తు బందోబస్తు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ప్రధాన ఆనకట్టాల తో పాటు జలాశయాలు, కాలువలను అధికారులు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా అధికారులు సన్నద్ధం కావాలని ఆయన ఆదేశించారు. వర్షా కాలంలో సంభవించే అతి భారీ వర్షాలకు గండ్లు పడకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తులు సంభవిస్తే తక్షణమే నష్టానివారణ చర్యలకు అధికారులు అప్రమత్తంగా ఉండి పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. అటువంటి విపత్తులు సంభవించిన పక్షంలో మిగిలిన శాఖాలతో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ తక్షణమే స్పందిస్తూ నష్టనివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్.ఎల్.బి.సి పునరుద్ధరణ చర్యలు చెవుడుతున్నట్లు ఆయన వెల్లడించారు. సుమారు 10 కిలో మీటర్ల దూరం సొరంగమార్గం పనులు పూర్తి చేసేందుకు గాను చర్యలు తీసుకుంటున్నామన్నారు.తెలంగాణా రాష్ట్రానికి జీవనాడిగా మారనున్న ఎస్ఎల్‌బిసి పనుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పూడిక తీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నీటి సామర్థ్యం పెంపింకందించేందుకు చేపట్టిన పూడిక తీత పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలంలో సంభవించే అతి భారీ వర్షాలతో ప్రమాదాలకు గురయ్యే వాటిని గుర్తించి అత్యవసరంగా పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్యాక్రాంతం అవుతున్న నీటిపారుదల శాఖా భూముల పరిరక్షణకు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌తో నీటిపారుదల శాఖ భూములన్నింటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు.

## విశ్వసనీయం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశమయ్యారు. వర్కింగ్ గ్రూప్ ఛైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కంచె అయిలయ్య, సభ్యులు ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, డాక్టర్ సుఖదేవ్ తొరాట్, నిఖిల్ డే, ప్రొఫెసర్ భాంగ్య భూక్య, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, ప్రొఫెసర్ జీన్‌డ్రెజ్, ప్రొఫెసర్ థామస్ పికెట్టి, ప్రవీణ్ చక్రవర్తి, సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి ఈ సందర్భంగా తమ నివేదికను సిఎంకు అందించారు. వివిధ దఫాలుగా సమావేశాలు జరిపిన కమిటీ డేటాను సేకరించిన పద్ధతి నిశితంగా ఉందని కమిటీ తెలియజేసింది. ప్రభుత్వ విధానాల రూపకల్పనతో పాటు ఇప్పుడు అమల్లో ఉన్న విధానాలను మెరుగుపరిచేందుకు, సామాజిక న్యాయం, సామాజిక సాధికారత, వెనుకబడిన బలహీనవర్గాల వర్గాల అభ్యున్నతిని మెరుగుపరిచేందుకు సహాయపడుతుందని కమిటీ సూచించింది. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మ ణ్, ధనసరి అనుసూయ సీతక్క, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపి మల్లు రవి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సిఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సాంఘీక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ.శ్రీధర్, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.శరత్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### బలహీనవర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయానికి నివేదిక దోహదం

కుల గణన సర్వే కేవలం గణాంకాలు కావని, ఇది తెలంగాణ మెగా హెల్త్ చెకప్ అని స్వతంత్ర నిపుణుల కమిటీతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమావేశంలో సిఎం మాట్లాడుతూ రాష్ట్రంలో బలహీనవర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయాన్ని అమలు చేసేందుకు ఈ నివేదిక ఉపయోగపడుతుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు, ఇందుకు కారణాలపై నిపుణుల కమిటీ అధ్యయనం చేయాలని, ప్రజల అవసరాలను గుర్తించి సరైన సూచనలు ఇవ్వాలని కమిటీని కోరుతున్నానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కులగణన సర్వే విజయవంతంగా నిర్వహించామన్నారు.

**సర్వే జరిగిందిలా ...**

సామాజిక న్యాయం, అన్ని వర్గాల సాధికారత లక్ష్యంగా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల సర్వేను నిర్వహించింది. మొదటి దశలో 2024 నవంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు 50 రోజుల పాటు రాష్ట్రమంతటా సర్వే నిర్వహించింది. రాష్ట్రంలో ఉన్న మొత్తం జనాభాకు చెందిన సమాచారం సేకరించేందుకు ప్రతి జిల్లాలో ప్రతి 150 కుటుంబాలను ఒక బ్లాక్ గా ఎంచుకుంది. ఒక్కో బ్లాక్ కు ఒక ఎన్యుమరేటర్ను, ప్రతి 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా 1,03,889 మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లతో శాస్త్రీయంగా సర్వే చేయించింది. మొదటి విడతలో రాష్ట్రంలో రాష్ట్రంలో 96.9 శాతం కుటుంబాలను సర్వే చేసి ఆయా కుటుంబాల వివరాలను 36 రోజుల్లో డేటా ఎంట్రీ చేయించింది. మొదటి దశలో హౌస్ లిస్టింగ్ చేసిన కుటుంబాలు కొన్ని వేర్వేరు కారణాలతో సర్వేలో తమ వివరాలు నమోదు చేయకపోవటంతో ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు రెండో విడతలో వివరాల నమోదుకు అవకాశం కల్పించింది. మీ సేవా కేంద్రాలు, జీహెచ్ఎంసీ, ఎంపీడీవో ఆఫీసులు, వెబ్సైట్ ద్వారా తమ వివరాలకు నమోదు చేయించింది. ఈ సర్వే ఫలితాల ప్రకారం రాష్ట్రంలో 1,15,71,457 గృహాలు ఉన్నాయి. 1,12,36,849 (97.10 శాతం) కుటుంబాల నుంచి 3,55,50,759 మంది ఈ సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సమగ్ర కుల గణన సర్వే ఫలితాల ప్రకారం రాష్ట్రంలో ఎస్‌సిలు 61,91,294 మంది (17.42 శాతం), ఎస్‌టిలు 37,08,408 మంది (10.43%), బిసిలు 2,00,37,668 మంది (56.36 శాతం), ఇతర కులాలకు చెందిన వారు 56,13,389 మంది (15.89 శాతం) మంది ఉన్నారు. ఈ సర్వే వివరాల నివేదికను ప్రభుత్వం అసెంబ్లీకి సమర్పించింది. సర్వే ఫలితాలను అధ్యయనం చేసి విధాన నిర్ణయాలను రూపొందించేందుకు వీలుగా సర్వే డేటాను విశ్లేషించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి సుదర్శన్‌రెడ్డి అధ్వర్యంలో 11 మంది సభ్యులతో స్వతంత్ర నిపుణుల వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. సర్వే ఫలితాలను విశ్లేషించి వివరణాత్మక నివేదికను అప్పగించే బాధ్యతను ఈ నిపుణుల కమిటీకి అప్పగించింది.

## భూ వితరణ

(మొదటి పేజీ తరువాయి)

నిర్మించిన భవనాన్ని వ్యవసాయ శాఖకు రాసిచ్చారు. ఇందుకు సంబంధించిన పత్రాలను కోదండరెడ్డి సచివాలయంలో శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపికి అందజేశారు. ఆ భూమి విలువ బహిరంగ మార్కెట్లో రూ.4 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. నెలరోజుల కిందనే రైతు కమిషన్ బృందం, వ్యవసాయ అధికారులు కలిసి యాచారం మండలంలో పర్యటించారు. ఆ సమయంలో కోదండరెడ్డి ప్రభుత్వానికి ఇవ్వాలనుకున్న భూమిని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపితోపాటు మార్కెటింగ్ అధికారులకు చూపించారు. ప్రస్తుతం ఆ స్థలంలో రైతు మిత్ర కమ్యూనిటీ భవనం ఉంది. అందులో రైతులు వ్యవసాయ సామాగ్రి, ధాన్యం కొనుగోలు కేంద్రం, సీజన్ పంటలు నిలువ కోసం వాడుకుంటున్నారు. ఇక ఆ స్థలాన్ని, ఆ స్థలంలో ఉన్న భవనాన్ని పూర్తిగా వ్యవసాయ శాఖకు రాసిస్తే రైతులకు మరింత మేలు జరుగుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోదండరెడ్డి తెలిపారు. యాచారం మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని రైతు కమిషన్ కోరింది. దానికి సంబంధించి ప్రైవేట్ స్థలం యాచారం బస్టాండ్‌కు ఆనుకునే ఉన్నట్లు కమిషన్ బృందం మంత్రికి వివరించారు. ఆ స్థలాన్ని సేకరించి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఇక పలు అంశాలపై వ్యవసాయ మంత్రితో కమిషన్ చర్చించింది. ఈ సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, భవానిరెడ్డి, వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ విజయ్ కుమార్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, ఎఓ పాల్గొన్నారు.

## పరిశ్రమలు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి సమావేశంలో సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో కొనసాగే బహిరంగ వేలం ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సబ్ కమిటీ సభ్యులు సూచించారు. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలకు ఇల్లు అందుబాటులో ఉండేలా హౌసింగ్ బోర్డు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. గత నెల రోజుల వ్యవధిలో వివిధ శాఖల ఆదాయాల పెరుగుదలపై వివిధ శాఖలో ఉన్న అధికారులు సమావేశంలో నివేదిక సమర్పించారు. కమర్షియల్ టాక్స్ శాఖలో 1.8 శాతం, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో 3.6 శాతం, గనుల శాఖలో 7 శాతం ఆదాయం పెరుగుదల ఉన్నట్టు అధికారులు మంత్రులకు నివేదించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రదీప్‌కుమార్ సుల్తానియా, పరిశ్రమల శాఖ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, మెట్రోపాలిటన్ ఏరియా నగర అభివృద్ధి శాఖ సెక్రటరీ, ఇలంబర్తి, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్, గనుల శాఖ కమిషనర్ శశాంక, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, టిజిటిడిసి మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతి, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## 18 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చకు బిఆర్ఎస్ సిద్ధమా? : జగ్గారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ప్రజా పథకాలను బ్రహ్మాండగా అమలు చేస్తున్నారని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు తూర్పు జయప్రకాష్‌రెడ్డి (జగ్గారెడ్డి) అన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 10 ఏళ్లలో బిఆర్ఎస్ అమలు చేయలేని పథకాలను కేవలం 18నెలల్లోనే తమ ప్రభుత్వం అమలు చేస్తోందని, వీటిపై చర్చకు సిద్ధమన్నారు. గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మంత్రి పొన్నం ప్రభాకర్, రేషన్ కార్డులు, సన్న బియ్యం, సన్న వడ్లకు బోనస్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఇందిరమ్మ ఇళ్లపై పొంగులేటి శ్రీనివాసరెడ్డి చర్చకు సిద్ధంగా ఉన్నారని, సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌లో ఎక్కడైనా చర్చకు సిద్ధం బిఆర్ఎస్ నేతలు సిద్ధమా అని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి కెటిఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనవసరంగా సిఎం ని రెచ్చగొట్టటం బిఆర్ఎస్ నేతలకే మంచిది కాదని హితవు పలికారు.

## స్వయం సహాయక సంఘాలకు సాధికారతే లక్ష్యం

### ఇందిరా మహిళా శక్తి సంబరాలలో మంత్రి అడ్లూరి

**ప్రజాపక్షం/గొల్లపల్లి:** పేదలకు మంచి చేయాలంటే పదవులే కాదు మంచి మనసు కూడా ఉండాలని మీరందరూ ఈ విషయాన్ని గమనించాలని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ఎండపెల్లి మండలం రాజారాం పల్లె గ్రామంలోని స్థానిక, ఎస్ ఆర్ గార్డెన్ లో శనివారం ప్రభుత్వం తరపున నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడ్డీ రాయితీ కింద 4,683 స్వశక్తి సంఘాలకు 5 కోట్ల 70లక్షల రూపాయల చెక్కులను, స్త్రీ నిధి బ్యాంకు ద్వారా 40 పట్టణ మహిళా పొదుపు సంఘాలకు 32 లక్షల రూపాయల చెక్కులను, అదే విధంగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో భాగం గా 10 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను పంపిణీ చేసి, నూతనంగా మంజూరు అయిన 5ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు.



అనంతరం మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలకు సాధికారత కల్పించడానికి అన్నీ జీవనోపాధి అంశాలలో మహిళలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని, మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించడంతో పాటు లోన్ బీమా, ప్రమాద బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నామని, మహిళల ఆదా యం పెంచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, పాడి పశువుల పెంపకం, ఇందిరా శక్తి క్యాంటీన్, ఆర్టిసికు అద్దె బస్సులు, పాఠశాలలకు ఏకరూప దుస్తులు కుట్టడం వంటి అనేక మార్గాలను అన్వేషిస్తున్నామని, వీటిద్వారా మహిళలకు అదనపు ఆదాయం లభిస్తుందని, ఆర్టిసీకి పెట్టిన అద్దెబస్సు ద్వారా నెలకు 70 వేల రూపాయల ఇస్తున్నామని, మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్ష ల రూపాయల అందిస్తున్నామని, మహిళ సభ్యు లు సాధారణంగా మరణిస్తే 2లక్షల రూపాయల వరకు లోన్ బీమా అమలు అవుతుందని, అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ధర్మపురి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌళిక వసతు ల ఏర్పాటులో మహిళలను భాగస్వామ్యం చేస్తూ వారికి పనులను కేటాయించడం జరిగిందనీ, 127 ప్రభుత్వ స్కూళ్ళలో మరమ్మతులు చేయించడం జరిగిందని, ధర్మపురి నియోజకవర్గంకు 5 కొత్త బస్సులు మంజూరు అయినట్లు తెలిపారు.

## మహాయజ్ఞంలా ప్రకృతి పరిరక్షణ

### హైడ్రా వార్షికోత్సవంలో కమిషనర్ ఎవి రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ''ప్రకృతి పరిరక్షణతోనే మనందరం ఆరోగ్యకర జీవితాన్ని సాగించగలం. ప్రకృతిని మనందరం రక్షించుకోవాలి. అప్పుడే ప్రకృతి మనకు రక్షణగా నిలుస్తుంది. దీనిని హైడ్రా మహాయజ్ఞంలా చేపట్టింది. ఇందులో అందరూ భాగస్వామ్యమైనప్పుడే మరింత ముందుకు తీసుకెళ్లగలం'' అని హైడ్రా కమిషనర్ ఎవి. రంగనాథ్ అన్నారు. హైడ్రాను ఏర్పాటుచేసి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఇండ్ ఫేమ్ విజువల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సామాజిక, పర్యావరణ అంశాలపై వివిధ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రదర్శనను హైడ్రా కమిషనర్ తిలకించారు. అనంతరం రంగనాథ్ మాట్లాడుతూ నగర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెరువులు, పార్కులు, రహదారులు, ఆక్రమణలు కాకుండా కాపాడుతున్నామని తెలిపారు. ఆటంకాలు ఎదురౌతున్నా.. వెరవకుండా భవిష్యత్ తరాలకు పర్యావరణ ఫలాలు అందించేందుకు హైడ్రా అకుంఠిత దీక్షతో పనిచేస్తోందన్నారు. ఆక్రమణలను తొలగించడం చాలా కష్టతరమైందని, కొంత మంది స్వార్థపరుల అత్యాశకు అందరం బలికావొద్దని, మరీ ముఖ్యంగా ప్రకృతి విధ్వంసం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదన్నారు. ప్రకృతికి విఘాతం కలిగించే వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఇందుకు ప్రభుత్వం, ప్రజలు మరీ ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహానికి రంగనాథ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలో కూడా హైడ్రా గురించి అభ్యర్థులను ప్రశ్నించారని తెలిపారు. హైడ్రా వంటి సంస్థ దేశవ్యాప్తంగా ఉన్నప్పుడే ప్రకృతిని కాపాడుకోగలమని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రత్యేకంగా ఒక కథనాన్ని ప్రచురించిందని గుర్తుచేశారు. మనతో పాటు ముందు తరాల భవిష్యత్తు కోసం హైడ్రా పని పనిచేస్తుందని సినీ దర్శకులు తరుణ్ భాస్కర్ అన్నారు. హైడ్రా కార్యకలాపాలపై ఇండ్ ఫేమ్ విజువల్ ఆర్ట్స్‌వ్యవస్థాపకురాలు దాస్యం గీతా భాస్కర్ నిర్వహించిన పలు పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించిన విద్యార్థులకు హైడ్రా కమిషనర్ జ్ఞాపికలు అందజేశారు.



## ఎరుపు అంటే మోదీకి భయం

* ఆపరేషన్ కగార్ ఆపకపోతే మూల్యం తప్పదు

* సిపిఐ పోరాటాలతోనే అనేక చట్టాలు



**ప్రజాపక్షం/నిజామాబాద్:** ఎరుపు అంటే మోడీకి భయం అని నల్ల చట్టాలపై సిపిఐ చేసిన పోరాటాలతో వెనక్కి తగ్గారని, ఆపరేషన్ కగార్ ఆపకపోతే బిజెపి మూల్యం చెల్లించుకోక తప్పదని సిపిఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. నగరంలోని మున్నూరుకాపు కళ్యాణ మండపం మినీ హాల్‌లో షేక్ బాబు ప్రాంగణంలో సిపిఐ నిజామాబాద్ జిల్లా 22వ మహాసభ ఓమయ్య, రాజేశ్వర్, రాజన్నల అధ్యక్షతన నిర్వహించగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ పాల్గొన్నారు. అంతకుముందు పార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకులు కంజర భూమయ్య ఆవిష్కరించి అమరులకు నివాళులర్పించి సుధాకర్ జిల్లా రిపోర్టు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ఇలాంటి జిల్లా మహాసభలు దోహదపడుతాయన్నారు. మార్క్సిజం సిద్ధాంతాల పునాదులపై ఏర్పడినదే సిపిఐ అన్నారు. ఆనాడు దేశంలో ఐదు వందల సంస్థానాలు ఏర్పడిన సమయంలో ఎన్నో పోరాటాలు చేసిన త్యాగధనుల పార్టీ మనదేనన్నారు. ఎన్నో పోరాటాలు చేసి వేలాది మందిని కోల్పోవడం జరిగిందన్నా రు. సిపిఐ నుంచి విడిపోయిన సిపిఐఎం, సిపిఐ ఎంఎల్, అయినా అందరి సిద్ధాంతం ఒకటేనన్నారు. యంత్రాలు లేని సమాజం రావాలని, కావాలని శ్రమకు తగ్గ ఫలితం రావాలని సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. ప్రజాస్వామ్య ముసుగులో బిజెపి ప్రభుత్వం పేదలను, కార్మికులను మోసం చేస్తుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ అంటేనే ప్రశ్నించే గొంతుక అని అలాంటి వారిని జైలులో పెడుతూ బిజెపి హక్కులను కాలరాస్తుందని, ప్రజా సంఘాల రూపకల్పన చేసింది సిపిఐ అన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారని, ఆయన నిర్దోషి అని కోర్టు తీర్పు నివ్వటం జరిగిందన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన బాగానే ఉన్నట్లు అనిపించినా పేదల గురించి ఆలోచించాల్సిన అవసరముందన్నారు. బనకచర్ల ద్వారా ఆంధ్రప్రదేశ్ కృష్ణ, గోదావరి జిలాలు తీసుకెళ్లే ప్రయత్నం మానుకోవాలని అందుకు రాష్ట్ర కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శిర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ కేంద్రంలో ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాలు కార్పోరేట్ శక్తులను వ్యతిరేకిస్తూ సిపిఐ పోరాడుతున్న పరిస్థితి ప్రజలందరికి తెలిసిన విషమేనన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చుకుని రాజ్యాంగం ఆర్టికల్స్‌ను ఏర్పాటు చేసుకుంటే బిజెపి కేంద్రంలో ఎన్నో ఎత్తుగడలు పన్నుతున్నారన్నారు. 2023–24 సంవత్సరంలో పేదరికం తగ్గిందని, పోషకాహారాల స్థాయి పెరిగిందని, ప్రచారాలకు పూనుకున్నారని, అబద్ధపు ప్రచారాలు మానుకోవాలన్నారు. ఇతర రంగాలలో ఉపాధి దొరకక, కార్మికులు వ్యవసాయరంగం వైపు మళ్లుతున్నారని వ్యవసాయరంగం కూడా సంక్షోభంలో ఉందన్నారు. వ్యవసాయరంగం దేశంలో సంపదను సృష్టించడంలో ఉపయోగపడుతుందని చెబుతున్న ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. రైతులకు కావాల్సిన ఎలాంటి సబ్సిడీలు ఇవ్వటం లేదన్నారు. కార్మిక, కర్షక రంగాలలో రోజుకు 8 పని గంటలకు బదులుగా 10 గంటలు, 12 పని గంటలకు పెంచాలని చూడటం సరికాదన్నారు. వామపక్ష పార్టీలతో కలిసి ఎజెండా రూపొందించుకుని మతతత్వ పార్టీపై పోరాటాలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అనంతరం విఠల్‌గౌడ్, సాయిలు, స్వరూపరాణి, రఘురాంనాయక్, అంజలి, దేవేందర్, అనిల్, హన్మాండ్లు, కవిత, భాగ్యలక్ష్మి, మంద వెంకటేశ్వర్లు, ముత్యాలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శిగా సుధాకర్



నిజామాబాద్ సిపిఐ జిల్లా కార్యదర్శిగా పి.సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం సిపిఐ పార్టీ 22వ జిల్లా మహాసభలను ప్రగతినగర్ మున్నూరు కాపు మినీ ఫంక్షన్ హాల్ షేక్ బాబు ప్రాంగణంలో నిర్వహించారు. 21 మంది కౌన్సిల్ సభ్యులు, ఒక ఆహ్వానితులు, ముగ్గురు కాంటెస్ట్‌లు మొత్తం 25 మంది కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌ను చేతులెత్తి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. దీంతో సుదాకర్ రెండవసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నుకోబడినట్టు జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పశ్యపద్మలు ప్రకటించారు.



## బ్రాహ్మణ వెల్లెంలలో జలకళ చూడాలి

### మంత్రి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** లక్షల ఎకరాలకు సాగు నీరందించే బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నీటిని నింపేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు , భవనాల, సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. శనివారం బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ రిజర్వాయర్ యొక్క కుడి, ఎడమ ప్రధాన కాలువల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయలని అధికారులకు ఆదేశించారు. సమీపంలోని దోమలపల్లి చెరువును 10 రోజుల్లో నింపేలా చర్యలు తీసుకోవాలని, ఫీడర్ చానల్ తవ్వకాలను తక్షణమే ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని సూచించారు. భూసేకరణ పరిహారం రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని ఆర్డీవో, ఆడిషనల్ కలెక్టర్‌కు ఫోన్‌లో ఆదేశించారు. ఇప్పటివరకు 15000 ఎకరాలకు సాగునీరు లక్ష ఎకరాల లక్ష్యం సాధించడమే దృఢ సంకల్పంమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, నాయకులు వడ్డె భూపాల్ రెడ్డి, రైతులు, స్థానికులు, ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు అడ్డుకుంటే ఊరుకోం

### బిసి సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకిస్తే వారికి పుట్టగతులుండవని రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బిసిలకు రిజర్వేషన్లు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో శుక్రవారం మాజీ మంత్రి చొక్కారావు జయంతి సందర్భంగా వారి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో సకల జనుల సర్వే చేస్తే బొంబాయి, దుబాయిలో ఉన్నవాళ్లు వచ్చిపోయారన్నారు. తెలంగాణ ప్రభుత్వం లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులతో సర్వే చేసిందని, సర్వేలో పాల్గొనని వారికి కులగణన, రిజర్వేషన్లపై మాట్లాడే అర్హత లేదన్నారు. కులగణన సమీకరించి ఎక్స్‌పర్ట్ కమిటీ వేసి ఏం చేయాలనే దానిపై శనివారం సాయంత్రం 4 గంటలకు మాజీ జడ్జి సుదర్శన్ రెడ్డి కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుందన్నారు. కుల సర్వే తరువాత సబ్ కమిటీ క్యాబినెట్‌కు ఇచ్చి బిల్లును సభలో పెట్టిందన్నారు. ఆ బిల్లు గవర్నర్ నుంచి రాష్ట్రపతి దగ్గరకు వెళ్లిందన్నారు. బీసిలపై ప్రేమ ఉంటే రాష్ట్రపతి దగ్గర ఉన్న బిల్లులను ఆమోదించుకుందుకు ముందుకు రావాలన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు అడ్డంకులు వస్తే ఆర్డినెన్స్ తెచ్చి సవరిస్తున్నామన్నారు. కులగణన మొదలు ఆర్డినెన్స్ వరకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, ఇది కాకుండా ఎలా అమలవుతాయో చెబితే చేస్తామన్నారు. కానీ నడిచే వారి కాళ్లలో కట్టె అడ్డం పెట్టినట్లు చేస్తున్నారన్నారు. కడుపులో కత్తులు పెట్టుకుని పైకి మరోలా వ్యవహరించడం తగదన్నారు. తెలంగాణ కుల సంఘాలు ఎవరూ చూస్తూ ఊరుకోరని, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అన్నీ గమనిస్తున్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కుల సంఘాలు ఎలా పోరాడాయో రిజర్వేషన్లు కాపాడుకోవడానికి తగిన బుద్ధి చెబుతూ పోరాడాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు అండగా ఉండాన్నారు. అంతకుముందు మాజీ మంత్రి చొక్కారావు జయంతి సందర్భంగా నివాళులర్పించి ఆయనతో ఉన్న స్మృతులను గుర్తు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో చొక్కారావు చిరస్మరణీయమన్నారు. నీతినిబద్ధత కలిగిన వ్యక్తిగా ఆయన వద్ద రాజకీయం నేర్చుకోవడం గర్వంగా బావిస్తున్నానన్నారు. దీర్ఘకాలిక రాజకీయాలు చేయాలంటే చొక్కారావును చూసి నేర్చుకోవాలన్నారు. ఆయన వెంట చొప్పదండి ఎమ్మెల్యే మేడపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితర నేతలు, కార్యకర్తలు ఉన్నారు.



## ఘనంగా ఏటుకూరి జన్మదినం

**హైదరాబాద్ :** ప్రముఖ అభ్యుదయ రచయిత, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు డాక్టర్ ఏటుకూరు ప్రసాద్ 90వ పుట్టినరోజు సందర్భంగా నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షులు పల్లా వెంకట్ రెడ్డి, జనరల్ మేనేజర్ మధుకర్, కోశాధికారి రత్నాకర్, మాజీ తెలుగు యూని వర్సిటీ ఉపకులపతి ఎస్వీ సత్య నారాయణ, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, సీనియర్ కమ్యూనిస్టు పార్టీ సభ్యులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, ప్రజానాట్యమండలి కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ నగర శాఖ కార్యదర్శి ఛాయ, ప్రముఖ రైటర్ ఏమిజాల ఆనంద్, నవచేతన పబ్లి షింగ్ హౌస్ మేనేజర్ నారాయణ రెడ్డి అందరూ కలిసి ఏటుకూరి ప్రసాద్ ఇంటికి వెళ్లి వారికి శాలువ, పుష్ప గుచ్ఛంతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కందిమళ్ల ప్రతాప రెడ్డి మాట్లాడుతూ ఏటుకూరి నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఏటుకూరి ప్రసాద్‌గారు ఎప్పుడు నవ్వుతూ నవ్విస్తూ ప్రశాంతమైన జీవితం గడపాలని కోరుకున్నారు. ప్రజానాట్య మండలి పల్లె నరసింహ, ఏటుకూరు ప్రసాద్ రాసిన ఒక విప్లవ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో రచయితలు, శ్రేయోభిలాషులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## ఆదర్శ కమ్యూనిస్టు దొడ్డ నారాయణరావు

సిద్ధాంత నిబద్ధత, ఆచరణీయత, అణకువ, నిరాడంబరత అనే నాలుగు గుణాల కలయికకు ప్రతీక దొడ్డా నారాయణరావు. దాదాపు ఏడున్నర దశాబ్దాలకు పైగా కమ్యూనిస్టు కార్యకర్తగా, ప్రజా ప్రతినిధిగా, నాయకునిగా సమాజ సేవకు, ప్రజా ఉద్యమాలకు తన జీవితాన్ని వెచ్చిస్తూ నిరంతరం ప్రజా సంబంధాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజాసేవయే పరమావధిగా పాటుపడిన నాయకుడు ఆయన.

దొడ్డ నారాయణరావు సమాజ సహజ మిత్రులు. తన నడవడిక ద్వారా, సిద్ధాంత నిబద్ధత వల్ల, తన ఆచరణాత్మక జీవన విధానం ద్వారా అన్ని పార్టీల వారికి, సకల వర్గాల వారికి గౌరవనీయులుగా స్థానం పొందారు.

కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంత నిబద్ధతతో, పార్టీ నియమావళిని తూ.చ. తప్పక పాటిస్తూ, సాదాసీదా జీవనంతో నిరంతరము ప్రజా సమస్యలపై ఉద్యమిస్తూ పరిష్కార మార్గాన్ని చూపించిన మహనీయుడు. అందుకే నేటి కమ్యూనిస్టు కార్యకర్తలకు, యువతకు మార్గదర్శి. తన సుదీర్ఘ పార్టీ ప్రయాణంలో కనబరిచిన ఉద్యమతీరు, పాటించిన వ్యవహారములు ఆచరించి చూపిన మహా వ్యక్తి. అందుకే నేటి యువతరానికి మార్గదర్శకుడు.

**కుటుంబ నేపథ్యం**

దొడ్డ నారాయణరావు ఒక సామాన్యమైన పేద రైతు కుటుంబం నుంచి వచ్చినవారు. వీరి తండ్రి దొడ్డ అప్పయ్య గారికి ఎనిమిది మంది సంతానం. నారాయణ రావు గారు ఆరవ సంతానం. ఉమ్మడి నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ తాలూకాలోని చిలుకూరు గ్రామం. స్వగ్రామంలో ప్రాథమిక పాఠశాలలోనే 4వ తరగతి వరకు చదువుకున్నారు. వీరి భార్య సక్కుబాయి గత సంవత్సరమే చనిపోయినారు. వీరికి ముగ్గురు కుమారులు వారు రమేష్, సురేష్, శ్రీధర్. వీరు తండ్రి బాటలోనే నడుస్తున్నారు.

దొడ్డ నారాయణరావు మూడవ అన్న మాజీ శాసన సభ్యులు దొడ్డ నర్సయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో దళ కమాండర్‌గా ప్రముఖ పాత్ర పోషించారు.

**రాజకీయ ప్రస్థానం**



1941లో 8వ ఆంధ్ర మహాసభ రావి నారాయణ రెడ్డి అధ్యక్షతన చిలుకూరులో జరిగినది. ఆ ప్రాంతంలో భూస్వాములకు, జాగీర్‌దారీ, పెత్తందారీ, దొరల ఆగడాలకు, బలవంతపు లేవిగళ్ళ, శిస్తువసూళ్లకు, వ్యతిరేకంగా దున్నేవానికి భూమి కావాలని, వెట్టిచాకిరికి విధాలకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ పిలుపులో పాల్గొంటూ చురుకైన పాత్ర పోషించారు.

నిజాం రాచరిక వ్యవస్థకు, రజాకార్లకు దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపుతో 1947 నుండి 1951 వరకు వారి సోదరుడు దొడ్డ నర్సయ్యతో సాయుధ పోరాటంలో కొరియర్ గా పాల్గొన్నారు. స్వాతంత్రానంతరం కమ్యూనిస్టు దళాలపై ఇండియన్ యూనియన్ సైన్యం, పోలీసులు తీవ్రమైన నిర్బంధాన్ని, అరెస్టులు చేపడుతున్న సందర్భములో రహస్యం గా కృష్ణ పట్టి ప్రాంతంలో అటు నుండి అమరవాది అడవులలో సంవత్సరపాటు గడిపారు.

1951లో సెప్టెంబర్ లో సాయుధ పోరాటము విరమిస్తున్న సందర్భంలో వారు సత్తెనపల్లి ప్రాంతానికి వెళ్లి, 1952 ఎన్నికల్లో ఆనాడు ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 1962లో ఇండియా చైనా యుద్ధ సందర్భంలోనూ.. అరెస్ట్ కాబడినారు. కమ్యూనిస్టు ఉద్యమం చీలిన సందర్భంగా (1964– 67) కొంతకాలం సిపిఎంలో, అటుతర్వాత సిపిఐ ఎంఎల్ (1968 –71తోను), సిపిఐ ఎంఎల్ నుండి విడిపోయి హుజూర్ నగర్ ప్రాంతీయ కమ్యూనిస్టు పార్టీ(1971–73) వరకు నడుపుతూ,1974లో దొడ్డ నర్సయ్యతో పాటు హుజూర్‌నగర్ ప్రాంతీయ కమిటీ సభ్యులు మొత్తం సిపిఐలో చేరినారు. సిపిఐ హుజూర్ నగర్ తాలూకా కార్యవర్గ సభ్యులుగా, కోదాడ తాలూకా కార్యదర్శిగా (1983– 86) బాధ్యతలో ఉన్నారు. నిజాం సాయుధ పోరాటంలోనూ, దేశ స్వాతంత్ర పోరాటంలోనూ చురుకైన పాత్ర పోషించినందుకు వారిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి స్వాతంత్ర సమరయోధులుగా కేంద్ర ప్రభుత్వం పెన్షన్ అందిస్తున్నది. తెలంగాణ స్వాతంత్ర సమరయోధుల స్మారక ట్రస్టు సభ్యులుగా ఉన్నారు.

**ప్రజా జీవితం**

పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిన 1959 నుండి చిలుకూరు గ్రామానికి1984 వరకు 25 సం.లు సర్పంచ్ గా సేవలందించారు. కోదాడ సమితికి ఉపాధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. మండల వ్యవస్థ ఏర్పాటు కాగానే చిలుకూరు మండలానికి అధ్యక్షులుగా ఎన్నుకోబడి 2 టర్మ్‌లు సేవలందించారు.

**పార్టీలో నిర్వహించిన బాధ్యతలు**

దొడ్డ నారాయణ రావు సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శిగా (1998–2001) నల్లగొండ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా (2001–2009), నల్లగొండ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శిగా(1995–98), సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యులుగా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా 2014 వరకు కొనసాగారు.

అదేవిధంగా మండల వ్యవస్థ ఏర్పాటుతో 1985 –1995 వరకు మండలం, గ్రామాల అభివృద్ధి కొరకు నిరంతరం సేవలందించారు.

**సామాజిక సేవా కార్యక్రమాలు**

దొడ్డ నారాయణ రావు వయసురీత్యా స్వచ్ఛందంగా పార్టీ ప్రజా సంఘాల్లో ఉన్న బాధ్యతల నుండి తగ్గినారు. 1985లో రాష్ట్ర ప్రభుత్వ పిలుపుతో నిరక్షరాస్యత నిర్మూలన..అందరికీ విద్య, చదువు వెలుగు కార్యక్రమాలలోను, మద్యపానం ఆరోగ్యానికి హానికరం అంటూ మద్యాన్ని సేవించకండి–ఆరోగ్యాన్ని నాశనం చేసుకోకండి అని విస్తృతంగా ప్రచారం చేపట్టారు.

ఉత్తమ కమ్యూనిస్టు, నీతి నిజాయితీకి నిలువుటద్దం, సౌమ్యుడు, స్నేహశీలి.. నిరంతరం ప్రజా శ్రేయస్సు కొరకు పాటుపడుతున్న వ్యక్తి దొడ్డ నారాయణరావు ఆదర్శవంతమైన జీవితం గడిపారు.

కామ్రేడ్ దొడ్డ నారాయణరావు అనారోగ్యం కారణంగా 2025 జులై 11న (96) తుదిశ్వాస విడిచారు.

*నోట్: జులై 21న దొడ్డ నారాయణరావు సంతాప సభ సూర్యాపేట జిల్లా చిలుకూరు గ్రామంలో నిర్వహించడం జరుగుతుంది.*

ఉజ్జిని రత్నాకర రావు
సిపిఐ సీనియర్ నాయకులు
9490952646

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎల్‌బినగర్ సర్కిల్-4.
షార్ట్ టెండర్ ప్రకటన
NIT No.14/EEC-4/LBNR/GHMC/25-26 తేది: 19.07.2025
**పని పేరు:** నిర్వహణ పనులు - 1 నెం.లు, **అంచనా విలువ:** రూ.2.70 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 19.07.2025న సా.04.00గం.ల నుండి 22.07.2025న సా.04.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి. కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్ఎంసి.**
DIPR R.O. No. : 5295-PP/CL/ADVT/1/2025-26, Date: 19-07-2025

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెల్ నం. 9705192935, 9515545354
ఆర్.సి.నం. ఎ5/254/2022 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్-కం-బహిరంగ వేలం ప్రకటన-2వ సారి ది: 18.07.2025
ది.01.09.2025 నుండి ది.31.08.2026 వరకు 1 సంవత్సర కాలమునకు **(1) భద్రాచలం నందు, (2) పర్ణశాల దేవాలయముల వద్ద యాత్రికుల ఫోటోలు తీయు లైసెన్సు హక్కు మరియు (3) దేవస్థానమునకు అవసరమైన కంప్యూటర్స్ & ప్రింటర్స్ సరఫరా** చేయుటకుగాను విడి విడిగా ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి. **ఈ-ప్రొక్యూర్‌మెంట్ షెడ్యూల్ తేది:** 19.07.2025 ఉదయం గం. 11:00ల నుండి. **ఈ-టెండర్లు దాఖలుచేయు చివరి తేది:** 28.07.2025 ఉదయం గం.11:00ల వరకు, **టెక్నికల్ బిడ్ తెరచు తేది:** 28.07.2025న మధ్యాహ్నం గం.12:00లకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది:** 28.07.2025న మధ్యాహ్నం గం.12:30 ని.లకు. వ.సం.1 &2 లకుగాను అదే రోజున ఉదయం గం.11:00ల నుండి కార్యనిర్వహణాధికారి వారిచే తానీషా కళ్యాణమండపం నందు బహిరంగ వేలం జరుపబడును. పాటలో పాల్గొనువారు రెండు టెండర్లకు విడి విడిగా **రూ.3,00,000/-లు** ప్రధమ ధరావత్తు సొమ్మును **డి.డి.** ద్వారా చెల్లించి మరియు ఒక్కొక్క లైసెన్సునకు పోస్ట్ డేటెడ్ చెక్స్-3 నం.లు చొప్పున సమర్పించి పాటలో పాల్గొనవలెను. పాట ముగిసిన తదుపరి ఈ-టెండర్లు తెరువబడును. ఈ-టెండర్లు / బహిరంగవేలం పాటలలో వచ్చిన హెచ్చు మొత్తము పరిగణన లోనికి తీసుకొనబడును.
ఇతర వివరములకు https://tender.telangana.gov.in మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును. లేదా ఈ కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.
సం/- ఎల్. రమాదేవి
కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 5267-PP/CL/ADVT/1/2025-26, Date: 19-07-2025




## కొంపముంచిన బర్త్‌డే పార్టీ!





ప్రతిష్టాత్మక బార్సిలోనా ఫుట్‌బాల్ క్లబ్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న స్పెయిన్ టీనేజ్ సంచలనం లామిన్ యమాల్ బర్త్‌డే పార్టీ వివాదాస్పదమైంది. 18వ పుట్టిన రోజు వేడుకలను ప్రత్యేకంగా సెలబ్రేట్ చేసుకోవాలనుకున్న అతను, మరుగుజ్జు మనుషులను ప్రత్యేకంగా పిలిపించాడు. వారితో వివిధ రకాల విన్యాసాలు చేయిస్తూ, ఆహూతులను ఆనందింపచేశాడు. ఈ పార్టీ వీడియోలు వైరల్ కావడంతో, స్పెయిన్ వికలాంగ హక్కుల సమాఖ్య రంగంలోకి దిగింది. యమాల్‌పై కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది. లేకపోతే, అతనికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించింది. స్పెయిన్ సామాజిక హక్కుల మంత్రిత్వ శాఖ సైతం ఈ ఘటనపై స్పందించింది. విచారణకు ఆదేశించింది. ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో వింగర్‌గా అద్భుతమైన ప్రతిభాపాటవాలు కనబరుస్తున్న యమాల్ జన్మదిన వేడుకల్లో మాత్రం తప్పటడుగు వేశాడు. ఈ వివాదం అతనికి కొత్త పాఠం నేర్పే ఉంటుంది.

## రోబోట్ పెయింటింగ్ అదిరింది





'ఎయి డా' అనే రోబోట్ సృష్టిస్తున్న ఆయిల్ పెయింటింగ్స్‌ను చూస్తుంటే, భవిష్యత్తులో చిత్రకారులతో అవసరం ఉండదేమోనన్న అనుమానం కలుగుతోంది. కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత అల్గారిథమ్స్‌ను ఉపయోగిస్తున్న ఈ హ్యూమనాయిడ్ రోబోట్ ఇటీవల గీసిన ప్రిన్స్ చార్లెస్ తైలవర్ణ చిత్రం లక్షలాది మందిని ఆకట్టుకుంటున్నది. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ఆర్ట్ డీలర్ ఎయిడన్ మెల్లర్ తయారుచేసిన ఈ రోబో ఎఐ భాషను అర్థం చేసుకుంటుంది. సమాచారాన్ని సేకరిస్తుంది. దానిని తనకు అనుకూలంగా మార్చుకుంటుంది. 2022లో మొదటిసారి ఈ రోబోట్ 'ఎయి డా' మొట్టమొదటిసారి ఒక ఆయిల్ పెయింట్ వేసింది. ఎలిజబెత్ రాణి చిత్రం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇప్పుడు మరోసారి అలాంటి ప్రతిభనే కనబరుస్తూ, ప్రిన్స్ చార్లెస్ చిత్రం గీసింది. చేయితిరిగిన ఓ గొప్ప చిత్రకారుడి బ్రష్ నుంచి జాలువారినట్టు కనిపిస్తున్న ఈ చిత్రం, 'ఎయి డా' సామర్థ్యానికి మచ్చుతునక. చిత్రకారుల భవిష్యత్తుకు మాత్రం ఈ పరిణామం ఒక సవాలే.

## విమానంలో పాము!



దారి తప్పి ఎలా లోపలికి వచ్చిందో ఏమోగానీ, విమానంలో పామును చూసి సిబ్బంది హడలిపోయారు. అధికారులు అప్రమత్తమై, ప్రయాణికులను విమానం నుంచి కిందకు దింపేశారు. మెల్బోర్న్ విమానాశ్రయంలో బ్రిస్బేన్‌కు వెళ్లాల్సిన వర్జిన్ ఆస్ట్రేలియా ఫ్లైట్ నంబర్ విఎ 337లో తనిఖీలు పూర్తయ్యాయి. ప్రయాణికులు విమానం ఎక్కి, తమతమ సీట్లలో కూర్చోవడానికి ఉద్యుక్తులవుతున్నారు. అదే సమయంలో, విమానం ప్యానెల్స్ మధ్య పాము ఉండడాన్ని చూసిన సిబ్బంది సమాచారాన్ని అధికారులకు అందించారు. పాములు పట్టడంలో నిపుణుడు మార్క్ పెల్లే అక్కడికి చేరుకునేలోపు ప్రయాణికులను ఖాళీ చేయించారు. 60 సెంటీమీటర్ల పొడవుగల ఆ పాము భయంతో విమానం ప్యానెల్స్ లోపలికి వెళ్లిపోతే, దానిని పట్టుకోవడం చాలా కష్టమయ్యేది. అలాంటి ప్రమాదం ఏదీ తలెత్తకుండా పెల్లే దానిని లాఘవంగా పట్టుకోవడంతో కథ సుఖాంతమైంది. తొలుత అత్యంత విషపూరితమైనదిగా భావించానని, కానీ, అది చెట్లపై ఉండే సాధారణమైన సర్పమని పెల్లే వివరించాడు. ఏదిఏమైనా, విమానంలో పాము కనిపించడంతో విమానాశ్రయ ఉన్నతాధికారులు దర్యాప్తుకు ఆదేశించారు.

## ఈ వెక్కిరింత లెవలే వేరు!




ట్రోలింగ్ ఏ స్థాయిలో ఉంటుందో టెక్ కంపెనీ 'ఆస్ట్రానమర్' చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) ఆండీ బైరన్‌కు బాగానే అర్థమై ఉంటుంది. లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఒక బేస్‌బాల్ మ్యాచ్‌లో ప్రేక్షకుల వ్యవహారం అతనిని మరింత ఇరుకున పెట్టింది. వివరాల్లోకి వెళితే, మాసెచూసెట్స్‌లోని బోస్టన్ నగరంలో 'కోల్డ్‌ప్లే' సంగీత విభావరిని బైరన్ తిలకించాడు. అందులో విచిత్రం ఏమీ లేకపోయినా, హఠాత్తుగా తనతో ఉన్న కంపెనీ హ్యూమన్ రిసోర్స్ విభాగం చీఫ్ అకిస్టిన్ కాబొట్‌ను వెనుక నుంచి గట్టిగా వాటేసుకొని, కెమెరా కంటికి చిక్కాడు. 'కోల్డ్‌ప్లే' కంటే అటు భార్యాపిల్లలను, ఇటు కంపెనీని మోసం చేసిన ఘటనగా ఇది సోషల్ మీడియాలో తెగ వైరలైంది. 'కోల్డ్‌ప్లే కిస్ కామ్' అని పేరు స్థిరపడింది. ఈనెల 15న జరిగిన ఘటన అమెరికాలో విపరీతమైన చర్చకు తావిస్తున్నది. కాగా, మేజర్ లీగ్ బేస్‌బాల్ (ఎంఎల్‌బి) టోర్నమెంట్‌లో భాగంగా లాస్ ఏంజిలెస్‌లో ఫిలడేల్ఫియా ఫిల్లిస్, లాస్ ఏంజిలెస్ ఏంజెల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కి హాజరైన ప్రేక్షకులు బైరన్‌ను వెక్కిరించడం మొదలు పెట్టారు. జంటలు పరస్పరం ముద్దులు పెట్టుకుంటూ, బైరన్, కాబొట్‌ను అనుకరించి సందడి చేశారు. మస్కట్ దుస్తులు ధరించి ఒక జంట 'కోల్డ్‌ప్లే కిస్ కామ్' దృశ్యాన్ని రీక్రియేట్ చేయడం, వెక్కిరింతకు పరాకాష్ట. మొత్తానికి ఈ వ్యవహారంపై బైరన్ స్పందించాడు. భార్యాపిల్లలతోపాటు కంపెనీకి కూడా క్షమాపణలు చెప్పుకున్నాడు. భర్తగా, తండ్రిగా, అధికారిగా ఇకపై తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని చెప్పుకొచ్చాడు. ఇప్పటికైనా అమెరికన్లు అతనిని వెక్కించడం ఆపేస్తారో లేదో చూడాలి.

— బిఎస్ఎస్ మైత్రేయి

# సాయుధ పోరాటం విడనాడండి!

ప్రజాపక్షం
20-07-2025, ఆదివారం

సాయుధ పోరాట మార్గాన్ని విడనాడి, కమ్యూనిస్టు ఉద్యమ ప్రధాన స్రవంతిలో చేరవలసిందిగా మావోయిస్టులకు, దేశంలోని ఇతర సాయుధ తిరుగుబాటుదార్ల విభాగాలకు భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) సకాలంలో సరైన విజ్ఞప్తి చేసింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో భద్రతా దళాలు మావోయిస్టులను చంపుతుండగా, 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను పూర్తిగా రూపుమాపుతామని హోం మంత్రి అమిత్‌షా ప్రకటిస్తుండగా— అసమస్థాయి పోరాటంలో విలువైన ప్రాణాలు కోల్పోయే కన్నా, ఏ పీడిత, తాడిత, అణగారిన తరగతుల జనాల అభ్యున్నతి కోసం, భూస్వామ్య, పెట్టుబడిదారీ నికృష్ట దోపిడీకి వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి అడవుల్లో రహస్య జీవితం గడుపుతూ సాయుధ పోరాటం చేస్తున్నారో ఆ విప్లవ శక్తులు ఆ మార్గం విడనాడి ప్రధాన జనస్రవంతిలోకి వచ్చి ప్రజాస్వామిక మార్గంలో ఉద్యమాలు నిర్మించటం వివేకం కాదా? ఆలోచించాలి. మన పొరుగు దేశాలైన శ్రీలంక, నేపాల్‌లో సోదర విప్లవశక్తులు తమ పంథా మార్చుకుని ప్రజాస్వామ్య పంథాలోకి వచ్చి ప్రజల విస్తృత మద్దతుతో రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోలేదా? మొన్నటికి మొన్న, 40 ఏళ్లుగా సాయుధ పోరాటం చేస్తున్న కుర్దిష్ వర్కర్స్ పార్టీ (మార్క్సిస్టు గ్రూపు) టర్కీ రాజకీయ జీవితంలో ప్రవేశించేందుకు ఇరాక్‌లోని సులేమానియా నగరం సమీపంలో ఆయుధాలు విసర్జించి వాటిని ప్రజల సమక్షంలో దగ్ధం చేయలేదా? ఏ దేశంలోనైనా వాస్తవిక భౌతిక పరిస్థితులు, పీడిత ప్రజల పోరాట సన్నద్ధత, వారికి తోడ్పాటు అందించే శక్తులను బట్టి పోరాట రూపాలను ఎంచుకోవటమే విప్లవకారుల కర్తవ్యం. పిడివాదం భారత్‌తోపాటు ఆసియాలో అనేక కమ్యూనిస్టు పార్టీలకు తీరని హాని చేసింది.

భారత భద్రతా దళాలు, ఒకప్పుడు ప్రవేశ దుర్భేధ్యమైన అంబూజ్‌మడ్‌లో 'ఆపరేషన్ కగార్' పేరుతో మావోయిస్టుల "ఏరివేత" సాగిస్తున్నాయి. గత సంవత్సరకాలంలో దేశంలోని పలు ప్రాంతాల్లో వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 357 మంది మావోయిస్టులు చనిపోయినట్లు బస్తర్ రేంజి పోలీసు ఐజి పి.సుందర్ రాజ్ సిపిఐ(మావోయిస్టు) సెంట్రల్ కమిటీ బుక్‌లెట్‌ను ఉటంకిస్తూ తెలిపారు. (హిందూ రిపోర్టు 17/07/25). వారిలో నలుగురు సెంట్రల్ కమిటీ సభ్యులు, 15 మంది రాష్ట్ర కమిటీ స్థాయి సభ్యులు. హతుల్లో 136 మంది మహిళలు. మావోయిస్టు ఉద్యమానికి గుండెకాయలాంటి దండకారణ్య రీజియన్‌లోనే గత సంవత్సరకాలంలో 281మంది మావోయిస్టులను భద్రతా దళాలు హతమార్చాయి. నారాయణపూర్ జిల్లాలో శుక్రవారం ఎన్‌కౌంటర్ మృతులు ఆరుగురు పై సంఖ్యలకు అదనం. ఎందుకీ వృథా బలిదానాలు?

చర్చలకు మావోయిస్టులు చేసిన విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం అంగీకరించలేదు. ఆయుధాలు వీడి లొంగిపోవాల్సిందే అంటోంది. ఇప్పుడు బంతి మావోయిస్టు పార్టీ కోర్టులో ఉంది. ఈ సందర్భంగా, భారతదేశంలో ఆది కమ్యూనిస్టు పార్టీ అయిన సిపిఐ తన శతవార్షికోత్సవం సంవత్సరంలో చండీఘడ్‌లో జరుపుకోబోతున్న 25వ పార్టీ కాంగ్రెస్ చర్చ కోసం రూపొందించిన ముసాయిదా రాజకీయ తీర్మానంలో మావోయిస్టులు సహా సాయుధ పోరాట విభాగాలకు చేసిన విజ్ఞప్తి సమయోచితంగా ఉంది. అన్ని గ్రూపులూ దాన్ని ఆమోదించటం ద్వారా దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి కొత్త జవసత్వాలు చేకూర్చినవారవుతారు. విప్లవోద్యమం మరింత శక్తిమంతంగా ముందుకుపోతుంది. సిపిఐ ఎంతోకాలంగా సాయుధ పోరాట మార్గం ఎంచుకున్న గ్రూపులకు ఇదే విజ్ఞప్తి చేస్తున్నది. అదే సమయంలో బూటకపు ఎన్‌కౌంటర్లతో విప్లవకారులను రూపుమాపుతున్న రాజ్యహింసను వ్యతిరేకిస్తున్నది., అవసరమైన సందర్భాల్లో లీగల్ సహాయం అందిస్తున్నది. అందువల్ల సాయుధ పోరాట మార్గాన్ని విడనాడి ప్రధాన కమ్యూనిస్టు ఉద్యమ స్రవంతిలోకి తిరిగి రావాలని మావోయిస్టులు తదితరులకు విజ్ఞప్తి చేసే నైతిక హక్కు సిపిఐకి ఉంది.

కమ్యూనిస్టు ఉద్యమ సూత్రబద్ధ ఐక్యత కోసం సిపిఐ నిరంతరం విజ్ఞప్తి చేస్తున్నది. నేడు దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపి—ఆర్‌ఎస్‌ఎస్ కూటమి అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక, గుత్త పెట్టుబడిదారీ అనుకూల, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక పార్టీల ఐక్యత, ప్రతిపక్షపార్టీల మధ్య మరింత సమన్వయానికి విజ్ఞప్తి చేస్తున్నది. భారత రాజకీయాల్లో వామపక్షం ఒక బలమైన ధృవంగా తయారయ్యేందుకు వామపక్ష ఐక్యత ప్రాధాన్యతను వక్కాణిస్తున్నది. స్వతంత్రంగా, ఐక్యంగా ప్రజా ఉద్యమాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నది. మావోయిస్టులు, ఇతర కమ్యూనిస్టు గ్రూపులు సహా కమ్యూనిస్టుల విశాల ఐక్యత ఎంతైనా అవసరం.

# బిహార్‌లో ఓటర్ల తొలగింపు కుట్ర



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

బిహార్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనుండగా, ఎన్నికల కమిషన్ హడావుడిగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణను (సర్—ఎస్‌ఐఆర్) చేపట్టింది. ప్రత్యేకించి ముస్లింల, దళితుల, ఆదివాసీల, గ్రామీణ పేదల, వలస కార్మికుల ఓట్లను తొలగించడం ద్వారా వారిని ఎన్నికల్లో పాల్గొనకుండా బిజెపి నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ వేసిన ఎత్తుగడ అని ప్రజలు తీవ్రంగా దుయ్యబట్టారు. ఇంటింటికీ తిరిగి ఓటర్ల రికార్డులను పరిశీలించి జాబితాలను తయారుచేయడానికి ఇసి పూనుకుంది. ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చడానికి బహు డాక్యుమెంట్లను, సర్టిఫికెట్లను సమర్పించాలని ఎన్నికల కమిషన్ షరతు విధించింది. దీనిపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. వ్యక్తిగతమైన తల్లిదండ్రుల వయస్సు, నివాస గృహం అడ్రసుకు సంబంధించిన ఆధారాల సర్టిఫికెట్లను ఇసికి సమర్పిస్తేనే ఓటర్ల జాబితాలో పేరు ఉంటుంది. లేదా పేర్లను తొలగిస్తారు. 2003 తరువాత జన్మించిన వారు పైన పేర్కొన్న సర్టిఫికెట్లను విధిగా సమర్పించాలి. ఈ సర్టిఫికెట్లు లేనివారి పేర్లను తొలగించడానికే కేంద్ర ప్రభుత్వం, ఇసి కలిసి పన్నిన వ్యూహం. ఈ ఎన్నికల్లో గెలవడం కష్టమన్న ఆలోచనతో మోదీ పరివారం ఈ కుట్ర చేసింది. ప్రతిపక్షపార్టీలు, పౌరహక్కుల గ్రూపులు, రాజ్యాంగ నిపుణులు ఈ చర్యపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, ఈ అక్రమ చర్యలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఓటర్ల జాబితా సవరణను చేపట్టడం దుష్టచర్య అని విమర్శిస్తున్నారు.

ఇసి కోరిన సర్టిఫికెట్లు సమర్పించడం వలస కార్మికులు, దళితులు, ఆదివాసీలు, గ్రామీణ పేదలకు అంత తేలికైన పనికాదు. ఎక్కువగా సమయం కూడా ఇవ్వకుండా ఓటర్ల జాబితా సవరణ చేపట్టడం అక్రమ చర్య. ఓటర్లకు ఇది పెద్దసవాలు. ఓటర్ల జాబితాను తారుమారు చేసి తమకు నచ్చని గ్రూపులను జాబితాల నుంచి తొలగించడానికే కేంద్రం చేతిలో ఇసి కీలుబొమ్మగా మారిపోయి ఈ చర్యను చేపట్టింది. వర్షాల సీజన్‌లో ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి అవసరమైన సర్టిఫికెట్లను కూడా తీసుకోవడం ఎంతో కష్టమైనపని. హామీపత్రాలలో తీవ్రమైన తప్పులు జరుగుతాయి. ఓటర్ల వద్ద అవసరమైన సర్టిఫికెట్లు లభించడం కూడా ఎంతో కష్టం. ప్రజల్లో తలెత్తే భయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి కూడా తీసుకువెళ్లారు. ఎన్నికలు త్వరలో జరగనున్నందున ఇంత హడావుడిగా ఈ సర్టిఫికెట్లు సమర్పించాలని చెప్పవలసిన అవసరం ఏమొచ్చిందని న్యాయమూర్తి ఒకరు ప్రశ్నించారు.

రాజ్యాంగపరమైన చెల్లుబాటు ప్రత్యేక సమగ్ర ఎన్నికల సవరణ కోరుతున్న సందర్భాన్ని సైతం కోర్టు ప్రశ్నించి ఉభయపక్షాల వాదనలను వినింది. ఈ వ్యాస రచయిత సిపిఐ ప్రధాన కార్యదర్శి రాజా కూడా కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వారిలో ఉన్నారు. సర్‌ను సవాలు చేస్తూ పది ప్రతిపక్షపార్టీలు కలిపి పిటిషన్ దాఖలు చేశాయి. ప్రతిపక్షాలు వ్యక్తం చేసిన భయాందోళనలను సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకుని ఎన్నికల కమిషన్‌కు తీవ్రమైన ప్రశ్నలు వేసింది. ఎక్కువ సమయంలేని సందర్భంలో ఓటర్లజాబితా సవరణ ఏమిటని కోర్టు ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి ఘాటుగా ప్రశ్నించారు. ఓట్లు వేయడానికి ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఫొటో గుర్తింపుకార్డును అనుమతించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ కార్డులన్నింటినీ ఎన్నికల కమిషన్ జారీ చేసిందే కదా అని న్యాయమూర్తి పేర్కొన్నారు. కోర్టు సర్వసాధారణంగా ఎన్నికల కమిషన్ వివరణలను తీసుకుంది. కమిషన్‌ను ఇబ్బందిపెట్టే వివరాలు కోరిన సూచనలు ఏమీలేవు. రాజకీయపరమైన అనేక విషయాలను సందేహించవలసివస్తుంది. దశాబ్దికిపైగా బిజెపి కేంద్రప్రభుత్వ పాలనను నిర్వహిస్తోంది. ప్రస్తుతం బిహార్‌ను పరిపాలిస్తున్న బిజెపితో సహా వివిధపార్టీల కూటమి నిరంతరం తమ అధికారాన్ని నిలుపుకునేందుకు కొత్తకొత్త పద్ధతులను అనుసరిస్తోంది. బిహార్ అత్యంత కీలకమైన రాష్ట్రం. ఈ రాష్ట్రంలో ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి కుప్పిగంతులు వేయడం చాలా ఎక్కువగా ఉంటుంది.



పార్టీలో చీలిక గ్రూపులు లేదా కూటములను తారుమారు చేయడం ఎక్కువే. ఎన్నికల జాబితా అనిశ్చితిని పరిగణలోకి తీసుకునేందుకు బిజెపికి ఇష్టంలేదు. బిజెపి బిహార్‌లో బలహీనపడింది. అదే సమయంలో మహాఘటబంధన్ బలపడుతోంది. మహాఘటబంధన్‌ను ఎలాగైనా బలహీనపరచేందుకు లేదా చీల్చడానికి బిజెపి రకరకాల ఎత్తుగడలు వేయడం సర్వసాధారణమై పోయిందన్న విషయం జనానికి బాగా తెలుసు. ఇప్పుడు ఓటర్ల జాబితా సవరణ చేపట్టడం లోతైన కుట్రగానే కనిపిస్తోంది. అనేక ఎన్నికల్లో సమర్పించిన వివరాలను తీసుకుని ఓట్లు వేయడానికి అనుమతించిన ఇసి ఇప్పుడీ చర్యను ఎందుకు చేపట్టినట్లు?

అనేకరకాల సర్టిఫికెట్లను తీసుకురావడం ఎంతో క్లిష్టమైన పని. ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికి పేదలను, దళితులను, మైనారిటీలను, ఆదివాసీలను దృష్టిలో పెట్టుకున్నారు. వీరు బిజెపికి ఓట్లువేసే అవకాశం లేదని అనుమానించి కేంద్రం ఇసిని ఎగదోసింది. సరైన పాలనాచర్యకాదిది. అయితే తమ చర్య రాజ్యాంగపరంగా అనుమతించిందేనని, ప్రజాచట్టం ప్రాతినిధ్యం కింద ఈ ప్రక్రియ సరైందేనని ఎన్నికల కమిషన్ సమర్థించుకుంది. ఇటీవల ఎన్నికలు జరిగిన రాష్ట్రాలలో ఓటర్ల జాబితాను సవరించలేదు. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందు కూడా బీహార్‌లో అంతకు ముందున్న ఓటర్ల జాబితాలను అనుమతించారు. అర్హత కలిగిన యువతను చేర్చుకుని ఎన్నికల జాబితాను అనుమతించవచ్చు. ఈ ప్రక్రియ సరిపోతుంది. మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల సందర్భంగా ఓట్లు వేసిన వారి సంఖ్య కొన్నిచోట్ల అపారంగా పెరిగిన అంశంపై ఎన్నికల కమిషన్ స్పష్టమైన వివరణ ఇంకా ఇవ్వవలసి ఉంది. ఎంపిక చేసిన రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణపైన అనేక ప్రశ్నలు ఎదురవుతాయి. ప్రధానంగా ఈ ప్రక్రియ నిస్పాక్షికంగా జరుగుతున్నదా? ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణను బిజెపి, ఆపార్టీ నాయకులకు ఎంతో ఆమోదయోగ్యమైంది. ఇటీవల తమకు అనుకూలమైన ఎన్నికల కమిషనర్లను కొత్తగా నియమించారు. వీరంతా కేంద్ర ప్రభుత్వం సూచించినట్లు పని చేస్తున్నారుగానీ, రాజ్యాంగం ప్రకారం తమకు ఉన్న అధికారాలను అమలు చేయడంలేదు. ఈ చర్య కమిషన్ స్వతంత్రతను బలహీన పరుస్తోంది. గతంలో దృఢమైన చర్యలు చేపట్టి స్వయంప్రతిపత్తిని నిలుపుకోగా ప్రస్తుత కమిషన్ ఈ విషయంలో విఫలమైందని ప్రజావేదికలు, విలేకరుల సమావేశాలలో తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి.

మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టి.ఎన్.శేషన్ ఎంతో సక్రమంగా కర్తవ్యాలను నిర్వహించి ఈ సంస్థ స్వతంత్రతను నిలబెట్టారు. రాజకీయ పార్టీలను, ప్రభుత్వాలను గడగడలాడించారు. ఈనాడు అలాంటి చర్యలు మృగ్యమయ్యాయి. ఇప్పుడున్న కమిషన్‌పట్ల ప్రజలలో విశ్వాసం సన్నగిల్లుతోంది. ప్రత్యేకించి బిహార్‌లోని ఎన్నికల జాబితా సవరణ చేపట్టడంపై సందేహం తలెత్తుతోంది. ప్రజాస్వామ్యంలో తమకు ఉన్న ఓటు హక్కుపై ఏ పౌరుడూ సందేహించకూడదు. అయితే, ప్రస్తుతం బీహార్‌లో సందేహాలను వ్యక్తం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎన్నికల్లో పాల్గొనే ఓటర్ల హక్కులను ఇసి దుర్వినియోగం చేస్తున్నదనిపిస్తోంది. ఈ సవరణ ప్రక్రియ 2024 సార్వత్రిక ఎన్నికల్లో లేదని మళ్లీ తన అర్హతను నిరూపించుకోవాలని కోరడం ఏమిటని ప్రజలు సందేహిస్తున్నారు. తమ గుర్తింపును నిరూపించుకోవలసిన భారం పౌరులపై పెట్టడం ఏమాత్రం సరైందికాదు. బిహార్‌లో బిజెపి రెండు వ్యూహాలపై ఆధారపడింది. మతాల ఆధారంగా ఓటర్లను చీల్చి తాము అధిక ఓట్లు పొందడానికి రాజకీయ రంగంలో మతోన్మాదాన్ని తెచ్చిపెట్టారు. వీరుపన్నిన రెండు వ్యూహాలు కొత్తవేమీకాదు. అయితే మతోన్మాదాన్ని మరింత విస్తరింపచేస్తే అత్యధిక ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది. వీరి వ్యూహాలను మహాఘటబంధన్ నిలువరించాలి. ఇందుకు కేవలం న్యాయపరమైన మార్గాలను మాత్రమే ఎంచుకోకుండా సామాజికంగా, రాజకీయంగా ప్రజలను సమీకరించి ప్రతిఘటించాలి. ఇది ఓటర్ల గణనతో మాత్రమే ఆగిపోదు. ఇది ప్రజాస్వామ్య న్యాయబద్ధతను ప్రశ్నిస్తుంది. బీహార్ ప్రజలు పోరాటాలకు కొత్తవారేమీ కాదు. తాజా పోరాటం కోర్టులకు పరిమితం చేయకూడదు. ప్రతిపౌరుడు ఈ పోరాటాలలో పాల్గొనవలసిందే.

# గులాబీ, కమలం.. సతమతం..




స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాష్ట్రంలో రాజకీయ పార్టీల్లో అంతర్గత వైరుధ్యాలు నెమ్మదిగా పైకొస్తున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలైన బిఆర్ఎస్, బిజెపిలలో ప్రస్ఫుటమవుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణలో అవకాశం దక్కని సీనియర్ కాంగ్రెస్ ఎంఎల్‌ఎలలో అసంతృప్తి గూడు కట్టుకొనే ఉంది. సందర్భం వచ్చినప్పుడు అడపా దడపా వారు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో పాలమూరు బిడ్డే పదేళ్ళు సిఎం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ట్విట్టర్ వేదికగానే సన్నాయినొక్కులు నొక్కారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకు ఇప్పటికే నామినేటెడ్ పోస్టులకు సంబంధించి జిల్లాల వారీగా పేర్లు సిద్ధమయ్యాయి. వారం రోజులలోపే నియామకలు జరగనున్నాయి. వాటి ద్వారా కింది స్థాయిలో అసమ్మతి, అసంతృప్తులను చల్లార్చేందుకు కాంగ్రెస్ చర్యలు తీసుకుంటున్నది.

### బిజెపిలో ముదిరిన పాత వర్సెస్ కొత్త నేతలు

బిజెపి విషయానికి వస్తే రాష్ట్ర నూతన అధ్యక్షుడు రామచంద్రరావు నియామకం నాటి నుంచి తడబాట్లు కనిపిస్తున్నాయి. ఆయన నామినేషన్ ఘట్టంలోనే ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా సమర్పించగా, దానిని వేగంగా పార్టీ అధిష్టానం ఆమోదించింది. బిజెపికి రాజాసింగ్ రాజీనామాను ఆమోదించడాన్ని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అతివాద అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూలులో అనర్హతకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయి. దాని ప్రకారం ఏ సభ్యుడైనా ప్రజాప్రతినిధిగా తాను ఎన్నికైన పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకుంటే, అనర్హత పడేందుకు ఆస్కారం ఉంది. ఒకవేళ ఉప ఎన్నికే జరిగితే బిజెపి మూడుసార్లు గెలిచిన గోషామహల్‌లో విజయం సాధించడం పరీక్షగానే మారుతుంది. అధ్యక్ష ఎన్నిక తరువాత మరో అంతర్గత వ్యవహారం బిజెపిలో తెరపైకి వచ్చింది. అది రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశించి నిరాశ చెందిన ఎంపి ఈటల రాజేందర్‌కు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌ల మధ్య వ్యవహారం. మల్కాజ్‌గిరి ఎంపిగా బిజెపి తరపున ఎన్నికైన ఈటల గతంలో అనేక మార్లు ప్రాతినిధ్యం వహించిన హుజూరాబాద్ శాసనసభ నియోజకవర్గంపై ఆధిపత్యం సమస్య. ప్రస్తుతం ఆ నియోజకవర్గం బండి సంజయ్ ఎంపిగా ఉన్న కరీంనగర్ స్థానం పరిధిలోకి వస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈటల రాజేందర్ వర్గీయులకు టిక్కెట్‌లు ప్రశ్నార్థకమనే వార్తలు వినిపిస్తున్నాయి. ఆ నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా ఈటల వర్గీయులకు సమాచారం లేదనే వార్తలు రాగా, బిజెపిలో వర్గాలు ఉండవని, అంతా మోదీ వర్గమేనని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు విబేధాలను బైటపెట్టాయి. దీనికి ఈటల రాజేందర్ ఘాటుగానే స్పందిస్తూ ఎంత వరకు ఓపికపట్టాలో తనకు తెలుసు అని, కార్యకర్తల రాజకీయ అవసరాలు తీర్చలేనంత నిస్సహాయంగా లేనని, తన అనుభవం వాడుకుంటే పార్టీకే ఉపయోగపడుతుందంటూ వాగ్బాణాలు సంధించారు. మరో ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా బిజెపిలో గ్రూపులు, కార్యకర్తల తీరుపై ఇటీవల బహిరంగంగానే అసంతృప్తిని వెల్లడిస్తున్నారు. కార్యకర్తలు అవసరం లేదని, పార్టీనే అవసరమని ఒకసందర్భంలో, మాంసం తినే వారిని పార్టీలో పక్కనపెడుతున్నారని, అందరినీ కలుపుకుంటేనే అధికారం వస్తుందని చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. రాజాసింగ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముగ్గురూ ఇతర పార్టీల నుంచి బిజెపిలో చేరినవారే. వారిలో రాజాసింగ్ పరమహిందూత్వ వాది. బైటి నుంచి వచ్చిన వారిని బిజెపిలో ఇముడ్చుకోవడంపై అనుమానాల నడుమ స్థానిక సంస్థల ఎన్నికలు ముందుకు వస్తున్నాయి.

### బిఆర్‌ఎస్‌కు ఇబ్బంది కలిగిస్తున్న కవిత దూకుడు

తన తండ్రి, బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావుకు పార్టీలో లోపాలను ఎత్తిచూపుతూ లేఖ రాసి, ఆనక బైటపడిన తరువాత కెసిఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని, బిజెపితో బిఆర్‌ఎస్‌ను కలపాలనే కుట్ర జరిగిందని తీవ్ర ఆరోపణలు చేసిన ఎంఎల్‌సి కవిత దూకుడు ప్రదర్శిస్తున్నారు. తాను లేవనెత్తిన అంశాలపై పార్టీ నుంచి స్పందన రానప్పటికీ, తన స్వంత సంస్థ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేస్తున్నారు. బిఆర్‌ఎస్ కంటే ముందే వివిధ అంశాలపై కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆమె ఆ పార్టీకి ఇబ్బంది కలిగిస్తున్నారనడంలో సందేహం లేదు. ఇదిలా ఉండే కొన్ని అంశాలలో బిఆర్‌ఎస్ వైఖరికి భిన్నంగా స్పందిస్తూ ఇరకాటంలో పెడుతున్నారు. ఉదాహరణకు స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్‌ల పెంపుపై ఆర్డినెన్స్ జారీ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బిఆర్‌ఎస్ తప్పుబట్టగా, కవిత మాత్రం స్వాగతించారు. అంతే కాకుండా, దీనిపై మంత్రివర్గ నిర్ణయం వెలువడిన వెంటనే కార్యకర్తలతో కలిసి రంగులు చల్లుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ఆమెను ఏ మాత్రం ఉపేక్షించవద్దని, పొమ్మనకుండానే దూరం పెట్టాలనే నిర్ణయానికి బిఆర్‌ఎస్ వచ్చినట్లు అర్థమవుతుంది. ఇందుకు ఇటీవల రెండు పరిణామాలే సాక్ష్యం.

బిసి ఉద్యమంతో కవితకేమి సంబంధమంటూ, కంచం, మంచం పొత్తు అనే సామెతతో గత వారం మల్లన్న చేసిన వ్యాఖ్య కొంత కలకలాన్ని సృష్టించింది. వెన్వెంటనే జాగృతి కార్యకర్తలు ఆయనకు చెందిన క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి జరపడంతో ఇరుపక్షాలు మొహరించాయి. అదే సమయంలో మల్లన్న ఎంఎల్‌సి పదవిని రద్దు చేయాలని కవిత శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని స్వయంగా కలిసి కోరడమే కాకుండా, ఒక మహిళపై ఇలాంటి విమర్శలు చేస్తే ముఖ్యమంత్రి స్పందించరా? అని కవిత మీడియా ముఖంగా అన్నారు. విచిత్రంగా, ఈ వ్యవహారంలో ప్రతిపక్ష బిఆర్‌ఎస్ పార్టీ ఆమెకు అండగా నిలబడలేదు. అయితే, సాయంత్రం ఏడుగంటల ప్రాంతంలో టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పత్రికా ప్రకటనను విడుదల చేస్తూ కవితపై వ్యాఖ్యలను, మల్లన్న క్యూన్యూస్ కార్యాలయంపై దాడిని ఖండించారు. అధికార పార్టీ నుంచి స్పందన రావడంతో అనివార్యంగా గంట తరువాత శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి పేరిట కవితపై వ్యాఖ్యలకు ఖండనా ప్రకటన వెలువడిందే తప్ప, ఆ పార్టీ నుంచి ఏ నాయకుడూ స్పందించలేదు. ఇక రెండు, మూడు రోజుల క్రితం సింగరేణి కార్మికులతో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమావేశం ఏర్పాటు చేసి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్‌ను టిజిబికెఎస్‌కు బాధ్యులుగా నియమించారు. ఆ సంఘం ఏర్పడినప్పటి నుండి చాలా కాలంగా కవితనే గౌరవాధ్యక్షురాలుగా వ్యవహరిస్తున్నారు. కవిత అంతకు రెండు నెలల ముందే తెలంగాణ జాగృతికి అనుబంధంగా సింగరేణి జాగృతి పేరుతో సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. అది టిజిబికెఎస్‌తో కలిసి పని చేస్తుందని నాడు చెప్పినప్పటికీ, ఆ దిశగా సాగడం లేదనేది స్పష్టం. అయితే, తీన్మార్ మల్లన్న వ్యాఖ్యల విషయంలో కవితకు అండగా నిలబడాల్సి ఉందనే అభిప్రాయం బిఆర్‌ఎస్ శ్రేణుల్లో వ్యక్తమైంది. మరోవైపు ఉత్తర తెలంగాణలో పలు చోట్ల బిఆర్‌ఎస్ ఓడిపోయిన స్థానాలలో సంస్థాగతంగా తీవ్ర ఇబ్బందులనే ఎదుర్కొంటోంది. వివిధ సామాజిక సమీకరణల కారణంగా ప్రజలు అటు బిజెపి వైపు, లేదా కాంగ్రెస్ వైపో చూస్తున్నారని, తమ వైపు తిప్పుకోవడం కష్టంగానే మారిందని ఒక నేత అన్నారు. సంస్థాగత అంశాలలో ప్రతిపక్ష బిఆర్‌ఎస్, బిజెపిలు సతమతమవుతుండగా, అధికార కాంగ్రెస్ మాత్రం కాస్తంత మెరుగైన స్థితిలో ఉంది.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## పాక్‌తో మ్యాచ్‌లకు తొందరెందుకు?

### బిసిసిఐపై ప్రియాంక చతుర్వేది ఆగ్రహం



**న్యూఢిల్లీ:** వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీకి బిసిసిఐ అనుమతించడాన్ని శివసేన యుటిబి ఎంపి ప్రియాంక చతుర్వేది తప్పుబట్టారు. ప హల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌తో ఎలాంటి సంబంధాలు ఉండవని కేంద్రం చెప్పిన విషయాన్ని ఆమె భారత క్రికెట్ బోర్డుకు గుర్తు చేశారు. పహల్గాంలో దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకోక ముందే పాకిస్థాన్‌తో మ్యాచ్‌లు ఆడటం సరికాదని వ్యాఖ్యానించారు. ఆ దేశంతో ఎలాంటి సంబంధాలు లేవని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, బిసిసిఐ ఇలాంటి నిర్ణయా లు తీసుకుంటుంటే మోదీ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రియాంక చతుర్వేది ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆటగాళ్లకు సంబంధించిన పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. కాగా.. వరల్డ్ ఛాంపియన్స్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీలో భాగంగా ఆదివారం భారత్ ఛాంపియన్స్ పాకిస్థాన్ ఛాంపియన్స్ మధ్య బర్మింగ్‌హామ్ వేదికగా మ్యాచ్ జరగనుంది.

# రాజ్యాంగాన్ని మోదీ ఖూనీ చేశారు

### రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ యత్నిస్తే దేశ ప్రజలు ఒప్పుకోరు : ఖర్గే



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజ్యాంగాన్ని ఖూనీ చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే దేశ ప్రజలు ఎంత మాత్రమూ ఒప్పుకోబోరన్నారు. శనివారం మైసూరులో రూ. 2,500 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. అనంతరం కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన మెగా సమావేశంలో ఖర్గే ప్రసంగించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని సవరించడం లేదా తిరిగి రాయడం గురించి మాట్లాడుతున్నాయని, ఆ రెండు ఎంత ప్రయత్నించినా ఈ దేశ ప్రజలు రాజ్యాంగాన్ని మార్చడానికి అనుమతించబోరన్నారు. రాజ్యాంగం వల్లే ప్రధాని మంత్రి, ముఖ్యమంత్రులు అవుతున్నారని, పార్లమెంటులోకి ప్రవేశించే ముందు మోదీ రాజ్యాంగానికి తలవంచుతారని, కానీ ఆయన నేడు అదే రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. 'బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని తొలగించడానికి ప్రతిరోజూ ప్రయత్నాలు చేస్తున్నాయి' అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి కె శివకుమార్, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పలువురు మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 42 దేశాలను సందర్శించిన మోదీ ఘర్షణలతో అతలాకుతలమైన మణిపూర్‌ను సందర్శించకపోవడాన్ని ఖర్గే విమర్శించారు. 'కారణం ఏమిటి? మీరు (మోదీ) అక్కడికి వెళ్లడానికి భయపడుతున్నారా? రాహుల్ గాంధీ (కాంగ్రెస్ నాయకుడు) రెండుసార్లు సందర్శించారు... దేశ ప్రజలు చనిపోతున్నప్పుడు, మోదీ విదేశాలకు వెళతారా' అని ఆయన ఆరోపించారు. కర్ణాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులకు ప్రశంసలు కురిపిస్తూ, ఇవేమీ చూడని బిజెపి కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతుందని విమర్శిస్తోందన్నారు. గత 55 సంవత్సరాలలో కాంగ్రెస్ ఏమి చేసిందని మోదీ తరచుగా ప్రశ్నిస్తున్నారని, తాము ఏం చేశామో ప్రజల ముందు ఉంది ఉదని, మీరు ఏమి చేశారో చెప్పండి నిలదీశారు. మహారాజులు, జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించిన పెద్ద ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ వంటి వ్యాపార దిగ్గజాలకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. 'అవి మన ఆస్తులు, మన పన్ను డబ్బుతో నిర్మించారు. చాలా మంది అక్కడ పనిచేస్తున్నారు' అని ఎఐసిసి చీఫ్ అన్నారు. 'విమానాశ్రయం, ఓడరేవు, రోడ్లు, విమానయాన సంస్థలు ఇలా ప్రతిదీ ఆయన (మోడీ) కోరుకునే వారికే విక్రయిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొంటూ, తన భావజాలంతో రాజీపడకుండా కాంగ్రెస్ నిరంతరం పనిచేస్తోందని ఖర్గే అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఓడిపోయినా ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకునే కోట్లాది మంది ఇప్పటికీ ఉన్నాన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఐదు హామీ పథకాలను ప్రశంసిస్తూ, అవి దేశవ్యాప్తంగా ప్రజాదరణ పొందాయని ఆయన అన్నారు. కర్ణాటక ప్రభుత్వం దివాలా తీసింది అనే వాదనలను ఖర్గే తోసిపుచ్చారు. ప్రభుత్వం దివాళా తీసి ఉంటే ప్రతి ఎమ్మెల్యేకు వారి నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం రూ. 50 కోట్లు ఇచ్చేదా?' అని అడిగారు. భారతదేశాన్ని ఇప్పుడు సమానత్వం అత్యధికంగా ఉన్న అగ్ర దేశాలలో ఒకటిగా చూస్తున్నారని మోదీ ఇటీవల చేసిన వాదనను ఎత్తి చూపుతూ, దేశంలో పేదల సంఖ్య నెమ్మదిగా పెరుగుతోందని, సంపద కొద్దిమంది ధనవంతుల చేతుల్లో కేంద్రీకృతమైందని, ఇది జరగకూడదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలను ఖర్గే గుర్తుచేశారు.

# ముగిసిన భారత్'-అమెరికా బృందాల 5వ రౌండ్ చర్చలు

### భారత్ తరపున చర్చలకు వాణిజ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ నేతృత్వం



**న్యూఢిల్లీ :** ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం (బిటిఏ) జులై 17న వాషింగ్టన్‌లో భారత్‌అమెరికా బృందాలు 5వ రౌండ్ చర్చలు ముగించాయి. ఈ విషయాన్ని అధికారవర్గాలు తెలియజేశాయి. ఈ చర్చలు వాషింగ్టన్‌లో జులై 14 నుండి 17వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించారు. 'భారత టీమ్ తిరిగి వస్తోంది' అని ఒక అధికారి చెప్పారు. భారతదేశ ప్రధాన సంధానకర్త, వాణిజ్యశాఖలో ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఈ చర్చలకు నాయకత్వం వహించారు. భారత్ మరియు అమెరికా ఇరువర్గాలవైపు ఈ సంప్రదింపులు చాలాముఖ్యమైనవని, భారతదేశం సహా డజన్లకొద్ది దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన (26శాతం) సుంకాలను నిలిపివేసిన ఆగష్టు 1కు ముందు ఇరుపక్షాలు మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయాలని భావిస్తున్న నేపథ్యంలో ఈ చర్చలు ముఖ్యమైనవిగా మారాయి. ఈ ఏడాది ఏప్రిల్ 2న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అధిక పరస్పర సుంకాలను ప్రకటించారు. జులై 9వరకు 90 రోజులపాటు, ఆ తర్వాత ఆగష్టు 1వరకు వివిధ దేశాలతోటి అమెరికా వాణిజ్య ఒప్పందాల చర్చలు జరుపుతున్న నేపథ్యంలో అధిక సుంకాల అమలును వెంటనే నిలిపివేశారు. ఈ 5వ రౌండ్ చర్చలలో వ్యవసాయం, ఆటోమొబైల్స్‌కు సంబంధించిన అంశాలు చోటుచేసుకున్నాయి. మార్కెటేతర ఆర్థికవ్యవస్థలతో ఒప్పందం, ప్రత్యేక రసాయనాలు, ఆర్గానిజమ్స్, మెటీరియల్స్, సామగ్రి, సాంకేతికపరిజ్ఞానాలు) కూడా చర్చల్లోకి వచ్చాయి. 1వ తేదీకి ముందు మధ్యంతర వాణిజ్య ఒప్పందం యొక్క అవకాశం గురించి ఒక అధికారి ఇటీవల ఇలా చెప్పారు. 'మేం ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి మధ్యంతర దశ లేదా మొదటి దశ తేడాను గుర్తించడం లేదు. మేం పూర్తి ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాం. ఏది పూర్తిఅయినా (అంగీకరించబడిన దానిపై) తాత్కాలిక ఒప్పందంగా ప్యాకేజీ చేయవచ్చు. మిగిలిన వాటికోసం చర్చలు కొనసాగుతున్నాయి'. వ్యవసాయం, పాల ఉత్పత్తులపై రాయితీలు ఇవ్వాలన్న అమెరికా డిమాండ్‌పై భారతదేశం తన వైఖరిని కఠినతరం చేసింది. ఇప్పటివరకు స్వేచ్ఛా వాణిజ్యంలో తన వ్యాపార భాగస్వాములకు న్యూఢిల్లీ ఎలాంటి సుంకం రాయితీలు ఇవ్వలేదు. కొన్ని రైతు సంఘాలు పాడి రంగంలో వ్యవసాయానికి సంబంధించిన ఎలాంటి అంశాలను వాణిజ్య ఒప్పందంలో చేర్చవద్దని అభ్యర్థించాయి. ఈ అదనపు సుంకాన్ని (20శాతం) తొలగించాలని భారతదేశం కోరుతున్నది. ఉక్కు, అల్యూమినియంపై (50శాతం), ఆటోమొబైల్ రంగంపై (25శాతం) సుంకాలను సడలించాలని కోరుతోంది. ఈ అంశాలు వాణిజ్య ఒప్పందంలో ముఖ్యమైన భాగమని ఒక అధికారి చెప్పారు. వీటికి వ్యతిరేకంగా భారతదేశం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ప్రతీకార సుంకాలను విధించే హక్కును కలిగిఉన్నది.వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, లెదర్ గూడ్స్, గార్మెంట్స్, ప్లాస్టిక్స్, రసాయనాలు, నూనె గింజలు, ద్రాక్షలు, అరటిపండ్లు వంటి శ్రమతో కూడిన రంగాలకు నిషేధ ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం కోసం కూడా భారతదేశం సుంకం రాయితీలను కోరుతోంది. మరోవైపు అమెరికా పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్, ప్రత్యేకించి ఎలక్ట్రికల్ వాహనాలు, వైన్స్, పెట్రోకెమికల్ ప్రోడక్ట్స్, వ్యవసాయ వస్తువులు, డైరీ ఐటెమ్స్, ఆపిల్స్, ట్రీనట్స్, జన్యుపరంగా మార్పుచెందిన పంటలపై సుంకం రాయితీలు కోరుతోంది. ఏదిఏమైనప్పటికీ మొదటి విడత ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ముగించాలని చూస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో అమెరికాకు భారతదేశం నుంచి వస్తువుల ఎగుమతులు 22.8 నుంచి 25.51 బిలియన్లు పెరిగాయి. అయితే 11.68శాతంతో పోలిస్తే 12.86 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

# పార్లమెంటు సమావేశాల వేళ విదేశాలకు మోదీ



**న్యూఢిల్లీ:** పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న వేళ ప్రధాని నరేంద్రమోదీ విదేశీ పర్యటనలకు వెళ్లడం సర్వసాధారణమైంది. విపక్షాల నుంచి విమర్శలు వస్తున్నప్పటికీ మోదీ పట్టించుకోవడం లేదు. తాజాగా ప్రధాని మోదీ వచ్చే వారంలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. జులై 23 నుంచి 26 వరకు బ్రిటన్, మాల్దీవుల్లో మోదీ పర్యటించనున్నట్లు తెలిపాయి. గతేడాది మోదీపైనా, లక్షద్వీప్‌పైనా మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నాయి. విభేదాల అనంతరం ప్రధాని ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాల్దీవులతో బలమైన దౌత్య సంబంధాలు, పరస్పర ప్రయోజనాలు పునరుద్ధరించడానికి ఈ పర్యటన సహకరిస్తుందని అధికారులు పేర్కొన్నారు. జులై 2324 తేదీలలో మొదట బ్రిటన్‌లో జరగనున్న భారత్‌బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై జరిగే చర్చల్లో మోదీ పాల్గొంటారని, ఒప్పందంపై సంతకం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. బ్రిటన్ ప్రభుత్వంతో దౌత్య, వాణిజ్య చర్చలు జరపనున్నారు. అనంతరం జులై 2526 తేదీలలో ప్రధాని మాల్దీవులకు వెళ్లనున్నారు. మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరవుతారు.



# యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదం

### ఆరుగురి దుర్మరణం

**మథుర:** ఉత్తరప్రదేశ్‌లోని మథురాలో యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మతి చెందినట్లు అధికారులు తెలిపారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి మొదట డివైడర్‌ను ఢీకొట్టి... పల్టీలు కొడుతూ మరో వాహనాన్ని బలంగా ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో కారులోని ఆరుగురు వ్యక్తులు ఘటనా స్థలంలోనే మతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

# ఆర్‌ఎస్‌ఎస్ ముసుగులో చంగూర్ బాబా అరాచకాలు


### ఉత్తరప్రదేశ్ పోలీసుల వెల్లడి



**లక్నో:** జమాలుద్దీన్ అలియాస్ చంగూర్ బాబా అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. బాబా ముసుగులో పెద్ద ఎత్తున హిందూ అమ్మాయిలను మతం మార్చే నెట్‌వర్క్‌ను ఉత్తరప్రదేశ్ పోలీసులు కనుగొన్నారు. నేపాల్ సరిహద్దుల్లోని బలరాంపూర్ జిల్లా మాధ్‌పూర్ కేంద్రంగా అక్రమ మత మార్పిడి మాఫియాను ఆయన నడిపిస్తున్నాడు. లవ్‌జిహాద్‌తో హిందూ మహిళలను వలలో వేసుకునేందుకు ముస్లిం యువకులకు లక్షల్లో డబ్బు ఇచ్చినట్లు వెలుగులోకి వచ్చింది. ఇందుకు అవసరమైన నిధులు ఇస్లామిక్ దేశాల నుంచి వచ్చాయి. చంగూర్ బాబా తనకు ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటూ తిరిగే వాడని తెలిసింది. అధికారులను కలిసేటప్పుడు తాను ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ సీనియర్ కార్యకర్త అని చెప్పుకున్నాడు. చంగూర్ బాబా సంస్థ లెటర్ హెడ్‌పై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫొటోను కూడా ఉపయోగించుకున్నట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. ఈ కేసులో మరో కీలక నిందితుడు ఈదుల్ ఇస్లాం నిర్వహిస్తున్న భారత్ ప్రతికార్త్ సేవా సంఘ్ అనే సంస్థకు చంగూర్ బాబాను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సంస్థ పేరును వ్యూహాత్మకంగా ఎంచుకున్నట్లు అధికారులు గుర్తించారు. అధికారులు, రాజకీయ నాయకులతో సమావేశాల సమయంలో చంగూర్ బాబా, తనను నమ్మేలా ప్రముఖ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల పేర్లను వాడే వాడని తెలుస్తోంది. అతను విదేశీ నిధుల సహాయంతో ఉగ్రవాద శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కుట్ర పన్నుతున్నాడని ఉత్తరప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. గల్ఫ్ దేశాలు, పాకిస్థాన్ సహా విదేశీ వనరుల నుండి అతను రూ.500 కోట్లకు పైగా నిధులు అందుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసును ఈడీ కూడా విచారిస్తోంది. చంగూర్ బాబా, అతడి సహచరులకు సంబంధించిన 22 బ్యాంకు ఖాతాలు పరిశీలిస్తే రూ.60 కోట్ల విలువైన మనీలాండరింగ్‌కు సంబంధించిన ఆధారాలు వెలుగులోకి వచ్చాయి.

# పాక్ 'కిరాణా హిల్స్'పై భారత్ దాడి నిజమే

### ఉపగ్రహ ఫొటో నిపుణుడు సైమన్ వెల్లడి



**న్యూఢిల్లీ:** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌పై ప్రతీకారం తీర్చుకుంది. ముందుగా ఉగ్రవాద స్థావరాలను దెబ్బతీసిన భారత్... ఆ తర్వాత పాకిస్థాన్ కవ్వింపులకు దీటైన సమాధానం ఇచ్చింది. పాకిస్థాన్ వైమానికదళానికి చెందిన 11 ఎయిర్ బేస్‌లపై దాడి చేసింది. ఇందులో నూర్‌ఖాన్ ఎయిర్ బేస్, రఫికీ, సర్గోదా, జకోబాబాద్, స్కర్దు వంటివి ఉన్నాయి. అయితే, ఆ సమయంలో పాకిస్థాన్‌లోని సర్గోద జిల్లాలోని 'కిరాణా హిల్స్' పేరు ప్రముఖంగా వినిపించింది. పాకిస్థాన్ అణ్వాయుధాలు దాచే స్థలంగా పేరున్న ఈ కిరాణా హిల్స్ సమీపంలో భారత్ క్షిపణి దాడి చేసిందని ఊహాగానాలు చెలరేగాయి. అయితే, మీడియా సమావేశాల్లో మాత్రం భారత వైమానిక దళం బహిరంగంగా ఈ వాదనలను ఖండించింది. కానీ, కిరాణా హిల్స్ ప్రాంతంలో క్షిపణి దాడి జరిగిందని ప్రముఖ శాటిలైట్ ఫొటో నిపుణుడు డామియన్ సైమన్ స్పష్టం చేశారు. జూన్ 2025లో తీసిన గూగుల్ ఎర్త్ ఫొటోలను ఆయన విశ్లేషించి ఈ విషయాలు వెల్లడించారు. మే 2025లో ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ క్షిపణి దాడి తర్వాత, ప్రభావితమైన ప్రాంతానికి చెందిన చిత్రాలను ఆయన చూపించారు. ఈ కిరాణా హిల్స్ సమీపంలోనే పాకిస్థాన్ కీలకమైన ఎయిర్ బేస్ సర్గోద ఉంది. ఈ ఎయిర్ బేస్ భారత దాడిలో తీవ్రంగా ధ్వంసమైంది. ఇప్పుడు పాకిస్థాన్ మరమ్మతులు చేసుకుంటున్న ఫొటోలను కూడా సైమన్ వెల్లడించారు. భారత్‌కు చెందిన ఆదంపూర్ ఎయిర్ బేస్‌లోని ఎస్400 వైమానిక రక్షణ వ్యవస్థను నాశనం చేసినట్లు పాకిస్థాన్ చేస్తున్న వాదనలను సైమన్ తోసిపుచ్చారు.

# ఒడిశాలో మరో దారుణం బాలికకు నిప్పంటించిన దుండగులు

### మృత్యువుతో పోరాడుతున్న బాధితురాలు



**భువనేశ్వర్:** బిజెపి పాలిత రాష్ట్రాల్లో బాలికలు, మహిళలపై నేరాలుఘోరాలు పేట్రేగిపోతున్నాయి. భరతమాత అంటూ గొప్పలు చెప్పుకునే కమనాధుల పాలనలో స్త్రీజాతికి రక్షణ కరువైపోయింది. గడప దాటితే క్షేమంగా ఇంటికి చేరుకుంటారన్న భరోసా లేకుండా పోయింది. ఇటీవల కాలంలో ఒడిశాలో నేరాలు పెరుగుతున్నాయి. 20ఏళ్ల కాలేజీ విద్యార్థిపై పది మంది కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన మరువక ముందే ఆ రాష్ట్రంలో మరో దారుణం జరిగింది. స్నేహితురాలి ఇంటికి వెళతున్న 15 ఏళ్ల బాలికను ముగ్గురు దుండగులు అడ్డుకొని... ఆమెకు నిప్పంటించి పరారైన అమానవీయ ఘటన పూరీ జిల్లా బయాబర్ గ్రామంలో చోటుచేసుకుంది. శరీరమంతా కాలిపోవడంతో ఆమె మృత్యువుతో పోరాడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో అమెకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. బాధితురాలు 12వ తరగతి విద్యార్థిని. తన స్నేహితురాలి పుస్తకాలను తిరిగి ఇచ్చేందుకు ఉదయం 8.30 గంటలకు బయల్దేరిన ఆమెను ముగ్గురు అడ్డుకున్నారు. బలవంతంగా భార్గవి నది సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించి... అక్కడ నుంచి పారిపోయారు. ఈ మేరకు పోలీసు అధికారి వెల్లడించారు. మంటల్లో కాలుతూ అరుస్తున్న బాలికను చూసిన స్థానికులు వెంటనే స్పందించారు. మంటలు ఆర్పి, ఆమెను పిపిలీలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు పంపారు.

**రంగంలోకి రెండు పోలీసు బృందాలు**

సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసు అధికారి తెలిపారు. వ్యక్తిగత శత్రుత్వం లేదా ప్రేమ కోణం లేదని బాలిక కుటుంబం చెప్పినట్లు వెల్లడించారు. పూరి ఎస్‌పీ పినక్ మిశ్రా మాట్లాడుతూ కొందరిని విచారించామని, ఇప్పటివరకు ఎవరిని అదుపులోకి తీసుకోలేదని చెప్పారు. బాలిక వీపు, పొట్ట తదితర శరీర భాగాలు బాగా కాలిపోయాయని పిపిలి ఎస్‌డీపీఓ దేవశీష్ మిశ్రా వెల్లడించారు. దోషులను పట్టుకునేందుకు రెండు పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని, ఘటనా స్థలం వద్ద ఇళ్లలోని సీసీటీవీల ఫుటేజిలు పరిశీలిస్తున్నామని చెప్పారు.

**దోషుల అరెస్టు, కఠిన చర్యలకు ఆదేశం**

దోషులను త్వరగా పట్టుకోవాలని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు ఉప ముఖ్యమంత్రి, మహిళాశిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ప్రవతి పరిందా వెల్లడించారు. ఈ ఘటనపై 'ఎక్స్' మాధ్యమంగా దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 15 ఏళ్ల బాలికపై ముగ్గురు వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు తెలిసి షాక్‌కు గురైనట్లు తెలిపారు. ఆమెకు ఎయిమ్స్‌లో మెరుగైన చికిత్స అం దిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామని, వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు.

**ఒడిశాలో మహిళలకు భద్రతలేదు: నవీన్ పట్నాయక్**

పట్టపగలే బాలికకు నిప్పంటించి చంపే ప్రయత్నం దారుణమని మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. ఈ ఘటనను ఆయన ఎక్స్ మాధ్యమంగా ఖండించారు. 'ఎఫ్ఎం కాలేజి విద్యార్థిని తనకు తాను నిప్పంటించుకొన్న ఘటన జరిగి వారం గడవక ముందే ఇలాంటి మరో దారుణం వెలుగు చూసింది. నెలకిందట గోపాల్‌పూర్‌లోనూ భయానక ఘటన చోటుచేసుకుంది. మహిళలపై నేరాలుఘోరాలు నిత్యకృత్యాలుగా మారడం కలిచివేస్తోంది. పరిపాలనలో వ్యవస్థీకృత వైఫల్యానికి ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి. బీజేపీ పాలనలో నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వారిలో శిక్షల భయంలేదు. మహిళలకు ఒడిశా పూర్తిస్థాయిలో అభద్రమైనదిగా మారిపోయింది' అంటూ నవీన్ ఆందోళన వ్యక్తంచేశారు. ఒడిశా ప్రభుత్వం ఇప్పటికైనా మేల్గొని నేరస్తులను సత్వరమే అరెస్టు చేస్తుందా అని ప్రశ్నించారు. మళ్లీ ఇలాంటి ఘోరాలు జరగకుండా చర్యలు తీసుకుంటుందా అని నిలదీశారు. ప్రభుత్వ స్పందన, న్యాయం కోసం రాష్ట్ర బాలికలు, మహిళలు వేచివున్నారని ఎక్స్‌లో నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు.

# నిన్న ఒడిశా... నేడు యుపి

### టీచర్ల వేధింపులకు మరో విద్యార్థిని బలి

**లక్నో:** ఒడిశాలో కీచక టీచర్ల వేధింపులు తట్టుకోలేక ఓ విద్యార్థిని నిప్పంటిచుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువక ముందే ఉత్తరప్రదేశ్‌లో మరొక విద్యార్థిని బలైంది. టీచర్ల వేధింపులు తాళలేక గ్రేటర్ నోయిడాలోని శ్రద్ధా యూనివర్సిటీలో బీడీఎస్ చదువుతున్న విద్యార్థిని తన హాస్టల్ గదిలో శుక్రవారం ఉరి వేసుకుంది. ఆత్మహత్య చేసుకోవడానికి తన డిపార్ట్‌మెంట్‌లోని ఇద్దరు టీచర్లు కారణమని చెబుతూ వారి పేర్లను సూసైడ్ నోట్‌లో పేర్కొంది. దీంతో ఆ ఇద్దరు సస్పెండ్ అయ్యారు. ఈ ఘటనపై దర్యాప్తునకు హై పవర్ కమిటీని వర్సిటీ ఏర్పాటు చేసింది. బాధితురాలి తల్లిదండ్రులతో వర్సిటీ యాజమాన్యం భేటీ అయింది. ఈ వ్యవహారంలో తగు చర్యలకు ఐదు రోజుల సమయం కోరింది. ఇదిలావుంటే, 'ఇద్దరు టీచర్లు నన్ను మానసికంగా వేధించారు. అవమానించారు. దీంతో చాలా కాలంగా మానసిక క్షోభను అనుభవిస్తున్నాను. నేను అనుభవించిన బాధ వాళ్లకూ తెలియాలి. ఇక నేను జీవించలేను' అని సూసైట్ నోట్ పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. పరీక్షల్లో ఫెయిల్ చేస్తామంటూ తమ బిడ్డను ఇద్దరు టీచర్లు బెదిరించారని బాధితురాలి తల్లి వాపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు టీచర్లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించారు.

**విద్యార్థుల నిరసన:** తోటి విద్యార్థి ఆత్మహత్యపై వర్సిటీ రగిలిపోయింది. విద్యార్థులు క్యాంపస్‌లో ఆందోళనకు దిగారు. దోషులపై కఠిన చర్యలకు డిమాండ్ చేశారు.

# పోలీస్ కొడుకు కారు రేస్... ఇద్దరు పాదచారుల మృతి



**అహ్మదాబాద్:** ఒక పోలీస్ కుమారుడు... కార్ రేసులో పాల్గొని ఇద్దరు పాదచారుల మృతికి కారకుడయ్యాడు. ఈ ఘటన గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... క్రైమ్ బ్రాంచ్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) అనిరుద్ధ సింగ్ వజుభా గోహిల్ కుమారుడైన హర్షరాజ్ (20)కు కారు రేస్ అంటే పిచ్చి. పలుమార్లు తన స్నేహితులతో కలిసి రేస్‌లలో పాల్గొన్నాడు. అతడు క్రెటా కారు నడపగా... ఎరుపు రంగు బ్రెజ్జాను స్నేహితుడు నడిపాడు. 120 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో కలియాబీడ్ ప్రాంతంలో రద్దీగా ఉండే రోడ్డులో వాహనాన్ని హర్షరాజ్ నడిపాడు. వాహనంపై అదుపు కోల్పోయి రోడ్డుపై నడుస్తున్న ఇద్దరిని బలంగా ఢీకొట్టాడు. వారిద్దరూ అక్కడికక్కడే మరణించారు. మతులను భార్గవ్ భట్ (30), చంపాబెన్ వాచాని (65)గా గుర్తించారు. మరోవైపు రోడ్డుపై జారుకుంటూ వెళ్లి ఒక స్కూటర్‌ను ఢీకొట్టింది. టైర్లు పగలడంతో ఆ స్కూటర్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న తండ్రి ... పోలీస్ అధికారి అనిరుద్ధ సింగ్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. కుమారుడు హర్షరాజ్‌ను కొట్టి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. పోలీసులు అతడిని కస్టడీలోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరలైంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## జంట జలాశయాలకు వరద నీరు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలోని జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్(గండిపేట), హిమాయత్ సాగర్ రిజర్వాయర్లకు వరద నీరు వచ్చి చేరుతోంది. గండిపేట జలాశయం పరివాహక ప్రాంతాలైన చేవెళ్ల, వికారాబాద్, శంకరపల్లి, ముమాన్ పల్లి, దోబీపేట్ ప్రాంతోల్లో కురిసే వర్షం నీరు మూసీ నది ద్వారా జలశాలయానికి ప్రవాహం కొనసాగుతుంది. ఉస్మాన్ సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 1790 అడుగులు కాగా, ప్రస్తుతం 1782.75 అడుగులు, 2.466 టిఎంసిలు ఉంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 1200 క్యూసెక్కులుగా కొనసాగుతోంది. అలాగే హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌కు చేవెళ్ల, అందాపూర్, కొత్వాల్ పెట్, నర్కూడ, తాండూర్, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో కురిసే వర్షం నీరు ఈసీ నది ద్వారా జలశాలయానికి చేరుతుంది. హిమాయత్ సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 1763.35 అడుగులు కాగా, ప్రస్తుతం జలాశయంలో 1759.10 అడుగులు, 2.156 టిఎంసిలు నీరు నిల్వ ఉంది. 1300 క్యూసెక్కుల ప్రవాహం జలాశయంలోకి కొనసాగుతుంది. దీంతో జలమండలి అధికారులు అప్రమత్తమయ్యారు. ఎప్పటికప్పుడు జలాశయాల నీటి మట్టాలను పరిశీలిస్తున్నారు.

## వలసదారుల జీవనోపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని వలసదారులతో పాటు బడుగు, బలహీన వర్గాల సంక్షేమాభివృద్ధికి గాను వారి జీవనోపాధి అవకాశాలను పెంచేందుకు మద్దతుగా 'మొబైల్ వలస సహాయ కేంద్రాన్ని' హైదరాబాద్‌లో శనివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ మొబైల్ వలస కేంద్రం ద్వారా నిజామాబాద్, నారాయణపేట జిల్లాలో వలస వెళ్లుతున్న గ్రామీణ కుటుంబాలకు వలసకు ముందు, ఆ తర్వాత వారి జీవన ప్రమాణాలపెంచేందుకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత, సేవలను అందించనున్నట్లు తెలిపారు. వలస వెళ్లిన కుటుంబాలలో ఒంటరిగా ఉంటున్న మహిళలకు గ్రామాల్లోనే సేవలను అందించేందుకు ఈ మొబైల్ వాహనాలు ఉపయోగపడనుందన్నారు. వారిని శక్తిమంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి వెల్లడించారు. వలస సహాయ కేంద్రం వాహనాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఎంపిక చేసిన ప్రాంతాల్లో రైతులకు మట్టి పరీక్షలు, సేం ద్రీయ వ్యవసాయ విధానాలు, పశుపాలనపై వర్చువల్‌గా శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. యుఎన్ భాగస్వామ్య సంస్థల కృషిని మంత్రి ప్రశంసించారు. ఐక్యరాజ్య సమితికి చెందిన అంతర్జాతీయ వలస సంస్థ (ఐఒఎం), ఎఫ్ఎఒ సంయుక్త అధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

## న్యాయవ్యవస్థలో సంస్కరణలు అవసరం



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** ప్రస్తుత న్యాయవ్యవస్థలో పలు సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉన్నదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సత్యమే సా మాన్యుడికి న్యాయం దక్కాలంటే మార్పులు తప్పనిసరి అని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్, గ్రేటర్ హైదరాబాద్ సొసైటీ ఫర్ ఫాస్ట్ జస్టిస్ (జిహెచ్ఎస్ఎఫ్ఎఫ్‌జె) సంయుక్త ఆధ్వర్యంలో ''స కాలంలో న్యాయం కోసం, న్యాయ వ్యవస్థలో సంస్కరణలు అత్యవసరం'' అనే అంశంపై సదస్సు జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఒయు పిజి లా కాలేజీ ప్రిన్సిపాల్ డా. టి.అపర్ణ మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో ప్రవేశపెట్టిన చట్టాలే ఇప్పటికీ న్యాయవ్యవస్థలో కొనసాగుతున్నాయన్నారు. సమావేశంలో హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వి.రఘునాథ్, జిహెచ్ఎస్ఎఫ్ఎఫ్‌జె అధ్యక్షులు నజీర్‌ఖాన్, ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్ చైర్మన్ భగవంజి భాయ్ రాయని, కన్వీనర్ ప్రవీణ్ పటేల్, న్యాయవాదులు సయ్యద్ ముజీబుద్దిన్, టి.వి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నగరం నీట మునిగితే పట్టించుకునే వారేలేరా? : టిడిపి నేత సాయిబాబా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో శుక్రవారం కురిసిన వర్షంతో జనజీవనం అతలాకుతలమైందని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. ఆరు గంటల పాటు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారన్నారు. ఇంత జరిగినా ప్రభుత్వం నుంచి మంత్రులు కానీ, ఇతర ప్రజా ప్రతినిధులు కనీసం ప్రజలను పరామర్శించిన నాథడే లేకుండా పోయారని విమర్శించారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విపత్తు నిర్వహణను జిహెచ్ఎంసి నుండి హైడ్రాకు బదిలీ చేయడంతో పరిస్థితి అద్వానంగా మారిందన్నారు. జిహెచ్ఎంసి చూస్తుందని హైడ్రా, హైడ్రా చూస్తుందని జిహెచ్ఎంసి వాళ్ళు ఎవరికి వారు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఒకరి మీద ఒకరు నెపం వేసుకుంటూ చివరికి ప్రజలను అనేక అవస్థలకు గురి చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కిర్లోస్కర్ కమిటీ సూచనల మేరకు నాలాల పరిరక్షణ మొదలైన పనులు చేపట్టాలని సూచించారు. హైడ్రాతో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో నల్లెల్ల కిషోర్, బాల్‌రాజ్ గౌడ్, ఎస్. ప్రకాష్, పరుశురామ్, సుక్రవేది పాల్గొన్నారు.

## 7న గోవాలో ఓబిసి జాతీయ మహాసభ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వచ్చేనెల 7న గోవా రాష్ట్రంలోని శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో జాతీయ ఓబిసి మహాసభను పెద్ద ఏత్తున నిర్వహిస్తున్నట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో మొదటిసారి మండల కమిషన్ సిఫార్సులైనా ఓబిసిలకు ఉద్యోగ రంగంలో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్టు దివంగత మాజీ ప్రధాని వి.పి.సింగ్ ప్రకటించిన ఆగస్టు 7 రోజున ప్రతి సంవత్సరం దేశంలోని అన్ని బిసి ఉద్యమ శక్తులను, వ్యక్తులను కలుపుకొని జాతీయ ఓబిసి మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదవ సారి జరిగే ఈ జాతీయ ఓబిసి మహాసభకు దేశంలోని 29 రాష్ట్రాల నుండి 10 వేల మంది ఓబిసి ప్రతినిధులు హాజరవుతున్నారని, ఈ మహాసభకు దేశంలోని అఖిలపక్ష రాజకీయ పార్టీల నేతలను, ఓబిసి జాతీయ నాయకులను ఆహ్వానించినట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మహాసభలో జాతీయస్థాయిలో ఓబిసిలు ఎదుర్కొంటున్న డిమాండ్‌లపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు గోవా రాష్ట్రంలోని శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యే ఈ మహాసభకు తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు.

### మద్యం కుంభకోణం కేసులో

## వైసిపి ఎంపి మిథున్‌రెడ్డి అరెస్టు

**విజయవాడ:** ఎపి మద్యం కుంభకోణంలో మాస్టర్ మైండ్‌గా వ్యవహరించిన వైసిపి ఎంపి మిథున్‌రెడ్డి అరెస్టయ్యారు. ఈ కేసులో ఎ4గా ఉన్న ఆయనను సిట్ అరెస్ట్ చేసింది. విజయవాడలోని సిట్ కార్యాలయంలో సుమారు 7 గంటలపాటు విచారించిన అనంతరం ఎంపిని అరెస్ట్ చేసింది. ఈ సమాచారాన్ని ఆయన బంధువులకు సిట్ అధికారులు తెలిపారు. లిక్కర్ పాలసీ రూపకల్పన, డొల్ల కంపెనీలకు ముడుపుల సరఫరా తదితర అంశాలపై సిట్ ప్రశ్నించింది. ఎవరెవరితో ప్రైవేట్ సమావేశాలు నిర్వహించారనేదానిపై ఆరా తీసింది. డొల్ల కంపెనీల నుంచి సొమ్మును అంతిమ లబ్ధిదారుకి చేర్చిన విధానంపై సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. మద్యం ఆర్డర్లు, సరఫరా వ్యవస్థ గతంలో ఆన్‌లైన్ పద్ధతి ద్వారా పారదర్శకంగా ఉండేదని, వైసిపిహయాంలోదానిని మాన్యువల్ విధానంలోకి తీసుకురావడంలో మిథున్‌రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు సిట్ గుర్తించింది.ఈకుంభకోణానికివ్యూహరచన,అమలులోమిథున్‌రెడ్డి మాస్టర్ మైండ్ అంటూ సాక్షులు వాంగ్మూలం ఇచ్చారని,ఆధారాలు లభించాయని సిట్ తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఎపి హైకోర్టు కొట్టివేసింది. శుక్రవారం సుప్రీంకోర్టుఆయన పిటిషన్‌ను తోసిపుచ్చిన విషయం తెలిసిందే.

### సభలో లేవనెత్తిన ప్రతి అంశానికీ

# ప్రధాని సమాధానమివ్వాలి

### 24 ప్రతిపక్ష పార్టీల నాయకుల ఆన్‌లైన్ సమావేశం డిమాండ్



**న్యూఢిల్లీ :** పహల్గామ్ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను చట్టం ముందుకు తీసుకురాకపోవడం, భారతదేశం,పాకిస్థాన్ మధ్య 'యుద్ధ విరమణ'కు మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదే పదే చెప్పుకోవడం, ప్రజల ఓటు హక్కులను ప్రమాదంలో పడేస్తున్న బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ వంటి అంశాలను పార్లమెంటు వర్షాకాల సమావేశాలలోలేవనెత్తాలనిఇండియా కూటమి పార్టీలు తీర్మానించాయి. సోమవారం నుంచి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కూటమికి చెందిన 24 ప్రతిపక్ష పార్టీల నాయకుల ఆన్‌లైన్ సమావేశం శనివారం జరిగింది. విదేశాంగ విధానంలో'వైఫల్యం',గాజాలో'అత్యాచారాలు', నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు, దేశంలో ఎస్‌సి / ఎస్‌టిలు, మహిళలు, మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడం వంటి ఎనిమిది ప్రధాన అంశాలను లేవనెత్తాలని నిర్ణయించాయి. సమావేశం అనంతరం మీడియాను రాజ్యసభ కాంగ్రెస్ ఉపనాయకుడు ప్రమోద్ తివారీ మాట్లాడుతూ, ప్రధాని పార్లమెంటుకు హాజరై సభలో లేవనెత్తే అంశాలకు సమాధానం చెప్పాలని ప్రతిపక్ష పార్టీలు ఆశిస్తున్నట్లు వెల్లడించారు. 'విదేశాలకు వెళ్లడం కంటే పార్లమెంటు చాలా ముఖ్యం' అని నొక్కి చెప్పారు. విజయవంతమైన, సౌహార్దపూర్వక ఆన్‌లైన్ సమావేశం జరిగిన తరుణంలో త్వరలో కూటమి నాయకుల ప్రత్యక్ష సమావేశం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, డి.రాజా(సిపిఐ), ఎం.ఎ.బేబి(సిపిఐ(ఎం)), దీపాంకర్ భట్టాచార్య(సిపిఐ(ఎంఎల్), శరద్ పవార్(ఎన్‌సిపి (ఎస్‌పి)), ఉద్ధవ్ ఠాక్రే (ఎస్ఎస్‌యుబిటి), అభిషేక్ బెనర్జీ (టిఎంసి), తేజస్వి యాదవ్ (ఆర్‌జెడి), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్‌పి), తిరుచ్చి శివ (డిఎంకె) తదితరులు పాల్గొన్నారు.తాము పార్లమెంటు సజావుగా పనిచేయాలని కోరుకుంటున్నామని, తద్వారా తాము సమస్యలను లేవనెత్తవచ్చుని, ప్రభుత్వం సమాధానం చెప్పవచ్చని అన్నారు.

## ఏ ఎన్నిక వచ్చినా ఇక నుండి బిఆర్ఎస్ ఉనికి ఉండదు

### టిపిసిసి మహేష్‌కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం /హైదరాబాద్:** రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా ఇక నుండి బిఆర్ఎస్ ఉనికి ఉండదని, కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గాం నుండి ఎంఎల్‌ఎగా పోటీ చేసిన మురళీగౌడ్, మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్‌తో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలకు టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కండువా కప్పి కాంగ్రెస్ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయాన్ని కైవసం చేసుకోబోతుందని, మంచి మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తాడన్నారు. మాజీ సిఎం కెసిఆర్, కెటిఆర్, కవిత అబద్దాలు ఆడి ప్రజలను మోసం చేశారన్నారు. బనకచర్ల విషయంలో హరీష్ రావు పచ్చి అపద్దాలు మాట్లాడుతున్నారన్నారు. హైదరాబాద్ ను ప్రపంచ పటంలో ఉంచేందుకు సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకే పాలన జరుగుతుందని, అందుకే బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనకు నిదర్శనమే కాంగ్రెస్‌లో బిఆర్ఎస్ నేతల చేరికలన్నారు.

# కాచిగూడ -జోద్‌పూర్ రైలు షురూ

### జెండా ఊపి ప్రారంభించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్



**ప్రజాపక్షం /హైదరాబాద్:** కాచిగూడ నుండి జోధ్పూర్‌కు 'భగత్‌కీకోఠి'నూతన ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర రైల్వే శాఖ మంత్రిఅశ్విని వైష్ణవ్ జెండా ఊపి ప్రారంభించారు. కేంద్రమంత్రికిషన్‌రెడ్డితో పాటు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్‌తో కలిసి శనివారం సాయంత్రం 6 గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో నూతన రైలును ప్రారంభించారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, హైదరాబాద్ నుండి జోధ్పూర్‌కు రోజువారీ రైలు నడపడం హైదరాబాద్‌లోనివసిస్తున్న రాజస్థానీ సమాజం చిరకాల స్వప్నమన్నారు. గతంలో పరిమితుల కారణంగా రైలును ప్రారంభించలేకపోయామని,దేశవ్యాప్తంగా రైలు మౌలిక సదుపాయాలు గణనీయంగా పెరిగాయని, కొత్త ట్రాక్‌ల నిర్మాణం, కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణం, సామర్థ్యం పెరగడం వల్ల హైదరాబాద్ నుండి జోధ్పూర్‌కు ఈ ప్రత్యక్ష రోజువారీ రైలునడపడానికి వీలు కలిగిందన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి అపూర్వమైన వృద్ధిని సాధించిందన్నారు. ఎస్‌సిఆర్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ స్వాగతోపన్యాసం చేస్తూ ఈ నూతన రోజువారీ రైలు ప్రజల అవసరాలను తీరుస్తూ హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో నివసిస్తున్న దేశంలోని మధ్య, వాయువ్య రాష్ట్రాల ప్రజలు తమ స్వస్థలాలకు ప్రయాణించడానికి ఎక్కువగా ప్రయోజనం చేకూరుస్తుందన్నారు.

## డ్రగ్స్ వల్ల కెటిఆర్ మైండ్ పనిచేయడం లేదు



### కాంగ్రెస్ సీనియర్ నేత మైనంపల్లి హనుమంతరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డ్రగ్స్ తీసుకోవడం వల్ల కెటిఆర్ మైండ్ పనిచేయడం లేదని కాంగ్రెస్ పార్టీ నేత మైనంపల్లి హనుమంతరావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే కెటిఆర్, హరీశ్ రావు ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. బావ, బామ్మర్ధుల బట్టలు విప్పుతానని అన్నారు. గాంధీ భవన్‌లో హనుమంతరావు మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ రెడ్ బుక్ పెట్టుకొని ఏం చేస్తారు..? అని ప్రశ్నించారు. ఏం చేయడానికి భారత రాష్ట్ర సమితి పెట్టారన్నారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను కెటిఆర్ బద్నాం చేశారని విమర్శించారు. పవర్ లేకపోతే కెటిఆర్, బిఆర్ఎస్ నేతలు బతకలేక పోతున్నారని మండిపడ్డారు. కెటిఆర్‌ను సిరిసిల్లాలో చెప్పుతో కొట్టే రోజులు వస్తాయని హెచ్చరించారు. సెటిలర్స్‌ను కాపుడుకుంటానని కెసిఆర్ అనలేదా అని ప్రశ్నించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో బిఆర్ఎస్‌కి 24 సీట్లు ఇచ్చిన సెటిలర్స్‌పై కెటిఆర్‌కి అంత కోపం ఎందుకని నిలదీశారు. లోకల్, నాన్ లోకల్ అనే ఫీలింగ్ ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. కెటిఆర్ తన జీవితంలో ముఖ్యమంత్రి కాలేరన్నారు. కెసిఆర్ హయాంలో కెటిఆర్ షాడో ముఖ్యమంత్రిగా పనిచేశారని ఆరోపించారు. కెటిఆర్‌ది నరం లేని నాలుక అని విమర్శించారు. 'జర్నలిస్ట్ స్వేచ్ఛ చనిపోవడానికి కారణం కెటిఆర్ అని ఆరోపించారు. ఆయన ప్రవర్తనలో మార్పు లేదు, ఇప్పటికీ అలాగే మాట్లాడుతున్నాడన్నారు. కెటిఆర్ అరాచకాలపై పుస్తకం రాస్తాను అన్నారు. గడప గడపకి నేను రాసే పుస్తకాన్ని ఇచ్చే బాధ్యత తనదే అన్నారు. భార్య, భర్తలను కెటిఆర్ విడదీశాడని ప్రజలు మాట్లాడుకుంటున్నారన్నారు. లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడే అర్హత కెటిఆర్‌కి లేదన్నారు. మూసీ చుట్టూ ఉన్న అక్రమ ఇళ్లు కూలగొడుతాం, అడ్డు రావద్దని కెటిఆర్ చెప్పాడని ఆరోపించారు. కెటిఆర్ జైలు ఊచలు లెక్కపెట్టే రోజులు వస్తాయన్నారు. హరీశ్ రావు, కెటిఆర్‌లను అరెస్ట్ చేయకుండా సిఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావట్లేదన్నారు. కెటిఆర్‌కి ఆయన భాషలో చెబితేనే అర్థం అవుతుందన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి

### కన్నెపల్లి పంప్‌హౌజ్ ద్వారా గోదావరి జలాలు అందించాలి

### చంద్రబాబు బనకచర్ల అనుమతుల కోసమే కాళేశ్వరం ఎండబెడుతున్నారు

### మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం /సూర్యాపేట రూరల్:** బతుకు పోరాటం చేస్తున్న రైతులపై యుద్ధం చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి రైతాంగానికి క్షమాపణలు చెప్పి కన్నెపల్లి పంప్‌హౌజ్ ద్వారా గోదావరి జలాలు అందించాలని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట మండల పరిధిలోని మూసీ ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువ ద్వారా రైతులకు సాగు నీరు విడుదల చేసి మీడియాతో మాట్లాడారు. మార్పు పేరుతో అబద్ధపు హామీలు ఇచ్చి అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి తెచ్చుకున్నాని చెప్పారు. రైతాంగానికి నీళ్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి సిఎం రేవంత్ రెడ్డి,నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు లేదన్నారు. వారిద్దరికీ నీటి పారుదల రంగంపై జ్ఞానం లేదన్నారు. ఉత్త మాటలో చెత్త మాటలో చెప్పడం లేదని, తన మాటలు అబద్ధమని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. అక్రమ డబ్బు సంపాదనపై ఉన్న దృష్టి రైతాంగంపై లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేసిన తప్పు ఒప్పుకొని కన్నెపల్లి పంప్ హౌజ్ ద్వారా తెలంగాణ ప్రజలకు నీరు అందించాలన్నారు. దీంతో మిడ్ మానేరు, మల్లన్న సాగర్ ద్వారా బస్వాపుర్, గంధమల్ల, ఎస్సారెస్పీ ద్వారా ఉమ్మడి నిజామాబాద్, మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు సంవృద్ధిగా నీరు అందుతాయన్నారు. కన్నెపల్లిలో బటన్ నొక్కితో నాలుగు రోజుల్లో పెన్‌పహాడ్ మండలంలోని రావి చెరువుకు నీళ్లు అందించే అవకాశం ఉందన్నారు. చంద్రబాబు బనకచర్ల అనుమతులు రావడం కోసమే కాళేశ్వరాన్ని ఎండబెడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ఎండిపోవడంతో దిగువ స్థాయి కాంగ్రెస్ నాయకులు అక్రమ ఇసుక రవాణాకు తెగబడ్డారన్నారు. మూసీ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన సోలిపేట, రత్నపురం, రామారం, యర్కారం గ్రామాలకు సైతం గోదావరి జలాలతోనే పంటలు పండాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ అధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్ గౌడ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ పి టి సి జీడి బిక్షం, పెన్ పహాడ్ మాజీ ఎంపిపి నెమ్మది బిక్షం, నాయకులు నాగేందర్, ఈదుల యాదగిరి, రఫీ పాల్గొన్నారు.



## మతిస్థితిమితం కోల్పోయి మాట్లాడుతున్న కెటిఆర్

### ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెటిఆర్ మతిస్థితి మితం కోల్పోయి మాట్లాడుతున్నాడని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేదార్‌కు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కేదార్,అశ్విన్‌లకు సంబంధించిన కంపెనీ కార్ మీ బామ్మర్ది రాజ్ పాకాల(కెటిఆర్ భావమరిదిని) ఎలా వాడుతున్నాడని ప్రశ్నించారు. మీ కుటుంబం ఫంక్షన్స్ కేదార్ నిర్వహించడన్నారు. డ్రగ్స్ టెస్ట్‌కి రావాలి అని సవాల్ విసిరితే చాలా సార్లు కోర్టుకు వెళ్ళావన్నారు. కోర్టు తీర్పును కూడా వక్రీకరించావని, కోర్టుకి క్షమాపణ చెప్పకపోతే కోర్టు తీర్పు ఉల్లంఘన కేసు నమోదు చేసేలా కేసు వేస్తాను అని బల్మూరి వెంకట్ కెటిఆర్‌ను హెచ్చరించారు. విదేశాలకు వెళ్లొచ్చిన తరువాత బ్లెడ్ శాంపిల్స్ ఇస్తా అంటున్నాడని, ఇన్ని రోజులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.కెటిఆర్అమెరికా 3నెలల్లో ఉండి డ్రగ్ డిటాక్స్ చేసుకున్నాడని ఆరోపించారు. కేదార్‌తో ఏలాంటి సంబంధాలు లేకపోతే పూర్తి విచారణ చేయాలని ముఖ్యమంత్రికి లేఖ రాయాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేయలేదు, కెసిఆర్, కెటిఆర్ లై డిటెక్టర్ టెస్ట్ చేయించుకోవాలన్నారు. ఇక నుండి కెటిఆర్ ప్రవర్తన ఎలా ఉంటదో అలానే తనది ఉంటదన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నువ్వు(కెటిఆర్) వైస్ ప్రెసిడెంట్‌గా తాను చర్చకు సిద్ధమన్నారు. ఎమ్మెల్సీగా తాను ఏ చర్చకు అయినా సిద్ధమని సవాల్ విసిరారు.

### కెటిఆర్ రోత మాటలు మానుకోవాలి : చనగాని దయాకర్



కెటిఆర్ రోత మాటలు మానుకోవాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ అన్నారు. కెటిఆర్ 18 నెలల నుండి సైకో లాగా తయారు అయిండని విమర్శించారు. సిఎం రేవంత్ రెడ్డిపై కెటిఆర్‌తప్పుడుఆరోపణలుమానుకోకపోతే కాంగ్రెస్‌కార్యకర్తలుబుద్ధి చెబుతారని హెచ్చరించారు. కెటిఆర్ చాలా రోజుల నుండి జైల్‌కు వెళ్ళాలని చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. కెటిఆర్ భాషాపై, వ్యహారశీలిపై కెసిఆర్ స్పందించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మౌనానికి పరీక్ష పెట్టొద్దన్నారు. ప్రజా ప్రభుత్వంలో సిఎం మంత్రులు, కలసి చేస్తున్నారని, కాబట్టి 18 నెలల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి ప్రజలే రెపరెండమన్నారు. కెటిఆర్ లాంటి వక్ర బుద్ధి, చిల్లర బుద్ధిపై మీ చెల్లెలు కవిత వాఖ్యలు సాక్ష్యమన్నారు.

## కెటిఆర్ తీరు మార్చుకోకుంటే బుద్ధి చెబుతాం

### టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ ఫైర్



**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అవమానకర రీతిలో మాట్లాడటాన్ని సహించబోమని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. కెటిఆర్ భాష దివాళాకోరుతనంతో ఉన్నదని, భాష మార్చుకోవాలని, లేకుంటే సరైన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలకు కెటిఆర్ కుటుంబం లెక్కలేనన్ని వాగ్దానాలు చేసి, ఏ ఒక్కటీ సరిగా నెరవేర్చలేదని బండి దుయ్యబట్టారు. ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టిన కెటిఆర్‌కుటుంబం తెలంగాణ వనరులను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకున్నదని, ప్రజలను నిండా ముంచిందని విమర్శించారు. తెలంగాణ అమర వీరుల త్యాగాలకు ద్రోహం చేసిన కెటిఆర్ కుటుంబం... తెలంగాణ ప్రజల కలలను, ఆశలను వమ్ము చేసిందని బండి స్పష్టం చేశారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించిన కేటీఆర్ కుటుంబం తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీ లేదని బండి అన్నారు. ప్రజలు పూర్తిగా ఛీత్కరించినా కెటిఆర్‌కు బుద్ధి రాలేదని, బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని పగటి కలలు కంటూ, ప్రజలను మభ్య పెడుతున్నారని బండి సుధాకర్ ఎద్దేవా చేశారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం / భువనగిరిరూరల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతారంలో పాటు పలు గ్రామాల్లో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హెచ్ఎండీఏ నిధులతో రూ.40 లక్షలతో, అంగన్వాడి బిల్డింగ్ రూ.12 లక్షలతో, ఎస్సీ సబ్ ప్లాన్ రూ.5 లక్షలతో, డిఎంఎఫ్ రూ.5 లక్షలతో, ఆరేడ బ్యూవిస్ రూ.2 లక్షలతో, ఐజిఎస్ రూ.10 లక్షలతో పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పకీరు కొండల్ రెడ్డి, ఎర్ర శ్రీరాములు, విట్టల్ వెంకటేష్, నల్ల పంద, చిగురు పెల్లి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు ఎలిమిటి కృష్ణారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/మానవపాడు:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ నీటి సంఘం అధ్యక్షుడు లక్కిరెడ్డి కర్ణసింహారెడ్డి సేవా కృషితో ఈ గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే విజయుడు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. లబ్ది పొందిన లబ్దిదారులు ముందుగా ఎమ్మెల్యే కి జల్లాపురం గ్రామ లక్కిరెడ్డి కర్ణసింహారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు లక్కిరెడ్డి కర్ణసింహారెడ్డి, మాజీ సర్పంచు రాంభూపాల్‌రెడ్డి, సామాజిక కార్యకర్త శాంతకుమార్ పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాల, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజాపక్షం/భువనగిరి :** జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో, గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న విద్యార్థుల మరణాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని హాస్టల్లో గురుకుల పాఠశాలలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్స్ అందుబాటులో ఉండకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. జిల్లాలోని గురుకుల పాఠశాలల కోసం సొంత భవనాలను నిర్మించి జిల్లాలో గురుకుల విద్యార్థుల మరణాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని అన్నారు. విద్యార్థులకు అందుబాటులో లేని వార్డెన్లను అధికారులను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు చిప్పలపల్లి బన్నీ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి రహిత సమ సమాజ నిర్మాణమే దొడ్డకు ఘనమైన నివాళి



సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/కోదాడ:** అవినీతి రహిత సమ సమాజ నిర్మాణమే దొడ్డ నారాయణరావుకే ఘనమైన నివాళి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని భారతకమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ సాయుధపోరాట యోధులు కామ్రేడ్ దొడ్డ నారాయణరావు సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన జీవితం మొత్తం త్యాగం చేసిన పోరాట యోధుడు దొడ్డ నారాయణరావు అని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి షేక్ లతీఫ్, మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు, పార్టీ నాయకులు ఫైయిదిమర్రి వెంకటనారాయణ, గొపోనాయక్, షేక్ జాని, ఉపతల శ్రీనివాస్, లింగయ్య, సైదులు, నట్టు పార్వతి, అంజమ్మ, మోసిన్ పాల్గొన్నారు.

## అమరుడా నీ మరణం మరువలేనిది... నీ ఆశయాలను సాధిస్తాం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (గరిడేపల్లి):** తెలంగాణ సాయుధ పోరాట యోధులు కమ్యూనిస్టు పార్టీ ఈ ప్రాంత ఉద్యమ నిర్మాత కామ్రేడ్ దొడ్డ నారాయణరావు మరణం వామపక్షాలకు, సిపిఐ కే కాకుండా ప్రజాస్వామ్య వాదులందనిరి తీరనిలోటు అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గరిడేపల్లి మండలంలోని రంగాపురం గ్రామంలో దొడ్డ నారాయణరావు సంతాప సభను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సహాయ కార్యదర్శి పోటు పూర్ణచందర్‌రావు, పోటు కృష్ణబాబు, నాయకులు కుందూరు వెంకటరెడ్డి, మామిడి శ్రీను, తిరగమళ్ల కిరణ్, కట్ట అశోక్, బాలశౌరి, పగడాల శ్రీను, సుందరయ్య, మట్టయ్య, అనిల్, రామచంద్రు, సాయిలు, నాగయ్య, యల్లయ్య పాల్గొన్నారు.

## కామ్రేడ్ దొడ్డ నారాయణరావు జీవితం ఆదర్శం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** కామ్రేడ్ దొడ్డా నారాయణరావు జీవితం నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లులు అన్నారు. శనివారం హుజూర్‌నగర్ లోని సిపిఐ కార్యాలయంలో దొడ్డా నారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పోజు సూర్యనారాయణ,యల్లావుల రమేష్,దొంతగాని సత్యనారాయణ,మామిడి వెంకయ్య,సోమగాని కృష్ణ,కందుల వెంకటేశ్వర్లు,ఇందిరాల వెంకటేశ్వర్లు,చెన్నగాని సైదులు,జడ వెంకన్న,మామిడి నర్సయ్య,పొనుగుపాటి వాసుదేవరావు జక్కుల రమణ పాల్గొన్నారు.

## 8మంది ఎస్ఐలు బదిలీ

**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలో 8మంది ఎస్ఐ లను బదిలీ చేసినట్లు జిల్లా ఎస్పి కె.నర్సింహా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట విఆర్‌లో ఉన్న ఎ.శివతేజను సూర్యాపేట టూటౌన్‌కు, అక్కడ పనిచేస్తున్న ఎం. ఆంజనేయులును సూర్యాపేట విఆర్‌కు బదిలీ చేశారు. అలాగే విఆర్‌లో ఉన్న సిహెచ్ గోపాల్‌రెడ్డిని కోదాడ రూరల్‌కు బదిలీ చేయగా, అక్కడ పనిచేస్తున్న ఎం. అనిల్‌రెడ్డిని సూర్యాపేట విఆర్‌కు అటాచ్ చేశారు. విఆర్‌లో ఉన్న వి.సురేష్‌రెడ్డిని చిలుకూరుకు బదిలీ చేయగా అక్కడ పనిచేస్తున్న సురభి రాం బాబును సూర్యాపేట విఆర్‌కు, విఆర్‌లో ఉన్న టి.అజయ్‌కుమార్‌ను మోతె పోలీస్‌స్టేషన్‌కు అక్కడ పనిచేస్తున్న యాదవేందర్‌రెడ్డిని విఆర్ అటాచ్ చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లని గ్రౌండ్ చేయాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ :** మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లన్నీ గ్రౌండ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం ఆమె కనగల్ ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లపై గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మార్చి నెలలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు ఇంకా ఇప్పటివరకు కొన్ని గ్రౌండ్ కాకపోవడంపై ఆమె పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ఎవరైనా ఇల్లు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపకపోతే వారి నుండి ఇష్టం లేనట్టుగా రాతపూర్వకంగా తీసుకోవాలని, అలాంటి వారి జాబితాను రూపొందించి పంపించాలని చెప్పారు. రెండు ,మూడు రోజుల్లో మంజూరైన అన్ని ఇండ్లు గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయా గ్రామ పంచాయతీల వారీగా పంచాయతీ కార్యదర్శులతో వివిధ స్థాయిలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లపై సమీక్ష నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ ,ఇన్చార్జి ఎంపిడిఓ సుమలత, కనగల్ తహసిల్దార్ పద్మ, తదితరులు ఉన్నారు.

**కట్టంగూరు మండలంలో ...** కట్టంగూరు మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మండలానికి మంజూరైన గృహాలలో వచ్చే బుధవారం నాటికి 50 శాతం గ్రౌండింగ్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.శనివారం ఆమె కట్టంగూరు ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.గ్రామపంచాయతీలవారిగా సమీక్ష నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రౌండింగ్ కానీ గ్రామాలలో వెంటనే ఇండ్ల నిర్మాణం మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఆన్లైన్ వివరాలన్నీ ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు.ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, కట్టంగూర్ ఎంపీడీఓ, గ్రామపంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఈ సమీక్షకు హాజరయ్యారు .

నవంబర్ నాటికి నకిరేకల్ నూతన ఏరియా ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తిచేసి వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యాధికారులను, సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రి నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు . కాంట్రాక్టర్, వైద్యాధికారి శోభారాణి తో మాట్లాడుతూ త్వరితగతిన ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తి చేయాలని ,నవంబర్ లోగా నిర్మాణం పూర్తయితే నవంబర్ నుండి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి అవకాశం ఉంటుందని చెప్పారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రస్తుత ఆస్పత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటు అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని శాసనమండలి సభ్యులు, డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు.శనివారం పట్టణంలోని ఆర్‌డిఓ కార్యాలయంలో నల్లగొండ నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదని, అలాంటిది తమ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన రేషన్ కార్డులను ఇస్తున్నదని తెలిపారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండి గెలిపించాలని కోరారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటిసారిగా సన్నబియ్యాన్ని పంపిణీ చేసిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. సన్న బియ్యం దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నల్లగొండ నియోజకవర్గంలో10,001 కొత్త రేషన్ కార్డులను ఇవ్వడం జరిగింది. అంతేకాక 12,733 మందిని రేషన్ కార్డులలో నమోదు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరుశురాం, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిసిసి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ లు బుర్రి శ్రీనివాస్ రెడ్డి, బొడ్డుపల్లి లక్ష్మి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## నవోదయ విద్యాలయంలో మౌలిక వసతులు

### జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జవహర్ నవోదయ విద్యాలయంలో మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రెడ్డి హాస్టల్‌లో ఏర్పాటు చేసిన జవహర్ నవోదయ విద్యాలయంను అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండి జవహర్ నవోదయ విద్యాలయం ప్రారంభం అవుతుందని, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బెంచీలు, తాగునీటి కోసం ఆర్వోప్లాంట్, వంటగది, వంట సామాగ్రి, డైనింగ్‌హల్, టాయిలెట్స్, లైబ్రరీ కోసం టేసం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాదవరావు, డిఇఒ అశోక్, తహసిల్దార్ కృష్ణయ్య, జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్, తెలంగాణ రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ డిఈ సురేష్, ఎఈ ఓబుల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు చట్టాలపై అవగాహన



**ప్రజాపక్షం/కోదాడ:** మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని కోదాడ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భవ్య కోరారు. శనివారం కోదాడ కోర్టులో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల కోసం, తమకు జరుగుతున్న అన్యాయాలపై చట్టాలను రక్షణగా ఉపయోగించుకోవాలన్నారు. మహిళలు గృహహింసకు గురైతే కోర్టులో కేసు వేసుకోవచ్చున్నారు. గృహహింస కేసులో మహిళలకు షెల్టర్, నష్టపరిహారం, భరణం, స్త్రీధనం తిరిగి ఇవ్వడం కోసం చట్టం పని చేస్తుందన్నారు. మొదటి అదనపు జడ్జి ఎండి ఉమర్ మాట్లాడుతూ భారతీయ కుటుంబ వ్యవస్థ బలమైనదని, దాన్ని కాపాడుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉయ్యాల నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, గట్ల నర్సింహరావు, మందా వెంకటేశ్వర్లు, సామ నవీన్‌కుమార్, కె.శరత్‌కుమార్, ఆవుల మల్లిఖార్జున్, పారాలిగల్ వాలంటీర్లు, మండల లీగల్ సర్వీస్ కమిటి సిబ్బంది పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన భూముల రిజిస్ట్రేషన్ చేయడానికి సంబంధిత శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని సూచించారు. ఆయన వెంట సబ్ రిజిస్టర్ బలరాం, సిబ్బంది ఉన్నారు.

## రోడ్డు విస్తరణ పనులకు సహకరించండి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణ అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న రోడ్ల విస్తరణలో ప్రజలు సహకరించి వారి యొక్క రోడ్డు ఆక్రమణ కట్టడాలు ఆస్తులను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ హమ్మద్ కోరారు. శనివారం బస్టాండ్ నుండి గొల్లగూడెం వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మరియు మిర్యాలగూడ రోడ్లో జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నప్పటికీ రోడ్డు విస్తరణలో కొన్ని కట్టడాలు తొలగించుకోకపోవడం వల్ల ఆలస్యం అవుతున్నాయని తెలిపారు వాటిని యజమానులు రెండు రోజులలో తొలగించుకోవాలని నోటీసులు ఇవ్వడం జరిగింది, అవి తొలగిస్తేనే మరింత వేగవంతంగా పనులను పూర్తి చేయవచ్చని సూచించారు అదే విధంగా మిర్యాలగూడ రోడ్‌లో టియుఎఫ్‌డిసి నిధులతో నిర్మిస్తున్న కల్వర్టు స్లాబ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కాంట్రాక్టర్లను ఆదేశించారు పనులు ఆలస్యంగా జరుగుతున్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అనుకున్న ప్రకారంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు ఆయన వెంట, డిప్యూటీ ఈఈఅశోక్,ఏసిపి కృష్ణవేణి,టిపిఓసుకన్య, ఆఫీఫ్ రెహ్మాన్ తదితరులున్నారు.

# గ్రామీణాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే మందుల సామేలు



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం, వెంపటి గ్రామంలో ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో నిర్మించనున్న నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు తెలంగాణ అంగన్‌వాడీ కేంద్రాలు నూతన ఒరవడిని సంతరించుకుంటున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం గ్రామాలను నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపించడంతో చాల గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని, గ్రామాలాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుందన్నారు. వెంపటి గ్రామంలో ఎన్ఆర్ఈజిఎస్ నిధులు రూ.12 లక్షలు, తుంగతుర్తిలో రూ.20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. గ్రామంలోని ఎస్సీ పాత కాలనీలో కమ్యూనిటి హల్ నిర్మాణానికి , కొత్త కాలనీలోని కమిటి హల్ ప్రహరిగొడ నిర్మాణానికి, చైర్మన్ పేటలోని సిసిరోడ్డు, ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. సన్నాయిల వెంకటేష్ ఇటీవల గుండెపోటుతో మరణించగా మృతుని పిల్లలను పరమార్శించి ధైర్యం చెప్పి వారికి 50వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి

### జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

### ఏడాది ఒకరికి ఉరిశిక్ష,10 మందికి జీవిత ఖైదు




**ప్రజాపక్షం/ నల్లగొండ :** కోర్టు కేసులలో శిక్షల శాతాన్ని పెంచడం, తప్పు చేసిన నిందితులకు శిక్ష పడే విధంగా చేసినప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయని ఇందుకు గాను ప్రతి కేసులో నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ లకు, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్‌లకి ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ ప్రతి కేసుల్లో నిందితులకు దోషులుగా నిరూపించి శిక్షలు పడేలా పని చేయాలని అన్నారు. కోర్టు అధికారులు, ప్రాసిక్యూటర్ల సమన్వయంతో న్యాయ సలహాలు ఆడిగి పని చేయలని అన్నారు. కేసు తుది దశలో సాక్షులను, నిందితులను, బాధితులను సమయానికి కోర్టులో హాజరు పరిచేలా చూసుకోవాలని చూచించారు. నేరస్తులకు శిక్షలు పడేలా పని చేయడంలో సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారితో పాటు కోర్టు డ్యూటీ సిబ్బందికి చాలా బాధ్యత ఉంటుందని చెప్పారు. కోర్టు కేసుల్లో నిందితులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, తద్వారా ప్రజలకు పోలీస్ శాఖపై మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందని అన్నారు. ఈ సంవత్సర కాలంలో జిల్లా వ్యాప్తంగా ఒక్కరికీ ఉరిశిక్ష పడగా 10 మందికి జీవిత ఖైదు వివిధ కేసులలో మొత్తం 75 మందికి శిక్షలు విధించడం అభినందనీయం అని అన్నారు. అనంతరం నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన ప్రాసిక్యూటర్ లకు కోర్టు డ్యూటీ అధికారులకు అభిందినందించి ప్రశంసా పత్రాలు,జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్,డి.సి.ఆర్బి డీఎస్పీ రవి,పబ్లిక్ ప్రాసిక్యూటర్ లు శ్రీవాణి, అఖిల, జవహర్ లాల్, రంజిత్ కుమార్,డిసిఆర్బి సిఐ శ్రీను నాయక్, యస్.ఐ వెంకట్ రెడ్డి,కోర్టు డ్యూటీ లైజెనింగ్ ఆఫీసర్ నరేందర్,కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

## రుణాలను త్వరితగతిన ఇవ్వాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఈ ఖరీఫ్ సీజన్ కు 50 కోట్ల రూపాయ ల క్రాప్ లోన్లు ఇవ్వాలని తీర్మానం చేయడం జరిగిందని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయం లో బ్యాంక్ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన పాలకవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక రుణాలను త్వరితగతిన ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరంలో నాబార్డ్ వారి చేత బెస్ట్ పర్ఫార్మెన్స్ డిసిసిబి గా ఎన్నిక కాబడుటకు సహకరించిన పాలకవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రూ. 3500 కోట్లు చేరుకొనుటకు ప్రణాళిక బద్దంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఏసి రెడ్డి దయాకర్ రెడ్డి, డైరెక్టర్లు గొంగిడి మహేందర్ రెడ్డి , గుడిపాటి సైదులు, పాశం సంపత్ రెడ్డి , ధనావత్ జయరాం, కోడి సుష్మ , ఎ లింగం యాదవ్ , పల్ల ప్రవీణ్ రెడ్డి , దొండపాటి రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** విద్యార్థులు శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని హుజూర్‌నగర్ మున్సిపల్ కమీషనర్ కె. శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని నాసా స్పేస్ కాంటెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్ పోసాని వెంకటరమణారావుతో కలిసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పట్ల మక్కువ పెంచుకొని ఫిజిక్స్‌లో ప్రాజెక్ట్ చేసి జాతీయ స్థాయిలో రెండవ స్థానంలో నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు సిరిమహేశ్వరీ,మోక్షిత,యశ్వంత్,మనోజ్ సాయి,నిఖిలేష్ గౌడ్‌లకు జ్ఞాపికలు,ప్రశంసాపత్రాలు,మెడల్స్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రేమ్ సాగర్,శానిటరీ ఇన్స్‌పెక్టర్ అశోక్,రాజశేఖర్,ప్రియాంక,రామకృష్ణారెడ్డి,శ్రీనివాస రెడ్డి,సతీష్,నాగేంద్ర బాబు తదితరులు పాల్గొనారు.

## బిల్లులు వెంటనే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బిల్లులను వెంటనే విడుదల చేయాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కూరగాయాలు, గుడ్లు, నిత్యవసర సరుకుల ధరలు అధికంగా పెరిగిన తరుణంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ఆయన అన్నారు. ప్రతి నెల బిల్లులు సమాయానకి వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రతి నెలా సమయానిక నిర్వహకులకు బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం లభిస్తుందని ఆయన అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బిల్లులను విడుదల చేయాలని కోరారు.

## బిసి యువతను ఆదుకోవడంలో విఫలం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర యువజన విధానాన్ని ప్రకటించాలని బిసి సంక్షేమ సంఘం హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షులు ధూళిపాళ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం హుజూర్‌నగర్ లోని బిసి సంక్షేమ సంఘం భవనంలో హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు అధ్యక్షులను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం కొరకు దరకాస్తులు స్వీకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులను ఆదుకోలేదన్నారు. బిసి యువతను ఆదుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు గోవిందరావు,గూడెపు దీప,గడ్డం అంజి,చేపూరి నరసింహాచారి,కోలపాటి వెంకటేశ్వర్లు,కాలువ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు వరం



ప్రజాపక్షం/పెబ్బేరు : పెబ్బేరు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లేల చిన్నారెడ్డిని సంప్రదించగా వారి ప్రత్యేక చొరవతో బాధితులందరికి సీఎం సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగింది. ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ ఆదేశాల మేరకు శనివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ వారిపల్లి గ్రామానికి చెందిన వర లక్ష్మికి రూ.16వేలు, రాంపురం గ్రామానికి చెందిన ఇద్దరి బాధితులకు చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. లబ్దిదారులు వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సహదేవుడు, అయ్యవారిపల్లి ఆనంద్ సాగర్, ఈశ్వర్ రెడ్డి, ఎల్లస్వామి నాయుడు, పరమేశు, క్రాంతి, కురుమూర్తి, ముకుందం గౌడ్, రాముడు, శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మొరం తరలింపు



ప్రజాపక్షం/మాగనూరు: మండల పరిధిలోని నేరడగం గ్రామంలో ప్రభుత్వ పరంగా ఎటువంటి అనుమతులు లేకుండా మొరమ్ అక్రమ తరలింపు జోరుగా సాగుతుంది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో అడ్డు అదుపు లేకుండా మొరం తరలిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టుగా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా మాగనూరు మండల పరిధిలోని నేరడగంలో గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా పట్ట పగలే మాడేచ్చగా జెసిబి లతో టిప్పర్లలో లోడ్ చేసి అమ్ముకుంటే సోమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి పెట్టి అక్రమార్కులను పట్టుకొని కేసులు పెట్టి, తీసుకోవాలని ప్రజలు అంటున్నారు.

## సిపిఐ జిల్లా మహాసభకు తరలిరావాలి



ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : కీలకమైన సిపిఐ జిల్లా మహసభలు 23,24 తేదీల్లో వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణంలో జరుగుతాయని జిల్లా నలుమూలల నుంచి నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐటిసి జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీరాం, పట్టణ కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ కోరారు. శనివారం వనపర్తి సిపిఐ ఆఫీసులో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేసిన అనంతరం పట్టణ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన జరిగిన ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడారు. 11 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రైతు ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని మోసం చేసిందన్నారు. దేశంలో పేదలు పెద్ద సంఖ్యలో ఆకలితో మగ్గుతుండగా దేశ సంపదను సంపన్నులకు దోచిపెట్టే విధానాలను బీజేపీ అంతరిస్తుందన్నారు. జిల్లాలో పాలమూరు ... రంగారెడ్డి బీమా కేవీల్ఐ నెట్టెంపాడు, కోయిల్ సాగర్ తదితర ప్రాజెక్టులు పూర్తి కాలేదని, పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని సాధించేందుకు పోరాట రూపాలను మహసభలో నిర్ణయించడం జరుగుతుందన్నారు. సిపిఐ జిల్లా కార్మిక సభ్యులు కళావతమ్మ సిపిఐ పట్టణ సహ కార్యదర్శి గోపాలకృష్ణ, మాజీ సహాయ కార్యదర్శి ఎర్రకురుమన్న, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు కృష్ణవేణి, లక్ష్మీ నారాయణ, వెంకటమ్మ పాల్గొన్నారు.

## జెడ్పి ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : కోయిల్‌కొండ మండలం పారుపల్లి గ్రామంలో జడ్పి ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జడ్పి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులు, విద్యార్థులకు హెల్త్ చెకప్, కంటి పరీక్షలు నిర్వహణ గురించి అడిగి సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. విద్యార్థిని విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ బోధన, మధ్యాహ్న భోజనం ఎలా ఉంది అన్ని విద్యార్థులను అడిగారు. మధ్యాహ్న భోజనంలో పప్పు, వెజిటేబుల్ కర్రీలో ఏది బాగుందని అడిగారు. వెజిటేబుల్ కర్రీ బాగుందని సమాధానం ఇచ్చారు. పాఠశాలలో విద్యార్థులు హాజరు గురించి హెడ్ మాస్టర్‌ను అడిగారు. 180 మంది విద్యార్థులు హాజరు అయ్యారని తెలిపారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



ప్రజాపక్షం/మానవపాడు: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ నీటి సంఘం అధ్యక్షుడు లక్కిరెడ్డి కర్ణసింహారెడ్డి సేవా కృషితో ఈ గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే విజయుడు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. లబ్ది పొందిన లబ్దిదారులు ముందుగా ఎమ్మెల్యేకి జల్లాపురం గ్రామ లక్కిరెడ్డి కర్ణసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు లక్కిరెడ్డి కర్ణసింహారెడ్డి, మాజీ సర్పంచు రాంభూపాల్‌రెడ్డి, సామాజిక కార్యకర్త శాంతకుమార్, జక్కుల రమేష్ బాబు, కరెంట్ ఉశేన్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన రేషన్ కార్డుల అందజేత



ప్రజాపక్షం/కృష్ణ: మక్తల్ నియోజకవర్గంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్‌లో జరిగిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి డా.వాకిటి శ్రీహరి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా కృష్ణ మండలానికి 789 కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో 7001 నూతన రేషన్ కార్డులు అందజేశామని, గత ప్రభుత్వం ఒక్కటంటే ఒక్కటే కూడా కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని గుర్తు చేశారు. కాని ప్రజా ప్రభుత్వం వచ్చాకా మీరంతా సన్నరకం వరి వేసి పండించండి. మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి కొంటామని చెప్పిన విధంగా కొని రైతులను అద్దుకున్నదని అన్నారు. రైతులు పండించిన సన్నరకం వరితో రైస్ మిల్లుల ద్వారా సన్నబియ్యాన్ని రేషన్ డీలర్లకు అందించి, ప్రతి ఒక్కరికి 6 కిలోల సన్న బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మండలం తాహసిల్దార్ శ్రీనివాస్, రేషన్ డీలర్లు, కొత్త రేషన్ కార్డుల లబ్దిదారులు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

ప్రజాపక్షం/అచ్చంపేట : అచ్చంపేట నియోజకవర్గంలోని ఉమామహేశ్వర క్షేత్రం కొండదిగువన ఉన్న భోగ ఉమామహేశ్వర దేవాలయ అభివృద్ధికి రూ.50లక్షలు మంజూరయ్యాయని ఉమామహేశ్వర దేవస్థానచైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.50లక్షలు సిజిఎఫ్ నిధులద్వారా మంజూరైనట్లు తెలిపారు. ఇటీవల దేవాదాయ శాఖమంత్రి కొండాసురేఖ వచ్చినప్పుడు దేవాలయానికి ఉన్న అవసరాలను వారిదృష్టికి తేవడంతో వారు స్పందించారని అంచెలవారిగా చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే అభివృద్ధి

క్రీడలు, యువజన సర్వీసులు, మత్స్యశాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/మక్తల్/నర్వ: మహిళలు ఆర్థికంగా ఎదిగితే జిల్లా, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని క్రీడలు యువజన సర్వీసులు, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మన దేశానికి భారత మత అని పేరుందని, రాష్ట్రానికి తెలుగు తల్లి ఉందని, అన్ని నదులు కూడా మహిళల పేర్లతోనే ఉన్నాయని మహిళలకు అంత శక్తి ఉందని ఆయన చెప్పారు. శనివారం మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మక్తల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించిన మహిళా సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను నిర్వహించారు.ఈ సంబరాలకు ముఖ్య అతిథిగా మంత్రి డా.వాకిటి శ్రీహరి, నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రికి మహిళలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ మక్తల్ నియోజకవర్గంలోని అమర చింత, నర్వ, ఉట్కూర్ మండలాల్లోని మహిళా సమాఖ్య సంఘాలకు 1,08, 00,000/ ఒక్కకోటి ఎనిమిది లక్షల రూపాయలులతో ప్రభుత్వం అందించిన 3 ఇందిరా మహిళా శక్తి ఆర్టీసీ బస్సులను,10 లక్షల వ్యయం గల సంచార చేపల విక్రయ కేంద్ర వ్యాన్‌ను ప్రారంభించారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి సంబరాలలో మంత్రి, కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ముందుగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ప్రగతికి పెద్దపీట వేసిందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభమైన పావలా వడ్డీ పథకాలు నేడు మళ్ళీ ఇందిరమ్మ రాజ్యంలోని రేవంత్ ప్రభుత్వంలో మళ్ళీ అమలు అవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ మొగులప్ప, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, కార్యదర్శి కోశాధికారి జిల్లాలోని అన్ని మండల సమాఖ్యల అధ్యక్ష కార్యదర్శులు, డిపిఎం, సిసిలు, మహిళా సమాఖ్య సంఘాల సభ్యులు, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

## జడ్చర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి శరవేగంగా చర్యలు



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసుకుందామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి అన్నారు. శనివారం నాడు జడ్చర్ల పట్టణంలోని త్రిశూల్ నగర్ పరిధిలో 27 వార్డులకు గాను పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండదండలతో జడ్చర్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని అన్నిరకాలుగా పరిష్కరించి ముందుకు సాగుతున్నమని ఆయన తెలిపారు. అదే విధంగా 14వ వార్డులో 1 కోటి 35 లక్షల రూపాయలతో రోడ్డు, డ్రైనేజీ ఇతర పనులను చేపట్టబోతున్నట్లు ఆయన వివరించారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని దానిని పరిష్కరించి ప్రజలు కష్టాలు తీర్చాలని ఆయన వివరించారు. ప్రస్తుతం వర్షకాలం కారణంగా మురికి కాలువలు నిండి రోడ్లపై మురికి నీరు ప్రవహిస్తుందని మున్సిపాలిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఆయన సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ఆయా వార్డుల కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, రమేష్, భాస్కర్‌రెడ్డి, చైతన్య, రాజు, చౌహాన్, నిత్యానందం, లక్ష్మి, అశోక్ యాదవ్, ఆనంద్, ఖాతా తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు సువర్ణావకాశం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని కోటకదిర గ్రామంలో 8 లక్షల రూపాయల ఎస్డీఫ్ నిధులతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ గ్రామంలోని గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ , ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత, మధుసూదన్‌రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేశ్, మారేపల్లి సురేందర్‌రెడ్డి, నాయకులు సిజె బెనహర్, సుధాకర్ రెడ్డి, మల్లు అనిల్ రెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, గోవింద్ యాదవ్, మహేందర్ గౌడ్, కె.సాయిలు, కురుమూర్తి, వెంకటేశ్, కైసర్, మనెమ్మ, మైబు, లాలు పోతన్‌పల్లి మోహన్‌రెడ్డి, వెంకట్‌రాములు, శాంతయ్య తదితరులు ఉన్నారు.

## స్టేషన్ ఎదుట గడ్డి మందు తాగి తండ్రి, కొడుకు ఆత్మహత్యాయత్నం



చికిత్స కోసం ఆసుపత్రికి తరలింపు

ప్రజాపక్షం/వీపనగండ్ల : కుటుంబ కలహాలతో కలత చెందిన తల్లిదండ్రులు కొడుకుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అవమానానికి గురైన కొడుకు తన కొడుకుకు పోలీస్ స్టేషన్ ఎదుట గడ్డి మందు తాగించి తాను తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వీపనగండ్ల పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం మండల కేంద్రమైన వీపనగండ్ల గ్రామానికి చెందిన చాపల బాలెల్లి, బాలమ్మల కుమారుడు చాపల రాముడికి 17 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహనంతరం రాముడు తల్లిదండ్రులతో గొడవ పడటంతో బాలెల్లి, బాలమ్మలు గ్రామంలోని మరో ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. రాముడు గ్రామంలోని వ్యవసాయపనులతో పాటు బొలెరో వాహనం నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా గత నెల రోజుల క్రితం బొలెరో వాహనం ద్విచక్ర వాహనానికి ఢీ కొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దీంతో పెద్దల సమక్షంలో మృతుని కుటుంబ సభ్యులకు సుమారు రూ.6లక్షల మేర అప్పజెప్పేందుకు రాజీ కుదిరించారు. దీంతో అప్పటికే అప్పులపాలైన రాముడు మరింత అప్పు భారం పెరగడంతో తల్లిదండ్రులపై ఉన్న ఇంటిని తన పేరున రాయాలని, తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకుంటానని తల్లిదండ్రులను కోరాటంతో ఒప్పుకోకపోవడం వల్ల కుటుంబ కలహాలు మొదలయ్యాయని తెలిపారు. అక్క చెల్లెలు కూడా తల్లిదండ్రులతో కలిసి తనను నడి బజార్లో కొట్టి తనపైనే తన తల్లిదండ్రులచే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించినట్లు బాధితుడు రాముడు తెలిపారు. దీంతో రాముడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన ఎస్ఐ కె.రాణి నువ్వు తల్లిదండ్రులను కొట్టినందుకు గాను నిన్ను జైలుకు పంపిస్తానని బెదిరించడం వల్ల మనస్థాపానికి గురై పోలీస్ స్టేషన్ ఆవరణలోనే తన 16 సంవత్సరాల కొడుకు శ్రీహరికి గడ్డి మందు తాగించి తాను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుడు రాముడు తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణలోనే పురుగుల మందు తాగిన తండ్రి కొడుకులు ఇద్దరిని హుటాహుటిన పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం బాధితులని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటన తెలుసుకున్న కొత్తకోట సిఐ రాంబాబు, స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద బాధితుడి భార్య చెన్నమ్మ, కుటుంబ సభ్యుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిఐ వెంట పెబ్బేరు ఎస్ఐ యుగంధర్ రెడ్డి, శ్రీరంగాపూర్ రామకృష్ణ ఉన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేస్తాం

నారాయణపేట్ ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి



ప్రజాపక్షం/నారాయణపేట్: కోయిల్‌కోండ శ్రీ వీరభద్రస్వామి టెంపుల్ దగ్గర ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి సంబరాల, విజయోత్సవాలలో నారాయణ పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి 828 మహిళా సంఘాల సభ్యులకు 94 లక్షల 64 వేలు వడ్డీ లేని రుణాలు పంపిణీ, బ్యాంకు ద్వారా 61 సంఘాలకు రూ.5 కోట్ల రుణాలు పంపిణీ ప్రమాదవశాత్తు మరణించిన మరణించిన మహిళా సంఘాల సభ్యుల కుటుంబం సభ్యులకు పది లక్షల చొప్పున 5 మంది కి 36 లక్షల 49 వేల రూపాయల చెక్కున పంపిణీ. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి స్పష్టం చేశారు. ఇందిరా మహిళా శక్తి సంబరాలు కోయిల్ కొండలో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి సంబరాలలో విజయోత్సవాలలో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారన్నారు. సిలిండర్ రాయితీ ఇవ్వడంతో పాటు మహిళా శక్తి క్యాంటీన్లు, పెంట్రోల్ బంక్‌లకు ఇప్పుడు ఆర్టీసీ బస్‌లకు ఓనర్లకు చేస్తున్నామన్నారు. మహిళలు ముందుకు వచ్చి బాధ్యత తీసుకుంటే విజయం సాధిస్తారు అనే నమ్మకం విశ్వాసం ఉందన్నారు. ఈ ప్రభుత్వం మాట తప్పదని ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు 3500 ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ప్రొసిడీంగ్ పత్రాలను ఇచ్చామని, వచ్చే సంవత్సరం 3500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఆయన చెప్పారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు 94,64,459 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలు అందజేశారు. బ్యాంకు లో ద్వారా 5 కోట్ల రూపాయల విలువైన రుణాలను అందజేశారు. ప్రమాదవశాత్తు మరణించిన 5 మంది కుటుంబ సంఘం సభ్యులకు 10 లక్షల చొప్పున కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి వివిధ మహిళా సమాఖ్య సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ మహాసభల కరపత్రం విడుదల

ప్రజాపక్షం/బిజినేపల్లి : సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా మూడో మహాసభ సందర్భంగా మండలంలోని లట్టుపల్లి గ్రామంలో శనివారం కరపత్రం విడుదల చేస్తూ శాఖ సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి బిజినేపల్లి మండల సహాయ కార్యదర్శులు ఈర్ల భూపేష్, మధుగౌడ్ హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా మూడో మహాసభను కల్వకుర్తి పట్టణంలో ఆగస్టు 1,2తేదిలలో నిర్వహించడం జరుగుతుందని కావున ఈమహాసభకు పెద్ద ఎత్తున లట్టుపల్లి గ్రామంనుండి జనసమీకరణ చేసి మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మంగంపేటశ్రీను, బుగ్గనాగన్న, ఊశన్న, చంద్రయ్య, రాములు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ పోస్టర్ విడుదల



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వామపక్ష విద్యార్థ సంఘాల ఆధ్వర్యంలో జూలై 23న జరిగే విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునివ్వడం జరిగింది. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ సంఘాల అధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో బంద్ కు సంబంధించిన పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్ పిడి ఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ గవర్నమెంట్ ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న విద్యాసంస్థలను గాలికి వదిలేయడం జరిగింది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోస్తున్న ఫీజుల నియంత్రణ చట్టాన్ని ప్రైవేటు కార్పోరేట్ విద్య సంస్థలో పకడ్బందీగా అమలు చేయాలి. తదితర డిమాండ్స్‌పై జూలై 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థలకు బంద్ పిలుపునివ్వడం జరిగింది. ఈ బంద్‌కు ప్రైవేటు, కార్పోరేట్, విద్యాసంస్థల యజమాన్యాలు అట్లాగే విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నందు, పట్టణ అధ్యక్షులు సాయి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు అరుణ్, అరవింద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు జీవన్, దినకర్ లు పాల్గొన్నారు.

## సర్జన్ పోస్టుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ :కలెక్టర్



ప్రజాపక్షం/మహబూబ్ నగర్/జడ్చర్ల: మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలోని ఏరియా ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (1), సివిల్ అసిస్టెంట్ సర్జన్ (1) పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన ఒక సంవత్సరం కాలానికి భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుకున్నట్లు జిల్లా కలెక్టర్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల సేవల నాణ్యత పై ఆధారపడి నియామక కాలాన్ని పొడిగించవచ్చని తెలిపారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టు కొరకు అనస్థీషియా / జనరల్ సర్జన్/ ఫోరెన్సిక్ మెడిసిన్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకొవచ్చని, ఈ పోస్టులో ఎంపిక అయిన వారికి రూ. ఒక లక్ష వేతనం ఉంటుందన్నారు. అదే సివిల్ అసిస్టెంట్ సర్జన్ (1) పోస్ట్‌కు ఎంబిబిఎస్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని జీతం రూ.52,351 చెల్లించడం జరుగుతుందని తెలిపారు. 01.07.2025 నాటికి అభ్యర్థుల కనీస వయస్సు 18 సంవత్సరాలు, గరిష్ఠ వయస్సు 46 సంవత్సరాలు కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు (సైన్యంలో చేసిన సేవ కాలానికి అదనంగా) దివ్యాంగులకు 10 సంవత్సరాలు వయో పరిమితి సడలింపు ఉంటుందని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారం స్వయంగా లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా సూపరింటెండెంట్, జిల్లా హెడ్ క్వార్టర్, ఏరియా ఆసుపత్రి, జడ్చర్లకు జులై 28లోపు పంపాలని తెలిపారు. గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులు తిరస్కరించబడతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్‌ను సంప్రదించాలని సూచించారు.

## సాగునీరు విడుదల చేయాలి

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



ప్రజాపక్షం/మక్తల్: మక్తల్ మండల పరిధిలోని భూత్పూర్ రిజర్వాయర్ రైట్ కెనాల్ ద్వారా అధికారులు రైతులకు నీళ్లు సక్రమంగా విడుదల వేయడం లేదని శనివారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని కలిసి రైతులు ఫిర్యాదు చేశారు. వారి సమస్యలను తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రిజర్వాయర్ రైట్ కెనాల్ దగ్గరికి వెళ్లి అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని లేకపోతే పంట పొలాలు ఎండిపోయి రైతులు నష్టపోతారని అధికారులు స్పందించి పంటలకు సకాలంలో సాగునీరు అందించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, మక్తల్ టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చందాపురం అశోక్ గౌడ్, నరేందర్‌రెడ్డి, హనుమంతు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ప్రజాపక్షం/వెల్దండ : ప్రభుత్వపాఠశాలలోనే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని కాంగ్రెస్‌పార్టీ యువనాయకులు లచ్చిరాంనాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోనిగాను గట్టుతండా యుపిఎస్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు సొంత ఖర్చులతో నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, ప్యాడ్స్ ఇతర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రజనికాంత్, కార్యదర్శి మాధవి, నాయకులు చిన్నానాయక్, లక్రుతినాయక్, రాజునాయక్, బాలునాయక్, వెంకయ్యనాయక్, రామునాయక్, లచ్చిరాంనాయక్ పాల్గొన్నారు.

# క్రీడ

## టీమిండియాతో సెమీఫైనల్..

### నా కెరీర్లో అత్యుత్తమ క్షణం అదే: రస్సెల్



అంతర్జాతీయ క్రికెట్‌లో విధ్వంసక ఆటగాళ్లలో ఒకడైన ఆండ్రీ రస్సెల్ వీడ్కోలుతో అందర్నీ ఆశ్చర్యపరిచాడు. పొట్టి క్రికెట్ స్పెషలిస్ట్‌గా ముద్ర పడిన రస్సెల్ టీ20 వరల్డ్ కప్ టోర్నీకి ఏడు నెలల ముందే అల్విదా పలికి కరీబియన్ జట్టుకు ఝలక్ ఇచ్చాడు. ఆస్ట్రేలియాతో సిరీస్ మధ్యలోనే మూడు ఫార్మాట్ల నుంచి వైదొలగుతున్నట్టు రసెల్ ప్రకటించడంతో అతడి రికార్డులపై ఓ లుక్కేస్తున్నారు అభిమానులు. ఈ కరీబియన్ స్టార్ కూడా ఫ్యాన్స్‌కు తెలియని పలు విషయాలను పంచుకుంటున్నాడు. శనివారం ఈ చిచ్చరపిడుగు తన సుదీర్ఘ జర్నీలోని ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు.

## చెస్

# అడుగు దూరంలో అర్జున్

### ప్రజ్ఞానందకు 'ఓదార్పు విజయం'



ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టూర్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగేసి పోరాటం ముగిసింది. తొలి రౌండ్ నుంచి సంచలన విజయాలతో సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లిన ఈ యువకెరటం టైటిల్‌కు అడుగు దూరంలో ఆగిపోయాడు. ఈ టోర్నీలో సెమీస్‌కు చేరిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన తెలంగాణ కుర్రాడు అర్మేనియాకు చెందిన లెవాన్ అరోనియన్ చేతిలో అనూహ్యంగా కంగుతిన్నాడు. లాస్ వేగాస్ వేదికగా శనివారం జరిగిన పోరులో గట్టిగానే పోరాడిన అర్జున్ ప్రత్యర్థిని నిలువరించలేకపోయాడు. తొలి గేమ్‌లో అవకాశాలు వచ్చినప్పటికీ సద్వినియోగం చేసుకోలేక 0—2తో ఓటమి పాలయ్యాడు. వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి టైటిల్‌పై ఆశలు రేపిన ప్రజ్ఞానంద క్వార్టర్స్‌లోనే వెనుదిరిగిన విషయం తెలిసిందే. ప్రపంచంలోని గ్రాండ్‌మాస్టర్లు హోరాహోరీగా తలపడుతున్న ఈ టోర్నీలో ప్రజ్ఞానంద మరో విజయం సాధించాడు. సెమీస్ అవకాశం చేజార్చుకున్న అతడు మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో అదరగొట్టాడు. తనమార్క్ ఆటతో విన్సెంట్ కెయ్‌మర్(జర్మనీ)ని మట్టికరిపించాడు ప్రజ్ఞానంద. నల్లపావులతో ఆడిన భారత స్టార్ తొలి రౌండ్‌ను డ్రాగా ముగించాడు. ఆ తర్వాతి రౌండ్‌లో అంతుచిక్కని విధంగా ఆడుతూ 1.5—0.5తో ప్రత్యర్థిని ఓడించాడు. మరోవైపు నార్వే దిగ్గజం కార్ల్‌సన్ కూడా విక్టరీ కొట్టాడు. ఉజ్బెకిస్థాన్ ప్లేయర్ జవోఖిర్ సిందారవోపై అద్భుత విజయంతో మూడో స్థానం రేసులో నిలిచాడు.



## ఫ్యాన్స్‌కు పూనకాలే?

ఇంగ్లాండ్ వేదికగా చిరకాల ప్రత్యర్థుల ఫైట్..

క్రికెట్‌లో ఫార్మాట్ ఏదైనా సరే భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ తెలిసిందే. వరల్డ్ కప్ వంటి ఐసీసీ టోర్నీల్లో అయితే దాయాదుల మ్యాచ్ రోజు స్టేడియాలు కిక్కిరిసిపోవాల్సిందే. అయితే.. ఆపరేషన్ సిందూర్ తర్వాతి ఇరుజట్ల మధ్య క్రికెట్ అనే మాటే కరువైంది. ఈ నేపథ్యంలో ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించేందుకు సిద్ధమవుతున్నారు క్రికెటర్లు. అవును.. త్వరలో జరగబోయే 'వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' లీగ్‌లో వెటరన్ ఆటగాళ్లతో కూడిన ఇండియా ఛాంపియన్, పాకిస్థాన్ ఛాంపియన్ జట్లు తలపడనున్నాయి. దాంతో, మ్యాచ్ వేదిక ఎక్కడ? ఎప్పుడు మొదలవుతుంది? లైవ్ స్ట్రీమింగ్ ఎక్కడ చూడాలి? అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు ఫ్యాన్స్. ఒకప్పుడు మైదానంలో కొదమ సింహాల వలె 'నువ్వా నేనా' అన్నట్టు ఎదురుపడిన పాక్, టీమిండియా క్రికెటర్లు ఇప్పుడు మరోసారి తమ పోరాటంతో ఫ్యాన్స్‌ను అలరించేందుకు సిద్ధమయ్యారు. ప్రతిష్ఠాత్మక వరల్డ్ ఛాంపియన్‌షిప్ లెజెండ్స్ లీగ్ రెండో సీజన్‌లో నేడు (జూలై 20) ఇంగ్లండ వేదికగా ఇండోపాక్ క్రికెట్ సమరం జరగనుంది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానం ఈ ఉత్కంఠ పోరుకు వేదిక కానుంది. మాజీ ఆటగాళ్లు యువరాజ్ సింగ్, శిఖర్ ధావన్, సురేశ్ రైనా, రాబిన్ ఉతప్ప, అంబటి రాయుడులతో భారత జట్టు బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. వినయ్ కుమార్, అభిమన్యు మిథున్, సిద్ధార్థ్ కౌల్, వరుణ్ అరుణ్‌లతో కూడిన పేస్ దళం కూడా బలంగానే కనిపిస్తోంది. ఇక వెటరన్లు హర్భజన్ సింగ్, పీయూష్ చావ్లాలు తమ స్పిన్‌తో పాక్ బ్యాటర్లను బోల్తా కొట్టించేందుకు సిద్ధమవుతున్నారు.

## భారత్‌తో రెండో వన్డే

### ఇంగ్లాండ్ లక్ష్యం 144

### తొలి వికెట్ కోల్పోయిన ఇంగ్లాండ్

లార్డ్స్ వేదికగా జరుగుతున్న రెండో వన్డేలో ఇంగ్లాండ్ తొలి వికెట్ కోల్పోయింది. భారత్ నిర్దేశించిన స్వల్ప ఛేదనలో ధనాధన్ ఆడుతున్న ఓపెనర్ టమ్మీ బ్యూమంట్ (34) వెనుదిరిగింది. బౌండరీలతో రెచ్చిపోతున్న ఆమెను స్నేహ్ రానా ఎల్బీగా ఔట్ చేసింది. దాంతో, 51 పరుగుల వద్ద ఆతిథ్య జట్టు మొదటి వికెట్ పడింది. ప్రస్తుతం అమీ జోన్స్(24), కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(4)లు క్రీజులో ఉన్నారు. 12 ఓవర్లకు స్కోర్.. 64/1. ఇంకా ఇంగ్లాండ్ విజయానికి 80 రన్స్ కావాలి.



వర్షం కారణంగా ఓవర్లు కుదించిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. స్మృతి మంధాన(42) చెలరేగినా.. మిడిలార్డర్ దారుణంగా విఫలమైంది. లార్డ్స్ మైదానంలో ఆతిథ్య జట్టు బౌలర్లు చెలరేగగా టీమిండియా ప్రధాన ప్లేయర్లు కనీసం రెండంకెల స్కోర్ చేయలేకపోయారు. మంధాన ఔటయ్యాక దీప్తి శర్మ(30), అరుంధతి రెడ్డి(14)లు పోరాడడంతో హర్మన్‌ప్రీత్ సేన నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేయగలిగింది.

## ఫోకస్

## స్పోర్ట్స్

జార్జియాలో మొట్టమొదటిసారి ప్రపంచ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్స్‌ను నిర్వహించనున్నారు. ఈనెల 22 నుంచి 30 వరకు జార్జియా రాజధాని టిబిలిసిలో నిర్వహించే ఈ పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి అథ్లెట్లు ఫాయిల్, సాబర్, ఎపీలలో పోటీపడు తున్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో వ్యక్తిగత, టీం ఈవెంట్స్ జరుగుతాయి.




# తొలిసారి 'ఫెన్సింగ్'కు జార్జియా రెడీ

ఇటీవల కాలంలో ఫెన్సింగ్‌లో రాణిస్తున్న జార్జియాలో ప్రపంచ చాంపియన్‌షిప్స్ నిర్వహించడం స్థానిక అభిమానుల్లో ఉత్కంఠ రేపుతున్నది. జార్జియాకు చెందిన సాండ్రో బజాడ్జే ఈ చాంపియన్‌షిప్స్‌లో పతకాన్ని కైవసం చేసుకోవడం ద్వారా చరిత్ర సృష్టించడానికి సిద్ధమవుతున్నది. ప్రపంచ క్రీడల చరిత్రలో ఫెన్సింగ్‌కి ప్రత్యేక స్థానం ఉంది. ఇది ఒక శైలి, ఒక సంస్కృతి, ఒక పోరాట కళ. ఫెన్సింగ్ అనేది కత్తులతో చేసే ఓ నైతిక పోరాటం. దీనిలో ఆటగాడి శరీర శక్తి, మానసిక నైపుణ్యం, వ్యూహాత్మకత వంటి అంశాల్నీ ఒకేచోట సమన్వయమవుతాయి. ఆధునిక యుగంలో ఫెన్సింగ్ ఓ ఒలింపిక్ క్రీడగా మారినప్పటికీ, దాని మూలాలు మాత్రం రాజులు లేదా రాజవంశాలకు సంబంధించినవే.మొదట్లో ఇది ఒక ఆత్మరక్షణ కళ. తరువాత రాజరిక ప్రజాప్రతినిధుల మధ్య గౌరవదాయక ద్వంద్వయుద్ధం, తరువాత ఓ రాజకీయ, గౌరవప్రతిష్ఠ అంశంగా కూడా రూపాంతరం చెందింది. 16వ శతాబ్దంలో స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్ దేశాల్లో ఫెన్సింగ్ శాస్త్రంగా అభివృద్ధి చెందింది. సమురాయ్ యోధులు జపాన్‌లో 'కెన్డో' అనే ఫెన్సింగ్ మాదిరి విద్యను అభ్యసించేవారు. 1896లో మొట్టమొదటి ఒలింపిక్స్‌లో పురుషుల ఫెన్సింగ్ ప్రారంభమైంది. 1924లో మహిళల విభాగంలో ఫెన్సింగ్‌ను ప్రవేశపెట్టారు. ఇటలీ, ఫ్రాన్స్, కొరియా, రష్యా, హంగరీ వంటి దేశాలు ఫెన్సింగ్‌లో ఆధిపత్యం చూపిస్తున్నాయి.

### ఆయుధాలు ప్రత్యేకం..

ఫెన్సింగ్‌లో ఆయుధాలు ప్రత్యేకమైనవి. అత్యంత కీలకమైనవి కూడా. 'ఎపీ' అనేది బరువైన ఆయుధం. పూర్తిగా స్టీల్‌తో తయారు చేసిన, వంపులేని కత్తి. ఫెన్సర్లు దీనితో ప్రత్యర్థి శరీరంలో ఎక్కడైనా తాకితే పాయింట్ లభిస్తుంది. కాబట్టి, పోటీదారులకు 'రక్షణ' విధానం కీలకం. కాగా, ఫాయిల్ అనేది తేలికైన, సాధారణంగా శిక్షణలో మొదట నేర్పించే ఆయుధం. దీనితో ప్రత్యర్థుల ఛాతీ, మెడ, పొట్ట ప్రాంతాల్లో మాత్రమే దాడి చేయడానికి వీలుంటుంది. కోయడం, కత్తిరించడం ద్వారా పాయింట్లు లభించే విభాగాన్ని సాబర్ అంటారు. మెడకు పైన, చేతులు, తల వరకు టార్గెట్ జోన్‌గా పేర్కొంటారు. ఇది ఇది అత్యంత వేగంగా మారే విభాగం. ఫెన్సింగ్ పోటీలు పిస్టే అనే ప్రత్యేకంగా రూపొందించిన పొడవైన మైదానంలో జరుగుతాయి. ప్రతి ఆటగాడికి ఐదు మీటర్ల స్థలం లభిస్తుంది. ప్రతి పాయింట్ కోసం ఆటగాడి కత్తి ముఖంగా ప్రత్యర్థిని తాకాలి. ప్రతి పోటీ మూడు రౌండ్లుగా ఉంటుంది. ఒక్కోటి 3 నిమిషాల పాటు జరుగుతుంది. 15 పాయింట్లు సాధించినవాడు గెలుస్తాడు. ఫెన్సింగ్ క్రీడాకారులు ఎన్‌గార్డ్, లుంజ్, పెర్రీ, రిపోస్టె అనే టెక్నిక్స్ వాడతారు. ఆట ప్రారంభించే స్థితి. రెండు కాళ్ల మధ్య సమతూకాన్ని ఎన్‌గార్డ్ అంటారు. పెర్రీ అంటే, ప్రత్యర్థి దాడిని కత్తితో నిరోధించడం. పెర్రీ తర్వాత వెంటనే ఎదురుదాడి చేయడాన్ని రిపోస్టెగా వ్యవహరిస్తారు.

### ఎక్విప్‌మెంట్..

ఫెన్సింగ్‌కి అవసరమైన ఎక్విప్‌మెంట్‌లో మాస్క్ ప్రధానమైనది. ఇది ముఖాన్ని రక్షించే షీల్డ్. శరీరానికి రక్షణ కల్పించే జాకెట్ కఠినమైన వస్త్రం. ఆయుధం పట్టే చేతిని రక్షించడానికి ప్రత్యేకమైన గ్లోవ్స్ ఉంటాయి. మోకాళ్ల వరకు ఉండే బార్డెడ్ ప్యాంట్లను బ్రీచెస్ అంటారు. ఫెన్సింగ్ షూస్ తేలికగా, గ్రిప్ కలిగి ఉంటాయి.

## ప్రయోజనాలు ఎన్నో..

స్పందించే మెళకువలు అలవాటవుతాయి. విద్యార్థులకు ఫెన్సింగ్‌తో భవిష్యత్తులో మెరుగైన అవకాశాలు ఏర్పడతాయి. వివిధ యూనివర్సిటీలు క్రీడా స్కాలర్‌షిప్స్ అందిస్తున్నాయి. ఈ క్రీడలో రాణించి, దేశానికి ప్రాతినిథ్యం వహించే అవకాశాన్ని పొందవచ్చు. పోలీస్, ఆర్మీ, రైల్వే వంటి వివిధ సంస్థల్లో క్రీడాకారులకు ప్రత్యేక కోటా కింద ఉద్యోగాలిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో మారుమూల ప్రాంతాల్లో ఉన్నటువంటి క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. ఫెన్సింగ్ అనేది శక్తి, శ్రద్ధ, నైపుణ్యం, సంయమనం . ప్రతిస్పందనల సమ్మేళనమైన కళ. ఇది ఒక క్రీడ మాత్రమే కాదు, ఓ ఆత్మవిశ్వాసపు పాఠం. భారతదేశం నుంచి మరిన్ని భవాని దేవిలు తయారవుతుండటం మనకు గర్వకారణం. యువత ఈ అరుదైన, ఉన్నతమైన క్రీడను అభ్యసించి తమ జీవితానికే కాకుండా దేశానికీ గౌరవం తీసుకురావాలనేది మన ఆశ.

ఫెన్సింగ్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ క్రీడ కండరాల బలాన్ని పెంపొందిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సమతూకం మెరుగవుతుంది. వ్యూహాత్మక ఆలోచన పెరుగుతుంది. వేగం, స్ఫూర్తి ఉద్దీపనమవుతాయి. ఈ క్రీడ ఆందోళనను నియంత్రించగలదు. శరీర కౌశల్యాన్ని పెంపొందిస్తుంది. శత్రువుని అంచనా వేయడం నేర్పుతుంది. సత్వరమే



### గురుకుల పాఠశాల, కళాశాలలలో మౌలిక వసతులు కల్పించాలి


ప్రజాపక్షం/భువనగిరి: జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో, గురుకుల పాఠశాల, కళాశాలలలో ఆశ్రమ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో గురుకుల పాఠశాలలలో జరుగుతున్న విద్యార్థుల మరణాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని హాస్టల్లో గురుకుల పాఠశాలలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సంక్షేమ హాస్టల్లో వార్డెన్లు అందుబాటులో ఉండకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. జిల్లాలోని గురుకుల పాఠశాలల కోసం సొంత భవనాలు నిర్మించి జిల్లాలో గురుకుల విద్యార్థుల మరణాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలన్నారు. విద్యార్థులకు అందుబాటులో లేని వార్డెన్లను అధికారులను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు చిప్పలపల్లి బన్నీ, వంశీ తదితరులు పాల్గొన్నారు.



# దశాబ్దాలు గడిచినా నెరవేరని పేదల సొంతింటి కల

● స్థానిక యువతకు కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో ఉపాధి కల్పించాలి ● సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

ప్రజాపక్షం/కాజీపేట : ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం దేశ స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు పోరాడుతూనే ఉన్నారని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. శనివారం కాజీపేటలోని ఎఆర్‌ఆర్ కాలనీలో సిపిఐ శాఖ సమావేశం శాఖ కార్యదర్శి సలకుల స్వరూప అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని దుస్థితి దాపురించిందని, గత టిఆర్‌ఎస్ ప్రభు త్వం పేదల ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రూంలు కట్టించి ఇస్తామని తీవ్ర నిర్లక్ష్యం చేసినందువల్లే అధికారం కోల్పోయిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, కానీ ఇంకా రాష్ట్ర ప్రభు త్వం దీనిని అమలు చేయ చూపడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హా మీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని, అనే క సంవత్సరాలుగా నగరంలో ప్రభుత్వ భూమిలో నివా సం ఉంటున్న వారికి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు మం జూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని కాజీపేట రైల్వే డివిజన్ ను నిర్లక్ష్యం చేసిందని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీతో పాటు కాజీపేట రైల్వే డివిజన్ కోసం సిపిఐ దశాబ్దాల కాలంగా పోరాడింద ని, దాని ఫలితమే కోచ్ ఫ్యాక్టరీని సాధించుకోవడం జరిగిందన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, ఉత్తర, దక్షిణ భారతానికి మధ్య వారధిగా ఉన్న కాజీపేటను రైల్వే డివిజన్ కేంద్రంగా చేయాలని డి మాండ్ చేశారు. రాంపూర్ గ్రామంలోని డంపింగ్ యా ర్డుతో గాలి కలుషితమవుతోందని, దుర్వాసనతో జీవనం సాగిస్తున్న ప్రజలు అస్వస్థతకు గురవుతున్నారని, ప్రజలకు ఇబ్బందికరంగా మారిన డంపింగ్ యార్డును తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర స మితి సభ్యులు ఎన్‌వి స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి, మండల కార్యదర్శి మాలోతు శంక ర్ నాయక్, నాయకులు కుడిస్వామి, సలకుల స్వరూప, రాసమల్ల దీన, రాసమల్ల కుమార్, జార్జ్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



# గురుకులాలలో ఫుడ్ పాయిజన్స్ సమస్యలు పరిష్కరించాలి

### సిఎం రేవంత్ రెడ్డి గురుకులాలను సందర్శించాలి

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : గురుకులాలల్లో ఫుడ్ పాయిజన్స్ సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురుకుల పాఠశాలల్లో నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్స్ చోటు చేసుకోవడంతో గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు అస్వస్థతకు గురై పాము కాటులతో, అనుమానాస్పద స్థితిలో కొందరు విద్యార్థులు మరణించారన్నారు. దీంతో ప్రభుత్వం ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పిన మళ్లీ విద్యాసంవత్సరం ప్రారంభం అయిన గురుకులాల్లో ఫుడ్ పాయిజన్స్, విద్యార్థుల ఆత్మహత్యలు ఆగడం లేదన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల గురుకుల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గురుకులాలు సంక్షేమ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ గల కారణాలు గుర్తించాలని నాసిరకం, కల్తీ వస్తువుల ఉపయోగం, తాగునీరు కలుషితం వల్ల విద్యార్థులు అనారోగ్య పాలవుతున్నారన్నారు. అద్దె భవనాల్లో గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. అదేవిధంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో రోజువారి మెనూ సక్రమంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రతినెల బిల్లులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గురుకులా పాఠశాలల్లో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కోసం అవగాహన సదస్సులు విశ్రాంత అధ్యాపకులు, విద్యావంతులతో,మానసిక నిపుణులతో నిర్వహించాలని 'మతపరమైన' వారితో నిర్వహించడం సరికాదన్నారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దేఉన్నప్పటికీ గురుకులాల్లో సమస్యలు పరిష్కారం కావడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం గురుకుల పాఠశాలలను సందర్శించాలని క్షేత్రస్థాయిలో జరుగుతున్న సమస్యలను గుర్తించి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ డిమాండ్ చేశారు.

## ఎఐటియుసి ఆధ్వర్యంలో పెరిగిన హమాలీ రేట్లు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : ఎఐటియుసి ఆధ్వర్యంలో కొండమల్లేపల్లిలోని సిమెంట్, ఐరన్ హమాలీ రేట్లు పెంచుకోవడం జరిగిందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామిలు శనివారం తెలిపారు. కొండమల్లేపల్లి మార్కెట్ యార్డులో సిమెంట్, స్టీల్ షాపుల యాజమాన్యం, ఎఐటియుసి నాయకుల మధ్య జరిగిన చర్చల్లో పరస్పర అంగీకారం మేరకు హమాలీ రేట్లు పెంచుకోవడం జరిగిందని పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. 2 సంవత్సరాలకు ఒక సారి జరిగే ఒప్పందంలో భాగంగా గతంలో ఉన్న రేట్లపై 16 శాతం అధనంగా పెంచుకోవడం జరిగిందన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, సంవత్సరానికి ఒక సారి రెండు జతల బట్టలు కార్మికులకు ఇవ్వాలని కోరడం జరిగిందని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం లేకపోవడం వలన లక్షలాది మంది కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం రూపొందించి హమాలీ కార్మికులకు భీమా సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిమెంట్ షాపుల యాజమాన్యం బుగ్గారపు గోవర్ధన్, శివ, కుంచకూరీ నగేష్, చరణ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి వెంకటయ్య, హమాలీ యూనియన్ అధ్యక్షులు సోమ్లా, చందు, గన, శివ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



## మండల సమగ్ర అభివృద్ధికి పోరాటం

### యాదాద్రి జిల్లా సిపిఐ కార్యదర్శి గోద శ్రీరాములు



ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండలం సిపిఐ పార్టీ కౌన్సిల్ సమావేశం వర్కింగ్ జర్నలిస్టు ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సల్వాద్రి రవీంద్ర అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు పాల్గొని మాట్లాడుతూ వలిగొండ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మూసి ప్రక్షాళన, పిలాయిపల్లి కాలువ ఇరిగేషన్ సంబంధించిన కాలువలు చెక్ డ్యాంలు రైతులకు ఉపయోగపడేటువంటి నీరును అందించాలని సాగునీరు కోసం ఈ మండలంలో ఉన్న వేలాది ఎకరాల భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా 4వ మహాసభలు వలిగొండలో జరపాలని నిర్ణయించారు. ఈ మహాసభకు ప్రతినిధులు, బహిరంగ సభ ఏర్పాటు ముమ్మరంగా సాగించాలని తక్కువ సమయంలో ఎక్కువ పని చేయాలని కార్యకర్తలను కోరారు. ఈ మహాసభ యాదాద్రి భువనగిరి జిల్లా అన్ని మండలాలలో ప్రజలు, నిరుపేదలు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చర్చించబడతాయని భవిష్యత్తులో యాదాద్రి జిల్లా అన్ని రంగాలలో కమ్యూనిస్టు పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణం చేస్తూ ప్రజల్ని చైతన్యం చేసి ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని ఉదృతమైన కార్యక్రమాలు తీసుకోవటానికి ఈ మహాసభలో చర్చలు జరుగుతాయి. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు బలమున్న ప్రాంతాలలో సిపిఐ పోటీ చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శిలు యానాల దామోదర్ రెడ్డి, బోలగోని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, కొల్లూరు రాజయ్య, ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, మండల కౌన్సిల్ సభ్యులు పోలెపాక యాదయ్య, బాలగోని సత్యనారాయణ, అంబటి అంజయ్య, పులిపలుపుల మల్లేశం, కట్ల యాదగిరి, కోయగుర రామ్మల్లు, సుద్దాల సాయికుమార్, యాస జనార్దన్ రెడ్డి, బత్తుల భిక్షపతి, సలగంజి కృష్ణ కుమార్, చొప్పరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల పోరుకు సిపిఐ సిద్ధం

### మంచిర్యాల జిల్లా సిపిఐ కార్యదర్శి లక్ష్మ ణ్



ప్రజాపక్షం / బెల్లంపల్లి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పోటీకి సిద్ధంగా ఉంటుంది అని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ అన్నారు. శనివారం బెల్లంపల్లి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ శ్రేణులు ఎన్ని కల పోరుకు ముమ్మరంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా మహాసభల్లో తీ ర్మానించిన విషయాలను వివరిస్తూ, పాలిటెక్నిక్ కాలేజీని అప్‌గ్రేడ్ చేసి విద్యార్థులకు అన్ని కోర్సులు అందుబాటులోకి తేవాలని, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని, బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కొత్త బొగ్గు గనులను ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టును పూర్తిచేసి జిల్లాకు తాగునీరు, సాగునీరు అందించాలని, కగార్ ఆపరేషన్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు ఇవ్వాలని, గోదావరి నీటిని బెల్లంపల్లి నియోజకవర్గానికి తీసుకురావాలని కోరారు. అసెంబ్లీ తీర్మానం ప్రకారం బిసి వర్గాలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని, సంబంధిత జిఓ తీసుకురావాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి ప్రతి రోజూ మంచినీరు అందించాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచి కూలీల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని అన్నారు. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా సమితి సభ్యులు మేకల రాజేశం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీ నారాయణ, గోమాస గంగారాం, సహదేవ్ రావు, బుడిమే వెంకటేష్, కందుల సుదర్శన్, మేకల తిరుపతి, కళాని భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## భూగర్భ డ్రైనేజీ పనులు పరిశీలన



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** హయత్ నగర్ డివిజన్‌లోని దుర్గానగర్ కాలనీల్లో జరుగతున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆదివారం స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ పూర్తి స్థాయిలో భూగర్భ డ్రైనేజీ పనులు చేపడుతున్నామని, నిధుల కొరత వచ్చినప్పటికి దశల వారిగా పనులు పూర్తి చేస్తున్నామన్నారు. కాలనీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేపడుతున్నామని, వీలైంత త్వరగా డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాలనీ వాసులు పనులపై పరివేక్షణ ఉండాలని కోరారు.

## అధ్యాపకుల ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆధ్యాపకుల కోసం ధరఖాస్తులను స్వీకరిస్తున్నామని, ఇష్టం ఉన్న అభ్యర్థులు ధరఖాస్తులు చేసుకోవాలని షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కమల తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు జూలై 23 2025లోగా ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కంప్యూటర్ సైన్స్, సెరికల్చర్, తెలుగు, జువాలజీ సబ్జెక్టుల్లో ఒక్కొక్క ఖాళీ ఉందని, ఇంగ్లీస్ సబ్జెక్టులో రెండు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థుల్లో సంబంధిత సబ్జెక్టుల్లో పిజిలో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఇతర అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పిజిలో కనీసం 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. పిహెచ్‌డి, నేట్, సెల్ట్, సెట్ అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వివరించారు. జూలై 23 తేది వరకు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ధరఖాస్తులు చేసుకోవాలని, జూలై 24వ తేదిన హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌఖిక పరీక్ష, ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందని, అసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బురదమయంగా మారిన రోడ్డు



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలోని ప్రధాన రహదారి బురద మయంగా మారింది. నుకు పడితే చిత్తడి చిత్తడిగా మారుతుంది. గ్రామంలోని ప్రధాన కూడలి రహదారి అధ్వాన్నంగా తయారైనా అధికారులు, పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.అధికారుల పర్యవేక్షణ లోపంతో రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహన దారులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.ప్రధాన రహదారిపై బస్సులు, ఆటోలు, టూ విలర్ వాహనాలు వెళ్ళడం గగనంగా మారింది.ప్రభుత్వం ఇంటి ట్యాక్స్‌లు, నల్లా బిల్లులు, కరెంటు బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నాం, పంచాయతీ కార్యదర్శి పట్టించుకుని రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో అందోళన చేస్తామని హెచ్చరించారు.

## జ్ఞాన సరస్వతి ఆలయానికి మొదటి నెల జీతం విరాళం..



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని జ్ఞాన సరస్వతి ఆలయ అభివృద్ధికి తన మొదటి నెల జీతం రూ.68వేలు విరాళంగా అందజేసినట్లు నజ్జిక్ సింగారం గ్రామానికి చెందిన చింతపల్లి, మంజుల రాంరెడ్డి కుమారుడు ప్రభాత్‌కిరణ్ తెలిపారు. ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డికి జీతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ బిటెక్ పూర్తి కాగానే ఉద్యోగం రావాలని అమ్మవారిని వేడుకున్నారు. అమ్మవారి అనుగ్రహంతో ఇన్ఫోసిస్‌లో స్టాఫ్టువేర్ ఉద్యోగం వచ్చిందని అన్నారు. దేవాలయ అభివృద్ధికి కుటుంబ సభ్యులతో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొదటి నెల జీతం అందజేసి మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు.పట్టుదల తో చదవి అమ్మవారి అనుగ్రహంతో ఉద్యోగం సాధించానని అన్నారు. ప్ర భాత్ కిరణ్ ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## ధర్మన్నగూడంలో సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని ధర్మన్నగూడ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం సిపిఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) పార్టీ మండల కమిటీ సభ్యులు పి. అంజయ్య మాట్లాడుతూ వర్షం కారణంగా ఇండ్ల మధ్యలో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సిసి రోడ్లు వేసి అదుకోవాలని అన్నారు. అవసరం ఉన్న చోట అండర్ డ్రైనేజి ఏర్పాటు చేయాలన్నారు. సిసి రోడ్లపై మట్టి పేరుకుపోయి ఈగలు దోమలు ముసిరి అతిసారా, డయోరియా వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. మట్టిని తీసి వేయాలని తెలిపారు.ఇండ్లపై నుండి ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లను తొలగించాలని అన్నారు.ధర్మన్నగూడ నుండి పెత్తుల్ల వరకు అగిపోయిన కిలో మీటరు వరకు బిటి రోడ్లు వేయాలని కోరారు.2 025 జనాభా ప్రకారం మంచినీటిని లక్ష లీటర్ల వరకు ఇవ్వాలన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాషయ్య,మండల నాయకులు బాల్‌రాజ్,మాజీ వైస్ ఎంపిపి శ్రీమన్నారాయణ,శాఖ కార్యదర్శి రమేశ్, నాయకులు రాములు, సత్యనారాయణ,ఎన్. సత్తయ్య,హన్మంత్,గోపాల కృష్ణ,రామరావు,నందీశ్వర్, ధన్‌రాజ్ తదితరులు పాల్గోన్నారు.

## మాజీ సర్పంచ్ హన్యానాయక్‌ను పరామర్శించి మాజీ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మాజీ సర్పంచ్ హన్యానాయక్‌ను షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ పరామర్శించారు. శనివారం సాయంత్రం పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో నివాసం ఉంటున్న మాజీ సర్పంచ్ హన్యానాయక్‌ను అంజయచ్య యదవ్ పరామర్శించి రోడ్డు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పుడు నిర్లక్ష్యం మహించరాదని, ఎప్పుకప్పుడు వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ మందులు వాడాలని సూచించారు. రోడ్డు పైకి అనుభవం లేని యువకులు ఇష్టారాజ్యంగా వాహనాలను తీసుకొని వస్తున్న నేపథ్యంలోనే ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ మందులు వాడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్, నేతలు గుండు అశోక్, వెంకటేష్ గుప్తా, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.



# తాగునీటి పంపిణీలో స్మార్ట్ టెక్నాలజీ

స్మార్ట్ వాల్వ్-మీటర్ టెక్నాలజీపై.. సమీక్ష నిర్వహించిన జలమండలి ఎండి. అశోక్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీటి పంపిణీ వ్యవస్థలో ఆధునీకరించడానికి, సరఫరా అయ్యే ప్రతీ చుక్క లెక్కించడానికి, స్మార్ట్ వాలవ్స్ మీటర్స్ టెక్నాలిజీ మీద జలమండలి ఎండి. అశోక్ రెడ్డి, ఇడి మయాంక్ మిట్టల్‌తో కలిసి ఐటీ, రెవెన్యూ అధికారులతో శనివారం జలమండలి ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జలమండలి తాగునీటి పంపిణీలో దాదాపు 15 వేల చిన్న, పెద్ద వాల్వ్ లు ఉంటాయి. అందులో 35 శాతం మాత్రమే వాల్వ్‌లు మాత్రమే తరుచూ ఆపరేట్ చేస్తూ ఉంటారు. అందులో ప్రయోగాత్మకంగా వెయ్యి వాల్వ్‌లను ఆటోమేషన్ చేయడానికి సాధ్యసాధ్యాలను అధ్యయనం చేయమని ఈ సందర్భంగా ఎండి అధికారులను ఆదేశించారు. దీంతో పాటు రిజర్వాయర్ అవుట్ లెట్ వద్ద, బల్క్ కనెక్షన్‌లు ఉన్న ప్రాంతాలలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి, సరఫరా అయ్యే ప్రతీ చుక్కను లెక్కలోనికి తీసుకురావడానికి అనువైన టెక్నాలజీని అన్వేషించాలని సూచించారు. ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసి ఏకీకృత వ్యవస్థ ద్వారా వాల్వ్‌ల ఆపరేషన్, నియంత్రణ, పర్యవేక్షణ చేసేలాగా వ్యవస్థను రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. స్మార్ట్ మీటర్ల పనితీరు, పంపిణీ చేసిన క్వాంటిటీ, క్వాలిటీతో పాటు బిల్లింగ్ వివరాలను సైతం ఈ వ్యవస్థకు అనుసంధానం అయ్యేలాగా సాంకేతికతకు రూపకల్పన చేయాలన్నారు.

**స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ.. :** నగరంలో నీటి సరఫరా భాగంగా వేలాది వాల్వ్‌లను నిర్వహించడం తప్పనిసరి. దాదాపు అధిక శాతం వాల్వులు రహదారులపై ఉండటం, నీటి సరఫరా చేయడానికి, ఆ సరఫరాను ఆపడానికి వాల్వును తిప్పడం తప్పదు. ఈ సందర్భంలో వాహనాల రాకపోకల వల్ల పలువురు లైన్ మెన్లు ప్రమాదానికి గురవుతూ ఉంటారు. కొన్ని సార్లు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి దుర్ఘటనలు నివారించడానికి స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీతో (ఆటోమేటిక్ వాల్వ్ ఆపరేషన్ పద్ధతి) ప్రయోగాత్మకంగా సనత్ నగర్‌లో ఏర్పాటు చేసి విజయం సాధించారు. ఈ స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీతో లైన్ మెన్లు క్షేత్ర స్థాయిలో తిరగాల్సిన అవసరం లేకుండానే, మొబైల్ యాప్‌తో వాల్వులను నిర్వహించే వెసులుబాటు ఉంటుంది. ఇంటర్ నెట్ ఆధారిత కమ్యూనికేషన్‌తో ఆపరేట్ చేయవచ్చు. దీని వల్ల వాల్వ్ ఆపరేషన్‌తో పాటు వాటర్ క్వాలిటీ, క్వాంటిటీ, క్లోరిన్ శాతం వివరాలు తెలుసుకోవచ్చు. ఈ స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ పూర్తిగా సోలార్ ఎనర్జీని ఉపయోగించుకుని పనిచేస్తుంది. బ్యాటరీ బ్యాకప్ సైతం ఉండటంతో నిర్వహణలో పవర్ సమస్యలు ఉండవు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానం ఇప్పటివరకు సనత్ నగర్‌లో సమర్థంగానే పనిచేస్తున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.



# డెంగీ ప్రబలకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ నగరంలో డెంగీ ప్రబలకుండా యుద్ధప్రాతిపదికన పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యక్రమంలో శనివారం ఆరోగ్య విభాగం అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మురికివాడలతో పాటు గృహాలు, అపార్ట్‌మెంట్‌లకు వైద్యాధికారులు స్వయంగా వెళ్ళి, ప్రజా భాగస్వామ్యంతో నీరు నిల్వ ఉండి, దోమల వృద్ధి చెందే ప్రదేశాలను యాంటి లార్వా ఆపరేషన్‌లు చేపట్టాలన్నారు. డెంగీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే వారం పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించి, దోమలను వృద్ధి జరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహంలో ప్రతి వారం క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. మూసీ, జలాశయాలలో దోమల వృద్ధి జరగకుండా చూసేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లు, యుపిహెచ్ దవాఖానాలను ప్రతిరోజు సందర్శించి, పరిస్థితిని సమీక్షించాలన్నారు. డెంగీ నిర్ధారణకు ఎలిసా పరీక్ష తప్పనిసరి అన్నారు. జ్వర పీడితులకు డెంగీ నిర్ధారణ పరీక్షలు విరివిగా నిర్వహించాలని సూచించారు. తప్పనిసరిగా ల్యాబ్‌లను సందర్శించాలని ఆదేశించారు. డెంగీ కేసులు నమోదైన కాలనీలను వైద్యులు తప్పనిసరిగా సందర్శించి, ఆ కాలనీ ప్రజల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేయాలన్నారు. ఎక్కువ కేసులు నమోదు అయిన పక్షంలో ఫీవర్ సర్వేను నిర్వహించాలని ఆదేశించారు. ఈసమావేశంలో చీఫ్ ఇంజనీర్ (నిర్వహణ) సహదేవ్ రత్నాకర్, అదనపు కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్, ఎస్. పంకజ, గీతా రాధిక, జోనల్ కమిషనర్‌లు అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహాదేవ్ రావు, ఎన్.రవి కిరణ్, వెంకన్న, ముఖ్య వైద్యాధికారి డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు కొత్త భవనాలు నిర్మించాలి

శేరిలింగంపల్లి ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు నితీష్, కార్యదర్శి ధర్మతేజ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** అఖిల భారత విద్యార్థి సమైక్య వామ పక్షల అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జూలై 23వ తేదిన జరిగే విద్య సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ప్రభుత్వ పాఠశాలల వద్ద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి ఎఐఎస్ఎఫ్ అధ్యక్షుడు నితీష్, కార్యదర్శి ధర్మతేజలు విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలను పరిష్కారించాలని పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని , ప్రభుత్వ పాఠశాలలో , కళాశాలలో మౌళిక వసతులు కల్పించాలని, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవానాలను నూతనంగా నిర్మాణం చేపట్టాలని, సొంత హస్టల్ భవానాలను నిర్మించాలని, విద్యా హక్కు చట్టాన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలలో అమలు పరచాలని, 25 శాతం ఫ్రీ ఎడ్యుకేషన్ ఇవ్వాలని, పూర్తి స్థాయిలో ఎంఇఒ, డిఇఒ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్ర వ్యాప్త బంద్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రతి ఓక్కరు తమ మద్దతు అందించి జులై 23వ తేదిన చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్‌చౌహాన్ డిమాండ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్‌చౌహాన్ డిమాండ్ చేశారు. శనివారం షాద్‌నగర్‌లో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ చౌహాన్ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, వాటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురి చేస్తుంటే పట్టించుకునే వారు లేకుండా పోయారని, దాంతో విద్యకు దూరమయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయని వివరించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిఫ్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలతోపాటు విద్యాసంస్థల్లో మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచిత ఆర్‌టిసి ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. గాడి తప్పుతున్న ప్రభుత్వ విద్యారంగ సమస్యలను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల శ్రీకాంత్, రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్, పట్టణ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు సుమేర్, కార్యదర్శి శివశంకర్, కార్తీక్, ప్రకాష్‌లు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో ఆడ శిశువు అక్రమ దత్తత

వ్యవహారం బయటపడటంతో ఆడపిల్లను పెంచలేమని ఐసిడిఎస్‌కు అప్పగించిన తల్లిదండ్రులు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో ఆడ శిశువు అక్ర మ దత్తత కలకలం రేపింది. పుట్టిన వెంటనే శిశువును పిల్లలు లేని దంపతులకు అక్రమంగా దత్తత ఇవ్వగా అనుమానం వచ్చిన ఐసిడిఎస్ అధికారులు విచారణ నిర్వహించి శిశువు దత్తత వ్యవహా రం గుట్టును తేట తెల్లం చేశారు. ఇట్టి సంఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల సమీపంలో చోటు చేసుకుంది. అందుకు సం బంధించి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మహిళ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శిశు వు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు స్థానిక అంగన్వాడీ టీచర్ అనురాధ వెళ్లగా శిశువు కనిపించలేదు. శిశువు ఎక్కడ అని తల్లిని ప్రశ్నించగా పాప ఉమ్మ నీరు తాగి చనిపోయిందని చెప్పింది. ఇదే విషయాన్ని అంగన్వాడీ టీచర్, సిడిపిఒ శాం తిశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. వాస్తవాలను కనుక్కోమని సిడిపిఒ చెప్పడంతో అంగన్వాడీ టీచర్ శిశు వు ఆచూకీపై ఆరా తీశారు. అనుమానంతో తల్లిని ప్రశ్నించగా ఆమె అసలు విషయం చెప్పింది. శిశువు చనిపోలేదని, వేరొకరికి దత్తత ఇచ్చినట్లు చెప్పడంతో ఆమె చెప్పిన వివరాల ఆధారంగా శిశువును తిరిగి తల్లి చెంతకు చేర్చారు. ఆర్థిక స్థో మత లేని కారణంగా శిశువును పెంచుకునేందు కు తల్లి దండ్రులు ఇష్టపడలేదు. దీంతో బాలల రక్షణ అధికారి ప్రవీణ్ కౌన్సిలింగ్ ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పాపను పెంచలేమని తేల్చిచెప్పడంతో అధికారులు ఐదు రోజుల శిశువును శిశువిహార్‌కు తరలించారు.అక్రమ దత్త త వ్యవహారాన్ని గుట్టు రట్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన అంగన్వాడీ టీచర్ అనురాధకు ఐసిడిఎస్ ప్రాంతీయ ఉప సంచాలకులు ఎన్. మోతీ అభినందించారు. అదేవిధంగా విధంగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. వివిధ కారణాల తో పిల్లలు పుట్టని దంపతులు వెబ్‌సైట్‌లో cara. wcd.gov.in ఆన్ లైన్ దరఖాస్తు చేసుకుని న్యాయపరంగా దత్తత తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.

## బోనాల పండుగకు ముస్తాబైన మన్సూరాబాద్ పోచమ్మ దేవాలయం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బోనాల పండుగ ఉత్సవాలకు మన్సూరాబాద్ డివిజన్‌లోని శ్రీ పోచమ్మ దేవాలయం ముస్తాబైనట్లు జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు. ఆదివారం పోచమ్మ దేవాలయం నిర్వహణపై పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సంస్కృతి సంప్రదాయలకు బోనాల ఉత్సవాలు ఆదర్శంగా నిలుస్తాయని ఆయన తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. డివిజన్‌లో జరిగే బోనాల ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొప్పుల ఉపేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## చదువుతో పాటు లలిత కళలకు ప్రాధాన్యతివ్వాలి

కూచిపూడి నాట్య గురువు శ్రీనివాస వరప్రసాద్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** చదువుతో పాటు లలితకళలకు ప్రాధానత్య ఇ వ్వాలని కూచిపూడీ నట్య గురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ తెలిపారు. మాదాపూర్‌లోని అన్నమయ్య పురంలో శనివారం అన్నమయ్య పద కోకిల పద్మశ్రీ ఆవార్డు గహీత కూచీపూడీ నట్య గురువు శ్రీనివాస వరప్రసాద్‌ను డాక్టర్ శోభ రాజు దంపతులు ఘనంగా సత్కరించారు. అనంతరం శోభరాజు మాట్లాడుతూ దేశ, విదేశాలలో ఉన్న వారికి అన్లైన్ ద్వార కూచీపూడీ తరుగతులు నేర్పించడం సంతోషించాదగ్గ విషయమని, భావితరాలకు లలిత కళల గొప్పతనాన్ని తెలుపుతూ విద్యార్థులను ఆర్థికంగా, సామాజికంగా ఎదిగే వి ధంగా తీర్చిదిద్దాలని కోరారు. తదుపరి కూచీపూడీ నట్య గురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా కూచీపూడీ నృత్యం లో విద్యార్థులకు శిక్షణ అందిస్తువస్తున్నామని, ఇప్పటీ వరకు 300 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ అందించి నృత్య కళాకారులుగా తీర్చిదిద్ధమని, అందులో 20 మందికి పైగా నట్య గురువులుగా మారి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తన శిష్య బృందంలో తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైలం, శ్రీకాళహస్తి తదితర ప్రముఖ దేవస్థానాలలో , ప్రముఖ యూనివర్సిటీలలో, ప్రముఖ ప్రాంతాలలో స్టేజీ షోలు అందించారని తెలిపారు. రవీంద్రభారతీలో నృత్యంచిన గోధాకళ్యాణం (కూచీపూడీ యక్షగానం) నృత్య ప్రదర్శన ఏంతో మంది ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్యపురం సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.


## కెటిఆర్‌పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు



**ప్రజాపక్షం/షాబాద్ :** బిఆర్‌ఎస్ పార్టీ మాజీ మంత్రి కెటిఆర్‌పై కేసు నమోదు చేయాలని శనివారం షాబాద్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో కలిసి పోలీస్ స్టేషన్‌లో సిఐ కాంతా రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసుదన్ రెడ్డి మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో జరిగిన బిఆర్‌ఎస్ పార్టీ సమావేశంలో మంత్రి కెటిఆర్ రాష్ట ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిపై అసభ్య పథజాలలను, అనుచిత వాఖ్యలు చేసిన కెటిఆర్‌పై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గత పది సంవత్సరాల కాలంలో అభివృద్ధి పేరుతో అప్పులు చేసి తెలంగాణ రాష్ట్రాని అప్పుల పాలు చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రేస్ ప్రభుత్వం తెలంగాణ రాష్టం ఏర్పాటు చేసినప్పుడు తెలంగాణను ధనిక రాష్టంగా ప్రకటించింది. 10 సంవత్సరాల కాలంలో బిఆర్‌ఎస్ చేసిన అప్పులను కాంగ్రేస్ ప్రభుత్వమే తీరుస్తు తెలంగాణను అభివృద్ధి చేస్తుందని వివరించారు. తెలంగాణ ప్రజలను మోసం చేసి దోచుకున్న ధనంను తిరిగి తెలంగాణ ప్రజలకు అందించేందుకు రాష్ట ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైజ్ చైర్మెన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపిటిలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్లు నర్సింలు, సజీవ రెడ్డి, సీనియర్ నాయకులు సుబాన్ రెడ్డి, దండు రాహుల్ గుప్త, ప్రశాంత్, గౌరీశ్వర్ ముదిరాజ్, ప్రతాప్ రెడ్డి, బొకుల లింగం, జనార్ధన్ రెడ్డి, జంగయ్య. మాధవ రెడ్డి పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## 'స్థానిక'ఎన్నికల్లో బిసిల సత్తా చూపించాలి

తెలంగాణ బిసి మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల సత్తా చూపించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ బిసి మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ అన్నారు. శనివారం షాద్‌నగర్‌లో నిర్వహించిన తెలంగాణ బిసి మహాసభ విస్తృత నిర్మాణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టుకాడి శ్రీనివాస్ మాట్లాడుతూ బిసిలు ఆర్థికంగా, రాజకీయంగా రాణిస్తేనే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని పేర్కొన్నారు. బిసిలలోని సబ్బండ కులాలు ఏకమై అందరూ కలిసి కట్టుగా ఉన్నప్పుడే బిసిలకు రాజ్యాధికారం దక్కుతుందని అన్నారు. గత పాలకులు బిసిలను ఓటు బ్యాంకుగానే చూశాయే తప్పా వారికి ఎలాంటి రాజకీయ భవిష్యత్ కల్పించలేదని పేర్కొన్నారు. బిసిల్లో ఐక్యత లేకపోవడంతోనే ఇలాంటి సమస్యలను తలెత్తున్నాయని, వాటిని దూరం చేసేందుకు ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని బిసిలు సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా బిసి మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా గుండు ఆంజనేయులు, బిసి మహాసభ కార్మిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దేవేందర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బిసి మహాసభ రాష్ట్ర కార్యర్శి మానవపాటి ప్రదీప్ కుమార్, రంగారెడ్డి జిల్లా యువత విభాగం అధ్యక్షుడు ఏవీఎం శ్రీధర్ వర్మ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందమూరి బ్రహ్మయ్య, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు కె.కృష్ణాజీ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా భరత్, మెట్టుకాడి ప్రభాకర్, హరిప్రకాష్ గౌడ్, మంజుల, పుష్పలు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించాలి : అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా విషయంలో రాజీ పడ వద్దని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనలో భాగంగా శనివారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 27, 28 డివిజన్లలో ఆమె పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్లు, మురికి వాడల గుర్తింపు విషయాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళా శక్తి స్టాళ్లను సందర్శించి ఉచిత వైద్య శిబిర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.




## 'విద్యా సంస్థల బంద్' గోడ పత్రిక విడుదల

### ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్

**ప్రజాపక్షం/కాప్రా :** ప్రభుత్వ విద్యా సంస్థల సమస్యలను మెరుగుపరుస్తూ సమస్యలను పరిష్కరించటంతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలన్న డిమాండ్‌తో వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు ఈ నెల 23 న జరుగనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలంటూ ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ కోరారు. శనివారం ఇసిఐఎల్‌లోని అంబేద్కర్ కూడలిలో బంద్‌కు సంబంధించిన గోడ పత్రికలను ఆయన విడుదల చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయివేట్ విద్యా సంస్థలో ఇష్టారాజ్యంగా కొనసాగుతున్న ఫీజులను నియంత్రించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తూ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిలు,కుమార్, రవళి, ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ భూమిలో రోడ్డు' వార్తా కథనాలతో కదిలిన యంత్రాంగం

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోని బోరంపేట ప్రభుత్వ భూమిలో రోడ్డు వేయడంతో పెద్ద ఎత్తున వరుసగా వార్త కథనాలు సోషల్ మీడియాలో వెలువడంతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశానుసారంగా ఆర్డీఓ శ్యాంప్రకాష్ ప్రభుత్వ భూమిలో రోడ్డును శనివారం పరిశీలించారు. బడా నిర్మాణ సంస్థకు అధికారులు పరోక్ష సహకారం అందిస్తుండగా అధికార పార్టీ నాయకుని అండతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. బౌరంపేట సర్వే నంబర్ 166/1,సర్వే నంబర్ 166/3, ప్రభుత్వ భూమిలో జేఎన్ఎస్ మరియు రుద్రా నిర్మాణ సంస్థల కోసం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు



ప్రభుత్వ భూమిని తాకట్టుపెట్టారు గ్రామ నక్షలో ఉన్న బండ్ల బాటను 40 ఫీట్ రోడ్డు వేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ ప్రభుత్వ భూమిలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులపై శనివారం దర్యాప్తు ప్రారంభించారు. మీడియాకు సమాచారం లేకుండా దర్యాప్తు చేయడంలోని ఆంతర్యం ఏమిటో అధికారులకే తెలియాలి చూడాలి మరి ఇకనైనా అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణాన్ని ఆపుతారా లేదా నిర్మాణదారులకు సహకరిస్తారా వేచి చూడాలి.




## ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శ్రేయస్సుతోపాటు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని అడిషనల్ డిసిపి వెంకటరమణ అన్నారు. శనివారం ఎఎస్ రావు నగర్ జై జవాన్ కాలనీ శ్రీ విజయ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ శ్రీ విద్యారణ్య సదనంలో ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులు జ్యోతిర్మయాచారి, ప్రధాన కార్యదర్శి విష్ణు సాయి ప్రసాద్, కోశాధికారి మేకల యాదగిరిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యం కృష్ణారెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మండా సురేష్, విజయ్‌కుమార్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



## సెరినిటీ పాఠశాలలో బోనాల సంబరాలు

**ప్రజాపక్షం/నాగారం:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు భావితరాలకు అందివ్వడం మన బాధ్యతని సెరినిటీ పాఠశాల ముఖ్య కార్యదర్శి నోముల వసంత అన్నారు. నాగారం మున్సిపాలిటీలోని దేవాలయంలో నిర్వహించనున్న బోనాల పండుగను పురస్కరించుకుని సెరినిటీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు బోనాల పండుగను అత్యంత ఆనందోత్సాలతో జరుపుకున్నారు. పోతరాజులు,అమ్మవార్ల వేషధారణలో చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** వర్షాకాలం సీజన్‌లో అంటువ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని జవహర్‌నగర్ పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీదేవి సూచించారు. తమ ఇళ్లలో వర్షపు నీరు నిలబడకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొంటూ దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దగ్గు, జలుబు, జ్వరం వస్తే అలసత్వం వహించకుండా సమీపంలోని బస్తీ దవాఖానాలు కానీ పిహెచ్ సెంటర్లకు కానీ వెళ్లి వైద్యం తీసుకోవాలన్నారు.



# ఆర్‌టిసి కార్గో సర్వీసు పోర్టర్స్‌కు బస్తాకు రూ.15 ఇవ్వాలి

### ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ్మ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఆర్‌టిసి కార్గో సర్వీసు పోర్టర్స్‌కు బస్తా రూ.15 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.7.50 లు మాత్రమే చెల్లించటం తీవ్ర అన్యాయం అని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ అన్నారు. శనివారం ఎంజిబిఎస్‌లోని టిఎస్ఆర్‌టిసి లైసెన్స్‌డ్ పోర్టర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం యూనియన్ ఉపాధ్యక్షులు జి.దాసు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎం నరసింహ మాట్లాడుతూ గతంలో ఆర్‌టిసి కార్మికుల హమాలీ చార్జీలు బస్తాకు రూ.10లు ఉండగా, 2023 లో దాన్ని అప్పటి టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికులపై కక్ష సాధించే నెపంతో తగ్గిందని, దీంతో అనేక పోరాటాలు నిర్వహించగా రూ.7.50లకు పెంచి రేట్లు పెంచామని చెప్పటం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. 2023 కు ముందే నుంచే రూ.10లు ఉన్న రేటును ప్రస్తుత ధరల ప్రకారం ఇప్పుడు రూ.15లు గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి మాలీ కార్మికుల రేట్లు పెంచాలని అనేక పర్యాయాలు ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు అందజేసినఆర్‌టిసి యాజమాన్యం కార్గో సర్వీస్ అధికారులు మొద్దు నిద్రను ప్రదర్శిస్తున్నారని వారు అన్నారు. ప్రభుత్వం ఆర్‌టిసి యాజమాన్యం తక్షణమే స్పందించి రేట్లను సవరించాలని, లేకపోతే రాష్ట్రంలోని అన్ని కార్గో సర్వీసులను నిలిపివేసి ధర్నాలు, ఆందోళనలు నిర్వహించాల్సి వస్తున్నదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎండి కాసిం, యూనియన్ నాయకులు మారుతి, కొండయ్య, బాలరాజ్, గోపాల్, జంగయ్య, నాగేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ స్టేడియం వద్ద ఉద్రిక్తత



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** హెచ్‌సిఎ అక్రమాల కేసు నేపథ్యంలో ఉప్పల్ స్టేడియంలో శనివారం జరుగుతున్న హెచ్‌సిఎ సమావేశాన్ని తెలంగాణా క్రికెట్ యాక్షన్ కమిటీ అడ్డుకొనే యత్నాలకు పాల్పడటంతో స్టేడియం వద్ద ఉద్రిక్తతలు చోటు చేసుకొన్నాయి. ఈ సమాచారం అందుకొని అక్కడికి చేరుకొని కమిటీ సభ్యులను అడ్డుకొన్న పోలీసులతో తీవ్ర వాగ్వివాదాలు జరిగి స్వల్ప ఘర్షణ వాతావరణం నెలకొనడంతో వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లకు కలిపి 209, మిగిలిన జిల్లాలకు గాను 8 క్రికెట్ క్లబ్‌లు ఉన్నాయని, కొత్తగా 300 క్రికెట్ క్లబ్‌ల ఏర్పాటుకు హెచ్‌సిఐ అనుమతించాలంటూ క్రికెట్ స్టేడియం వద్ద ఆందోళనకు దిగారు.

**పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలి: విహెచ్ హన్మంతరావు**

ఇదే సమయంలో క్రికెట్ క్లబ్‌ల సమావేశాని కి వచ్చిన మాజీ ఎంపి విహెచ్ హన్మంతరావు, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డిలు మాట్లాడుతూ ఉప్పల్ స్టేడియం పార్కింగ్ కోసం ఇప్పటి వరకు వినియోగించుకొంటున్న ఓ ప్రయివేట్ సంస్థ వేలంలో కొనుగోలు చేసిందని, ఈ స్థలాన్ని స్టేడియం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ స్టేడియంలో మ్యాచ్‌లు జరిగే సందర్భాల్లో వాహనాల పార్కింగ్‌కోసం ఈ స్థలం అనుకూలంగా ఉంటుందని, మ్యాచ్‌లు లేని సమయాల్లో ఇతర క్రీడా శిక్షణకు వినియోగించుకోవచ్చని, రోడ్ల పక్కనే పార్కింగ్‌చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

## పారిశుధ్య సిబ్బందికి పిపిఇ కిట్ల పంపిణీ



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి (పార్ట్), వివేకానంద నగర్, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ డివిజన్ల పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి వివేకానంద నగర్‌లోని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కార్యాలయంలో కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ లతో కలిసి పిపిఈ కిట్లను పారిశుధ్య సిబ్బందికి అందచేసిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ, ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ, పారిశుధ్య సిబ్బంది తల్లి దండ్రులతో సమానం అని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వారి సేవలు మన పరిసర ప్రాంతాలను, కాలనీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతు కాలనీలలో ప్రశాంత వాతావరణం కల్పించుట కోసం పని చేస్తున్నారు అని, ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రంగా చేస్తూ నిత్య శ్రామికులుగా పనిచేస్తున్నారు అని, పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా పనిచేస్తారు అని వారి సేవలను కొనియాడారు. పారిశుధ్య కార్మికుల జీతా లు పెంచడమే కాకుండా వారి ఆరోగ్యం కూడా మన బాధ్యత అని పారిశుధ్య కార్మికులను, ఎంటమాలజీ, పారిశుధ్య సిబ్బందిని కాపాడుకోవాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి వర్యులు రేవంత్‌రెడ్డి సహృదయంతో ఆరోగ్య పరిరక్షణకు పిపిఈ కిట్లను పారిశుధ్య సిబ్బందికి అందచేయడం జరిగినది అని, పారిశుధ్య సిబ్బంది ఆరోగ్య భద్రతే మన భద్రత అని పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ పిపిఈ కిట్ల బ్యాగ్‌లలో రెయిన్ కోర్ట్, టోపి మాస్క్‌లు, శానిటైజర్లు, కొబ్బరి నూనె, సబ్బులు, షూస్, హాండ్ గ్లౌస్ లు వంటి 11 రకాల వస్తువులు ఉంటాయి అని, వీటిని సద్వినియోగ పర్చుకొని విధి నిర్వహణలో ఆరోగ్యంగా ఉండాలని, పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు. విధుల్లో ఉన్నప్పుడు జీహెచ్‌ఎంసి పారిశుధ్య సిబ్బంది తప్పనిసరిగా రక్షణ కిట్లు ధరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అని సూచించారు.కిట్లను అందుకున్న కార్మికులు కూడా హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, పిఏసి చైర్మన్ గాంధీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య సూపర్ వైజర్ మనోహర్ రెడ్డి, నాయకులు సంజీవ రెడ్డి, నాయినేనీ చంద్రకాంత్ రావు ,దొడ్ల రామకృష్ణ గౌడ్, చంద్ర మోహన్ సాగర్, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ.15 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** అక్రమంగా తరలిస్తున్న 42 కిలోల ఎండు గంజాయితో పాటు 3 సెల్‌ఫోన్లను శామీర్‌పేట, మేడ్చల్ ఎస్‌వోటి పోలీసులు సంయుక్తంగా వలపన్ని పట్టుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. శనివారం శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లాలే ప్రవీన్(31), సతీష్ కధంలు (32), అవినాష్ ఆలియాస్ వికాస్ జాదవ్(22), సతీష్ కదం కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ బసవ కల్యాన్‌కు ప్రాంతానికి చెందినవారు. వీరంత హైద్రాబాద్ నుంచి గంజాయి అక్రమంగా తరలించేవారు. విలాసవంతమైన జీవితాన్ని గడపడానికి సులభంగా డబ్బులు సంపాదించేలనే ఆలోచనతో గంజాయి వ్యాపారాన్ని చేస్తున్నారు. ఓడిశా రాష్ట్రానికి చెందిన గంజాయి సరఫరా దారులతో నేరుగా సంప్రదించి గంజాయిని అనేక పర్యాయాలు హైద్రాబాద్‌కు రవాణ చేస్తుండేవారు. ఓడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా, పాడియా గ్రామానికి వెళ్లి అక్కడ జితు ఆలియాస్ హ్యాపి అనే వ్యాపారి నుంచి 42 కిలోలు ఎండు గంజాయిని కొనుగోలు చేశారు.

సంగారెడ్డి జిల్లా, నాగిలిగిద్ద మండలం మావినెల్లి గ్రామానికి చెందిన రాథోడ్ హిరామాన్‌కు విక్రయించుటకు పథకం వేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు శామీర్‌పేట, మేడ్చల్ ఎస్‌వొటి పోలీసులు శామీర్‌పేటలోని రోటరి2 సమీపంలో బెల్లాలె ప్రవీన్, అవినాష్ ఆలియాస్ వికాస్‌జాదవ్, సతీష్‌కదంల నుంచి 42 కిలోల ఎండు గంజాయి,3 సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేశామని కేసు నమోదు చేశామని సిఐ శ్రీనాధ్ తెలిపారు. జిత్తు ఆలియాస్ హ్యాపి, హీరామాన్‌లు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

## విద్యార్థుల సమస్యల పట్ల నిర్లక్షం వహిస్తే చర్యలు

### కలెక్టర్ ప్రతీక్‌జైన్




**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ జిల్లాలో ఉన్న వసతి గృహాల్లో అధికారుల సందర్శన, గురుకుల పాఠశాల సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు పురోగతి, వన మహోత్సవం, నర్సరీల నిర్వహణ, సన్న బియ్యం అందుబాటు తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమీక్షించారు. ఈ సందర్భంగా అదికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి వసతి గృహాలను సందర్శించి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నారు. గురుకుల పాఠశాలల నిర్వహణ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు ఎలాంటి అసౌకర్యాలకు గురైనా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని బట్టి చెల్లించాల్సిన డబ్బును లబ్ధిదారులకు అందజేయాలని తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా వాఖలవాటిగా ఇచ్చిన లక్ష్యాలకు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా పెద్ద మొత్తంలో ఈత మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నర్సరీ నిర్వహణలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమీ క్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఎ.సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

## తడిపొడి చెత్తను వేరు చేయాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** తడి పొడి చెత్తను ఇంటి వద్దనే వేరుచేసి చెత్త బండిలో వేయాలని అలియాబాద్ మున్సిపల్ అధికారులు వేణుగోపాల్ అన్నారు. శనివారం అలియాబాద్ మున్సిపాలిటి కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 100 రోజుల ప్రణాళికలో బాగంగా అలియాబాద్‌లోని ఎస్‌సి కాలనీలో తడిపొడి చెత్త వేరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్లాస్టిక్‌ను నిషేదించాలని ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర మహాసభలకు విరాళాలు అందించాలి

### మహాసభల గౌరవ అధ్యక్షుడు డిజి సాయిలుగౌడ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో మహారాజ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ 4వ రాష్ట్ర మహాసభలకు విరాళాలు అందించి సహకరించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహాసభల గౌరవాధ్యక్షుడు డిజి సాయిలుగౌడ్ కోరారు. శనివారం మూడుచింతలపల్లి, శామీర్‌పేట, మేడ్చల్ మున్సిపాలిటీల్లో మహాసభల నిర్వహణకు విరాళాల సేకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల ఆగష్టులో 19 నుంచి 22 వరకు నిర్వహించనున్న సిపిఐ 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలకు ప్రైవేట్ విద్యా సంస్థలు, వివిధ కంపెనీలు, పార్టీ అభిమానులు దాతృత్వంతో విరాళాలు అందించాల్సిందిగా కోరుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు నిమ్మల నర్సింహా, కార్యదర్శి జంగయ్య, శామీర్‌పేట మండల కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి మురలీధర్‌రాజు, కౌన్సిల్ సభ్యులు రమేష్, కార్యకర్తలు మధు, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సిసి కెమెరాల ఏర్పాటు

### బాలానగర్ సిఐ నర్సింహరాజు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రత్యేక పాత్ర పోషిస్తాయని, నేరస్తులను గుర్తించటంలో సిసిటీవీలు కీలకమని వాటిని అందరూ తమ సముదాయాలలో ఏర్పాటు చేసుకోవాలని బాలానగర్ సీఐ నర్సింహా రాజు సూచించారు. శనివారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గిరినగర్ లోని శ్రీ సాయి విద్యానికేతన్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన 27 సీసీ కెమెరాలతోపాటు కమాండ్ కంట్రోల్ రూమ్‌ని స్కూల్ ఆవరణ లో సిబ్బందితో కలిసి సిఐ నర్సిం హరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ రాజు మాట్లాడు తూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని, లా అండ్ ఆర్డర్ నిర్వహణలో సీసీ కెమెరాలు కీలకమని సిఐ నర్సింహా రాజు పేర్కొన్నారు. సీసీ కెమెరాల ద్వారా చాలావరకు నేరాలు తగ్గుతున్నాయన్నారు. దొంగతనాలు పాల్పడేవాళ్లు కూడా భయపడుతారన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు నిందితుల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలకంగా ఉంటున్నాయన్నారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చిన శ్రీ సాయి విద్యానికేతన్ హై స్కూల్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండంట్ శ్రీకాంత్, టీచర్లు, పోలీస్ సిబ్బంది ఇఫ్తాకార్, శ్రీనివాస్ రెడ్డి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపాలిటి పొన్నాల్‌లో సమస్యలు తిష్టవేశాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్ ఎంఎల్ఏ చామకూర మల్లారెడ్డికి శనివారం గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శామీర్‌పేట మండల బిజెపి జనరల్ సెక్రటరి రాయి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజి, సిసి రోడ్లు, వీధి దీపాలు లేవని దీంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పొన్నాల్ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ రాహుల్, మురళీగౌడ్, చరణ్ లు పాల్గొన్నారు.

## స్ఫూర్తి ఆర్గనైజేషన్ చేస్తున్న కృషి అభినందనీయం

### సిఐ పరుశురాం




**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** శాస్త్రీయ ఆలోచనతో సామాజిక మార్పుకోసం స్ఫూర్తి ఆర్గనైజేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఘట్‌కేసర్ సిఐ పి పరుశురాం అన్నారు. శనివారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్ గ్రామంలోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో స్ఫూర్తి ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కుంటోళ్ళ యాదయ్య ఆధ్వర్యంలో సామాజిక మార్పు కోసం పది అంశాలపై రూపొందించిన పోస్టర్‌ను సిఐ పరుశురాంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరుశురాం మాట్లాడుతూ నేటి పౌరులు సామాజిక బాధ్యత మరిచి స్వార్థంతో జీవిస్తున్నారని, వారి బాధ్యత ఏమిటనేది మర్చిపోతున్నారని పేర్కొన్నారు. స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సమాజ శ్రేయస్సు కోసం చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఇన్స్పెక్టర్ పరుశురాం సూచించారు. స్ఫూర్తి వ్యవస్థాపక అధ్యక్షులు కుంటోళ్ళ యాదయ్య మాట్లాడుతూ కుల మత వర్గ రాజకీయాలకు అతీతంగా శాస్త్రీయ ఆలోచనతో సామాజిక మార్పుకోసం మనం నినాదంతో మన ఊరి బడులను మనం బాగు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జానకిరాం, డాక్టర్ హరిప్రసాద్, రూపా, మేకల సురేష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో మహిళపై దాడి

### దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు

**ప్రజాపక్షం/దుండిగల్ :** మహిళపై ఓ సైకో అందరూ చూస్తుండగా జుట్టు పట్టుకొని ఈడ్చుకెళుతూ దాడి నిర్వహించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం రాత్రి గాగిల్లపూర్‌లో సంఘటన జరగగా శనివారం సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయ్యింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళ రక్షణకోసం దిశా చట్టాన్ని తీసుకువచ్చి మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుండగా అక్కడక్కడా జరుగుతున్న సంఘటనలు పోలీస్‌లకు మచ్చతెస్తున్నాయి. గాగిల్లపూర్‌లో జరిగిన సంఘటనలో నిందితుడు మద్యం మత్తులో ఉండడం, మహిళ రోదిస్తున్నా జుట్టు పట్టుకొని ఈడ్చుకు వెళుతున్న సంఘటన అందరిని కలిచివేసింది. స్థానికులు వారించినా వదలకపోగా అడ్డు చెప్పిన వారిపై దాడికి దిగడంతో స్థానికులు దేహశుద్ధి చేసి పోలీస్‌లకు అప్పగించినట్లు సమాచారం. పోలీస్‌లు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గాగిల్లపూర్‌కు చెందిన కోటి కుమారుడు చైతన్య మద్యానికి బానిస, ఇతను గతంలో మేడ్చెల్ పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళను వేధించిన కేసులో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించిన ఖైదీ, జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు నమోదయ్యింది. గురువారం రాత్రి మద్యం సేవించి ఓ మహిళ ఇంటిముందు గొడవకు దిగడంతో మహిళ 100 నంబర్‌కు డయల్ చేసినట్లు సమాచారం. విచక్షణ కోల్పోయిన నిందితుడు అందరూ చూస్తుండగా భర్త ముందు జుట్టు పట్టుకుని స్థానికంగా ఉండే వైన్ షాప్ దగ్గరకు ఈడ్చుకు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. భర్త ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితున్ని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నట్లు సిఐ పి సతీష్ తెలిపారు.

# రీల్



## ఇది సాధారణ చిత్రం కాదు

### చిట్ చాట్‌లో వీరమల్లు నిర్మాత ఎ.ఎం. రత్నం

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన చిత్రం 'హరి హర వీర మల్లు'. 21న హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికలో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించబోతున్నారు. 24న సినిమా విడుదల అవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత ఎ.ఎం.రత్నంమీడియాతో చిట్ చాట్ చేశారు.

*** హరి హర వీరమల్లు సినిమా ఎలా ఉండబోతుంది?**

17వ శతాబ్దం నేపథ్యంలో జరిగే కథ ఇది. బయట ప్రచారం జరుగుతున్నట్టుగా ఇది నిజ జీవిత కథ కాదు. ఓ కల్పిత పాత్రను తీసుకొని, దాని చుట్టూ కథ అల్లుకోవడం జరిగింది. హరి హర వీర మల్లు పేరు పెట్టడానికి కారణం ఏంటంటే హరి హర అంటే విష్ణువు, శివుడు కలయిక. అలాగే వీరుడిని సూచించేలా వీరమల్లు అని పెట్టాము.

*** ఈ సినిమాతో మీ ప్రయాణం గురించి ఏం చెప్తారు ?**

నేను 'భారతీయుడు' సహా ఎన్నో భారీ చిత్రాలను నిర్మించాను. అయితే నా సినీ జీవితంలో ఇంత సుదీర్ఘ ప్రయాణం చేసిన సినిమా ఇదే. దానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. అయితే ఇది పవన్ కళ్యాణ్ డేట్స్ ఇచ్చినంత మాత్రాన వెంటనే పూర్తి చేయగలిగే సాధారణ చిత్రం కాదు. అత్యంత భారీ చిత్రం. సెట్స్, గ్రాఫిక్స్‌తో ముడిపడిన చారిత్రక కథ. అందుకే ఆలస్యమైంది. బాగా ఆలస్యమవవడంతో సినిమా ఎలా ఉంటుందోననే అనుమానాలు కొందరు వ్యక్తం చేశారు. అయితే ట్రైలర్‌తో అందరి అనుమానాలు పటాపంచలు అయ్యాయి. నేను నిర్మించిన సినిమాల్లో 90 శాతానికి పైగా విజయం సాధించాయి. ఆ అనుభవంతో చెప్తున్నాను.. హరి హర వీరమల్లు ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది.

*** సినిమాని రెండు భాగాలుగా తెరకెక్కించాలని ముందే అనుకున్నారా?**

మొదట రెండు భాగాలని అనుకోలేదు. సినిమా అనేది వినోదంతో పాటు, సందేశాన్ని అందించాలనేది నా భావన. నేను రూపొందించిన ఎక్కువ శాతం సినిమాలు అలాగే ఉంటాయి. వీరమల్లు అనేది చారిత్రక నేపథ్యమున్న కథ. ఇలాంటి గొప్ప కథలో సందేశం ఉంటే.. ఎక్కువమందికి చేరువ అవుతుందని భావించాము. అలా చర్చల్లో కథ స్పాన్ పెరిగింది. జూలై 24 తెల్లవారుజాము నుంచి షోలు వేయాలని మేము భావించాము. కానీ అభిమానులు ముందు రోజు రాత్రి నుంచే షోలు వేయాలని కోరుతున్నారు. వారి కోరిక మేరకు జూలై 23 రాత్రి నుంచి షోలు వేసే ఆలోచనలో ఉన్నాము.

*** పవన్ కళ్యాణ్‌తో మీ అనుబంధం గురించి?**

ఖుషి, బంగారం తర్వాత పవన్ కళ్యాణ్‌తో చేసిన మూడో చిత్రమిది. పేరుకు మూడు సినిమాలే కానీ.. మా మధ్య 25 సంవత్సరాల అనుబంధం ఉంది. పవన్ కళ్యాణ్‌ను దగ్గర నుంచి చూసిన వ్యక్తిగా.. ఓ నటుడిగా కంటే కూడా మంచి ఆశయాలున్న మనిషిగా ఆయన నాకు ఎక్కువ ఇష్టం. సమాజం గురించి ఎక్కువగా ఆలోచిస్తుంటారు. ఖుషి సమయంలో ఆయన ఆలోచన విధానం చూసి ఆశ్చర్యపోయాను. అది ప్రేమ కథా చిత్రం అయినప్పటికీ.. ఓ సన్నివేశంలో రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, లాలా లజపత్ రాయ్ వంటి గొప్ప వ్యక్తుల పేర్లు చెప్పారు. అలాగే ఒక పాటలో దేశభక్తిని చాటుకున్నారు. సినిమాల్లో చూపించే ఇలాంటి విషయాలు ఎందరికో స్ఫూర్తిని కలిగిస్తాయి. హరి హర వీరమల్లు కూడా విజయవంతమైన చిత్రంగా నిలవడమే కా కుండా, ప్రేక్షకుల్లో ఆలోచన కలిగిస్తుంది.

*** సినిమా ఎందుకు ఇంత ఆలస్యమైంది ? పవన్ కళ్యాణ్ సహకారం ఎలా ఉంది?**

పవన్ కళ్యాణ్ సహకారం లేకుండా ఇంత భారీ చిత్రాన్ని రూపొందించడం సాధ్యం కాదు. పవన్ అంటే నాకెంత ఇష్టమో.. అలాగే నేనంటే కూడా ఆయనకి ఇష్టం. మేకర్‌గా నన్ను గౌరవిస్తారు. పవన్ పూర్తి సహకారం అందించారు కాబట్టే.. ఈ సినిమా ఇంత గొప్పగా తీయగలిగాము. అలాగే టీం అందరూ ఎంతో సహకరించారు. అందరం కలిసి ఎంతో కష్టపడి ఈ సినిమాని పూర్తి చేశాము. ఇక ఆలస్యం అంటారా చాలా కారణాలు ఉన్నాయి.

*** పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ఎదిగారు. ఆయన సినిమా వస్తుం దంటే.. ఒత్తిడి ఏమైనా మీపై ఉందా?**

ఒత్తిడి ఖచ్చితంగా ఉంటుంది. అయితే ఆ ఒత్తిడిని మేము బాధ్యతగా భావించి, మరింత శ్రద్ధగా సినిమాని రూపొందించాము. పవన్ కళ్యాణ్ గౌరవానికి తగ్గట్టుగా సినిమా ఉంటుంది. అలాగే పవన్ అభిమానులతో పాటు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను.. ఈ సినిమా మెప్పిస్తుందనే నమ్మకం ఉంది.



## 'రాజు గాని సవాల్' ట్రైలర్ విడుదల

లెలిజాల రవీందర్, రితికా చక్రవర్తి హీరో హీరోయిన్ లుగా నటిస్తున్న సినిమా 'రాజు గాని సవాల్'. ఈ చిత్రాన్ని లెలిజాల కమల ప్రజాపతి సమర్పణలో, ఎల్ఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై లెలిజాల రవీందర్ నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. 'రాజు గాని సవాల్' సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హీరోయిన్స్ డింపుల్ హయతి, రాశీ సింగ్, తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు భారత్ భూషణ్, ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్, గీత రచయిత గోరటి వెంకన్న, నటుడు డా.భద్రం, ప్రసన్నకుమార్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సినిమా రక్షా బంధన్ పండుగ సందర్భంగా ఆగస్టు 8న శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

## దేశం కోసం మనలో ఒక్కడు పోస్టర్ రిలీజ్

మిలిటరి జీవితాలను ప్రతిబింబిస్తూ తెరకెక్కించిన సినిమా దేశం కోసం మనలో ఒక్కడు. గోపివర్మ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ప్రసాద్ (బాబి) నిర్మించారు. కోటేశ్వరరావు, రాజశేఖర్, కృష్ణవేణి, నాగరాజు, శ్వేత, సింధు, నాగబాబు, జ్యోతి, రాజు తదితరులు నటించారు. ఈ చిత్రం పోస్టర్‌ను హైద్రాబాద్ ప్రసాద్ లాబ్‌లో విడుదల చేశారు. ఈ చిత్ర నిర్మాణానికి ముందుకొచ్చిన నిర్మాత ప్రసాద్ కి దర్శకుడు గోపివర్మ కృతజ్ఞతలు తెలిపాడు. 'దేశం కోసం మనలో ఒక్కడు' సీక్వెల్ కూడా ప్లాన్ చేస్తున్నామని, తన దర్శకత్వంలో మొదలైన 'రాయలసీమ ప్రేమ కథ' ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకుందని వివరించాడు. ఇంత గొప్ప చిత్రం నిర్మించే అవకాశం రావడం పట్ల నిర్మాత ప్రసాద్ (బాబి) గర్వం వ్యక్తం చేశారు.




## 'గరివిడి లక్ష్మి' ఫస్ట్ లుక్




పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, టిజి కృతి ప్రసాద్ నిర్మించిన గరివిడి లక్ష్మి చిత్రం ఫస్ట్ లుక్ రిలీజ్ అయింది. హీరోయిన్ ఆనందిని 'గరివిడి లక్ష్మి' పాత్రను పరిచయం చేస్తూ పోస్టర్ విడుదల చేశారు. హాఫ్ శారీ ధరించి, రిక్షాలో కూర్చున్న ఆనంది, ఒడిలో సంగీత వాయిద్యం హార్మోనియంతో చిరునవ్వుతో కనిపించడం ఆకట్టుకుంది.గరివిడి లక్ష్మి ఒక గొప్ప బుర్రకథ కళాకారిణి. 1990లలో ఉత్తరాంధ్ర ఫోక్ సాంప్రదాయాల్ని బతికించి, ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు ఆమెకి ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. ఆమె పేరే ఇప్పుడు ఆ ప్రాంత చరిత్రలో నిలిచిపోయింది. 'గరివిడి లక్ష్మి' గ్రామీణ జీవనానికి, సంగీత వారసత్వానికి అద్భుతమైన ట్రిబ్యూట్ లా ఉంటుంది. ఇది ఓ ఎమోషనల్ జర్నీ, మన సంస్కృతి మీద ప్రేమతో నిర్మించిన వినోదాత్మక చిత్రమని నీరంతా విశ్వ ప్రసాద్ తెలిపారు.

## 27న 'మిస్టర్ కార్తీక్' రీ రిలీజ్



ఎన్నో సూపర్ హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన దర్శకుడు శ్రీరాఘవ దర్శకత్వంలో హీరో ధనుష్ హీరోగా రీచా గంగోపాధ్యాయ హీరోయిన్‌గా నటించిన చిత్రం మయక్కమ్ ఎన్న. తెలుగులో ఈ చిత్రం మిస్టర్ కార్తీక్‌గా 2016లో విడుదలై రొమాంటిక్ లవ్ స్టోరీగా మంచి విజయం సాధించింది.

ఇప్పుడు ధనుష్ పుట్టినరోజు సందర్భంగా మిస్టర్ కార్తీక్ సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు. జులై 27న ఈ చిత్రాన్ని భారీగా థియేటర్స్‌లో రీ రిలీజ్ చేస్తున్నారు. ఓం శివగంగా ఎంటర్ప్రైజెస్ బ్యానర్ పై శ్రీమతి కాడబోయిన లతా మండేశ్వరి సమర్పణలో నిర్మాత కాడబోయిన బాబురావు ఈ సినిమాను తెలుగులో రీ రిలీజ్ చేస్తున్నారు. హృదయాలను హత్తుకునే ప్రేమకథా చిత్రంగా దీన్ని తెరకెక్కించారు.

## శోక సంద్రంలో ఫిష్ వెంకట్ కుటుంబ సభ్యులు



అది సినిమాతో తెలుగు తెరపై ఎంట్రీ ఇచ్చిన క్యారెక్టర్ ఆర్టిస్ట్, కమెడియన్ ఫిష్ వెంకట్ అంతయక్రియలు మారేడ్ పల్లిలోని హిందూ స్మశాన వాటికలో నిర్వహించారు. ఫిష్ వెంకట్ సుమారు వంద వరకు సినిమాల్లో నటించారు. యాభై మూడు ఏళ్ళు ఉన్న వెంకట్ గత కొద్దీ రోజులుగా మూత్రపిండ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కన్ను మూశారు. రెండు కిడ్నీలు పాడైపోయిన నేపథ్యంలో ఎవరైనా దాతలు సహాయం చెయ్యాలని వెంకట్ కుమార్తె ఇటీవల ఓ వీడియో కూడా విడుదల చేశారు. ఇంతలోనే ఆయన మరణించడంతో ఫిష్ వెంకట్ కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. అది, దిల్, అత్తారింటికి దారేది, గబ్బర్ సింగ్, డీజే టిల్లు, డాన్, మిరపకాయ్ ఇలా సుమారు వంద సినిమాల్లో నటించారు. కామెడియగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. ఆయన నటించిన చివరి చిత్రం కాఫీ విత్ ఏ కిల్లర్. మచిలీపట్టణంకు చెందిన మంగళంపల్లి వెంకటేష్ సినిమాల్లోకి వచ్చిన తరువాత ఫిష్ వెంకట్‌గా పాపులర్ అయ్యారు. ఫిష్ మార్కెట్ లో పని చేసే వెంకట్ కు దివంగత జూబిలీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ పరిచయం అయ్యారు. గోపినాథ్ నిర్మించిన 1991లో నిర్మించిన జంతర్ మంతర్ సినిమాలో తొలిసారిగా వెంకట్ కు అవకాశం వచ్చింది. దివంగత నటుడు శ్రీహరి ప్రోత్సహం వల్ల చిత్రపరిశ్రమలో వెంకట్ నిలబడగలిగారు.

## వీరమల్లుకు ధరలు పెంచిన ఏపి సర్కార్




ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు సినిమాకు థియేటర్లలో టికెట్ ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ సినిమా జులై 24 విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీరమల్లుకు బంపర్ ఆఫర్ ఇచ్చింది. సింగిల్ స్క్రీన్ లో 150 రూపాయలు, మల్టి ప్లెక్స్‌లో 200 రూపాయల వరకు ధరలు పెంచుకునే వేసుకుబాటు ఏపీ ప్రభుత్వం కల్పించింది. ఈ ధరలు ఏకంగా వంద రోజుల వరకు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తెలంగాణ ప్రభుత్వం వద్దకు కూడా ధరలు పెంచాలని నిర్మాత వినతి పత్రం ఇచ్చినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం టికెట్ ధరలు పెంచకూడదు అని తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఈ సినిమాకు సున్నితంగా తిరస్కరించినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా హరిహర వీరమల్లు సినిమా కోసం అమెరికాలో విపరీతమైన డిమాండ ఉంది.23వ తేదీన అమెరికాలో ఈ సినిమా ప్రీమియర్ షో జరుగనుంది. ఈ షో కోసం ఇప్పటికే 9వేలకు పైగా టికెట్లు బుకింగ్ జరిగినట్టు నిర్మాత ఏ ఎం రత్నం తెలిపారు. అమెరికాలో ప్రత్యంగిరా అనే సంస్థ ఈ సినిమాను రిలీజ్ చేస్తోంది.




## భయపడుతున్న బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

బహుముఖ పోరాటాలకు సిద్ధం కావాలని మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. అప్పులున్నాయని రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేసేందుకు జాప్యం చేస్తే సిపిఐ పోరుబాట పట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. మాజీ భారతప్రధాని మన్మోహన్ సింగ్ మాదిరి అప్పుల నుంచి బయటబడే మార్గాలను అన్వేషించాని, సంక్షేమం, అభివృద్ధి విషయంలో నానిచివేత దోరణి మానుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో తమ బలానికి అనుగుణంగా పొత్తులు కుదిరితే కలిసిపోటీ చేస్తామని, లేదంటే ఒటరిపోరుతో తమ సత్తా చాటుతామన్నారు. పార్టీ సభల్లో విప్లవ కార్యచరణతో ముందుకుసాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటమి తర్వాత కొందరు నాయకులు వేరుదారులు వెతుక్కుంటారని, అదే దారిలో బిఆర్ఎస్ కవిత పయణిస్తోందని ఆయన తెలిపారు. ప్రజల మధ్య ఉండే కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోందని, అందుకు అనుగుణంగా ప్రజల పక్షాన నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**చారిత్రిక పోరాటాలు సిపిఐ సొంతం: ఎమ్మెల్సీ నెల్లికంటి**

స్వాతంత్ర్యానంతరం అనేక చారిత్రక పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంవహించిందని ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా ఉధ్యమ కేంద్రంగా భాసిల్లిందని సిపిఐ రాష్ట్ర నాయకులు, శాసనమండలి సభ్యు లు నెల్లికంటి సత్యం తెలిపారు. నాడు సంపూర్ణ స్వాంత్ర్యానికి కమ్యూనిస్టులే పిలుపునిచ్చారని, ఆ నాటి నుండి ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతునిచ్చిన జాతీయ పార్టీగా సిపిఐ ఖ్యాతి గడించిందన్నారు. బిజెపి రామ జంపం చేస్తోందని, కానీ అయోధ్యలో ప్రజలు బిజెపిని ఓడించారని గుర్తు చేశారు. నూతన సాగు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు బిజెపి తలవంచక తప్పదలేదని ఆయన తెలిపారు. జమ్ముల జితేందర్ రెడ్డి, మందడపు రాణి, అజ్మీరా రామ్మూర్తి, దొండపాటి రమేష్, మేకల శ్రీనివాసరావు, ఎంగల ఆనందరావు అధ్యక్ష వర్గంగావ్యవహరించిన ఈ మహాసభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ సహాయ కార్యదర్శి దండి సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీరా పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ఎర్రా బాబు, ఎస్కే జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కరుణ కుమార్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆహ్వాన సంఘం అధ్యక్ష కార్యదర్శులు కర్ణాటి రామ్మోహన్ రావు, బెజవాడ రవి, బాధ్యులు ఎంఏ రహీం, ఊట్ల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది చివరినాటికి పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

కీలక మైలురాయి అని పేర్కొన్నారు. భారతీయ రైల్వేలు అత్యంత అధునికమైన, సురక్షితమైన రైలు వ్యవస్థను రూపొందించాలనే లక్ష్యంతో ఖాజీపేటలో 'మేక్ ఇన్ ఇండియా ఉద్దేశానికి ప్రోత్సాహమిస్తుందని అన్నారు. దాదాపు 40 ఏళ్ల నుంచి ఉన్న డిమాండ్‌కు రైల్వే మంత్రిత్వ శాఖ ఈ ప్రణాళికలకు ప్రాధాన్యతనిస్తూ, తెలంగాణలోని కాజీపేటలో 'రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటుకు అనుమతి ఇచ్చిందన్నారు. ప్రధానమంత్రి జూలై 8వ తేదీన శంకుస్థాపన చేశారని, ఈ ఏడాది డిసెంబర్ వరకు ప్రాజెక్టు పనులు పూర్తి అవుతావని తెలిపారు. ఈ ప్రధాన రైలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టు దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ ప్రాజెక్టు మెగా రైల్వే ప్రాజెక్టుగా రూపాంతరం చెందిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఐదేళ్లలో 16 భోగిలతో కూడిన 200 రైళ్లను తయారు చేస్తామని తెలిపారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఆర్ఎంయు ప్రాజెక్టు వల్ల 3000 మందికి శాశ్వత ఉద్యోగాలు, మరో 2000 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతంకేంద్ర ప్రభుత్వం 40 రైల్వే స్టేషన్‌లను ఆధునీకరిస్తుందని, ఈ ప్రాజెక్టు ద్వారా మెమూ కోచ్‌ల తయారీకి అవసరమైన సౌకర్యాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఖాజీపేట ప్రాంతం సామాజిక ఆర్థిక అభివృద్ధికి డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ మానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను స్థాపించాలని రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించిందని అన్నారు. మెమూ కోచ్‌లను తయారు చేయడానికి పూర్తిస్థాయి రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు దారితీసిందని సంతోషం వ్యక్తపరిచారు. తెలంగాణ రాష్ట్రం నడిబొడ్డునున్న ఒక కిందిస్థానంలో ఈ ప్రాజెక్ట్ రానుండడం ఆర్డర్లను సమర్థవంతంగా సరఫరా చేయడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ్‌తో పాటు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## కూల్చేశారు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన ఆరు నెలల్లోనే తీవ్రమైన చాలా యుద్ధాలను ఆపడం మాకు గర్వకారణం' ట్రంప్ అన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను కూల్చినట్లు పాకిస్థాన్ చెబుతోంది కానీ, అందుకు ఆధారాలు చూపలేదు. యుద్ధ విమానాల కూల్చివేత అంశంలో భారత్ త్రివిధ దళాల అధిపతి అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతీయ వైమానికి దళానికి చెందిన యుద్ధ విమానాలను కోల్పోయినట్లు పేర్కొన్నారు. కానీ పాకిస్థాన్ చెబుతున్నట్లు ఆరు విమానాలను కోల్పోలేదన్నారు. కూలిన విమానాల సంఖ్యను మాత్రం ఆయన వెల్లడించలేదు.

## ఫోర్త్‌ఎస్టేట్‌గా మీడియాకు ప్రత్యేక ప్రాధాన్యత

- జర్నలిస్టులు మీడియా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
- మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/సిద్దిపేట:** సమాజంలో ఫోర్త్ ఎస్టేట్‌గా మీడియా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుందని. ప్రస్తుతం మీడియాలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జర్నలిస్టులకు విజ్ఞానం పెంపొదించేందుకు వివిధ అంశాలతో కూడిన పలుపుస్తకాల కిట్‌ను మీడియా అకాడమీ పక్షాన అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులతో క్వాలిటీ జర్నలిజంపై అవగాహన జ్ఞానం పెరుగుతుందన్నారు. అలాగే స్థానిక సమస్యలు.. ప్రజల అవసరాలను ప్రభుత్వానికి అనుసందానంగా వార్తలు రాయటం వల్ల సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో శనివారం జర్నలిస్టుల శిక్షణ తరగతుల రెండవరోజు సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించి, నైతిక నియామవళి, మీడియా చట్టాలు అనే అంశంపై ప్రసంగించారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టులు మీడియా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జర్నలిస్టుల చట్టాలకై ప్రెస్ అకాడమీ ఆఫ్ ఇండియా ట్రిబ్యూనల్‌గా పనిచేస్తుందన్నారు. ఇది సుప్రీంకోర్టు అథారిటీలో పనిచేస్తుందన్నారు. మీడియా సమాచారాన్ని సేకరించటతో పాటు వ్యవస్థలో వినోదాన్ని ఆనందాన్ని పంచటంలో ప్రజల అవసరాలను తీర్చేదిగా ఉండాలని వ్యాఖ్యనించారు. సమాజంలో ఎవరి మనోభావాలు దెబ్బతీసేవిధంగా ఉండవద్దని సూచించారు. ప్రజా అవసరాలను తీర్చేవిధంగా జర్నలిజం పనిచేయాలన్నారు. రానున్న రోజుల్లో జర్నలిస్టుల సంక్షేమానికి మీడియా అకాడమీ పాటుపడుతుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రతకు పాటుపడుతుందన్నారు. ప్రజల ఆదరణ, గుర్తింపుతోనే జర్నలిస్టులకు రక్షణ కవచమన్నారు. మీడియా ఎప్పుడు ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కార దిశగా కృషిచేయాలన్నారు. ప్రజాసమస్యలను, వాస్తవాలను ప్రతిబింబించే విధంగా వార్తలు ఉండాలన్నారు. సమాజంలో ఏవర్గాం మనోభావాలను దెబ్బతీయవద్దన్నారు. మీడియా కొన్ని సార్లు స్వీయ నియంత్రణ దాటుతుందని, స్వీయ నియంత్రణ మనమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. సోషల్ మీడియా వేగంగా విస్తరిస్తుందని, కొన్ని పర్యాయాలు హద్దులు దాటి ప్రవరిస్తుందన్నారు. సోషల్ మీడియాకు ప్రభుత్వం నుండి ఎలాంటి గుర్తింపు లేదన్నారు. సోషల్ మీడియాను కట్టడి చేసేందుకు కేంద్ర సర్కార్ కొన్ని చట్టాలను తీసుకొచ్చే ఆలోచనలో ఉందన్నారు. వాస్తవాలను చెప్పటమే జర్నలిస్టులకు రక్షణ.. ప్రజలకు ప్రయోజనాకరంగా ఉంటుందన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇచ్చేందుకు కొత్త మార్గదర్శకాలు రూపొందుతున్నాయని, త్వరలోనే కార్యరూపం దాల్చనుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, రక్షణ కోసం మీడియా అకాడమీ కృషిచేస్తుందన్నారు.




**ప్రజలకు, ప్రభుత్వానికి మీడియా వారధి : కలెక్టర్ హైమావతి**

ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా మీడియా నిస్పక్షతపాతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. సోమవారం విపంచి కళావేదికలో మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సిద్దిపేట జర్నలిస్టులకు రెండు రోజలపాటు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో కలెక్టర్ హైమావతి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషిచేస్తామన్నారు. అదేవిధంగా మీడియా పక్షాన తనవంతు సహకారం అందిస్తామన్నారు. జర్నలిజం వృత్తిగా కాక సామాజిక బాధ్యత అన్నారు. అంతకుముందు సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. జర్నలిజం, గతం, వర్తమానం భవిష్యత్తు మీడియా దోరణులు. మీడియాలో వస్తున్న మార్పులపై వివరించారు. సీనిజయర్ జర్నలిస్టు ఉడుమల సుధాకర్ రెడ్డి ఫేక్‌న్యూస్, సైబర్ క్రైమ్, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు, ఎలా వైరల్ అవుతాయో వివరించారు. సీనియర్ జర్నలిస్టు గోవింద్‌రెడ్డి వార్తల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం శిక్షణ పొందిన జర్నలిస్టులకు సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఒ జైదేవ్‌ఆర్య, మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకటన చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. భారత్, పాక్ రెండు దేశాలు అ ణ్వాయుధాలు కలిగి ఉండగా, రెండు దేశాల మధ్య యుద్ధాన్ని అమెరికా నిలిపివేసిందని ట్రంప్ మళ్లీ వ్యాఖ్యానించారన్నారు. యుద్ధం కొనసాగితే వాణిజ్య ఒప్పందం ఉండదని అమెరికా అధ్యక్షుడు తన వ్యాఖ్యలను పునరుద్ఘాటించారని ఆయన అన్నారు. భారత్, పాక్ అమెరికాతో వాణిజ్య ఒప్పందం కోరుకుం టే, వారు వెంటనే కాల్పుల విరమణకు అంగీకరించాలని ట్రంప్ పేర్కొన్నారని రమేష్ ఎత్తి చూపారు. తాజాగా అధ్యక్షుడు ట్రంప్ చేసిన సంచలనాత్మక కొత్త వెల్లడి ఏమిటంటే ఐదు జెట్‌లు కూలిపోయి ఉండవచ్చని పేర్కొనడమన్నారు. 'సెప్టెంబర్ 2019లో 'హౌడీ మోదీ', ఫిబ్రవరి 2020లో 'నమస్తే ట్రంప్'తో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో స్నేహ సంబంధాలు కలిగి ఉన్న ప్రధానమంత్రి, ఇప్పుడు అధ్యక్షుడు ట్రంప్ గత 70 రోజులుగా ఏమి చెబుతున్నారనే దానిపై పార్లమెంటులో స్పష్టమైన, వర్గీకృత ప్రకటన చేయాలని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. శుక్రవారం వైట్ హౌస్‌లో రిపబ్లికన్ సెనేటర్లకు ఇచ్చిన విందులో ట్రంప్ మాట్లాడుతూ భారత్, పాక్ సైనికులు వాయు మార్గాన దాడులు చేసుకున్నాయని, ఈ ఘర్షల్లో ఐదు యుద్ధ విమానాలు కూలిపోయి ఉండవచ్చన్నా రు. ఇదిలా ఉండగా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ట్రంప్ చేసిన భారత్—పాకిస్థాన్ 'కాల్పుల విరమణ' వాదనలకు మోడీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. మే 10న వాషింగ్టన్ మధ్యవర్తిత్వం వహించి సుదీర్ఘంగా జరిగిన చర్చల తర్వాత భారత్, పాకిస్థాన్ పూర్తి, తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని సోషల్ మీడియాలో ట్రంప్ ప్రకటించినప్పటి నుండి, రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను పరిష్కరించడానికి తాను సహాయం చేశానని ఆయన అనేక సందర్భాల్లో తన వాదనను పునరుద్ఘాటించారు. అయితే, రెండు దేశాల సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్స్ (డిజిఎంఒలు) మధ్య ప్రత్యక్ష చర్చల తర్వాత పాకిస్థాన్‌తో శత్రుత్వాల విరమణపై అవగాహన కుదిరిందని భారత చెబుతోంది. గత నెలలో ట్రంప్‌తో దాదాపు 35 నిమిషాల పాటు జరిగిన ఫోన్ కాల్‌లో, భారతదేశం మధ్యవర్తిత్వాన్ని 'ఎప్పటికీ అంగీకరించదు' అని , సైనిక చర్యల విరమణపై భారత, పాకిస్తాన్ సైన్యాల మధ్య చర్చలు ఇస్లామాబాద్ అభ్యర్థన మేరకు ప్రారంభించామని మోడీ దృఢంగా చెప్పారు. 26 మంది పౌరులను బలిగొన్న పహల్గామ్ దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని భారత్ మే 7న ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. నాలుగు రోజుల పాటు జరిగిన తీవ్రమైన సరిహద్దు డ్రోన్, క్షిపణి దాడుల తర్వాత, మే 10న ఇరు దేశాల మధ్య ఘర్షణను ముగించడానికి ఒక అవగాహనకు వచ్చాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com